

పోలీస్ పవర్ ఏంటో చూపిస్తా

- ఆ నాలుగింటిపై ఉక్కుపాదమే
- అక్రమ వ్యాపారాలపై కఠిన చర్యలు
- రౌడీయిజం చేస్తే చూస్తూ ఊరుకోం
- చెప్పాను.. చేసి చూపిస్తాను
- అక్రమ కేసులు అనేవి ఉండవు
- శాంతిభద్రతల పరిరక్షణకే ప్రాధాన్యం
- ఆంధ్రజ్యోతితో ఎస్పీ ఏఆర్ దామోదర్

7

నెలాఖరులోపు సదరమ్ సర్టిఫికెట్ల పరిశీలన పూర్తిచేయాలి

- కలెక్టర్ అన్సారియా

6

అలా ఎలా చేశారు?



పూర్వ పీడీని ప్రశ్నించిన త్రిసభ్య కమిటీ | ఉక్కిరిబిక్కిరి అయిన శీనారెడ్డి

- మూడు గంటల పాటు సాగిన విచారణ
- అంశాల వారీ వివరాలు కోరిన అధికారులు
- కొన్నింటిపైనే లిఖితపూర్వక సమాధానాలు
- వివరణలపై తీవ్ర అసంతృప్తి
- ఫిర్యాదులో పేర్కొన్న మరికొందరు ఉద్యోగులను
- వ్యక్తిగతంగా విచారణ చేయాలని నిర్ణయం
- వారందరికీ నోటీసులు ఇవ్వనున్న కమిటీ
- కర్రపెత్తనం చేసిన కార్యాలయంలోనే ప్రశ్నల వాన


శీనారెడ్డి నుంచి వివరాలు రాబడుతున్న విచారణ కమిటీ సభ్యులు

ప్రభుత్వ సొమ్మును అక్రమంగా బ్యాంకు నుంచి తీస్తే రికవరీ చేసి ఎలా వదిలేశారు?
సస్పెండైన వారికి తిరిగి పోస్టింగ్‌లు ఎందుకిచ్చారు?
మీకు లేని అధికారాలతో సామాజిక తనిఖీల్లో అవకతవకలు, ఏపీసీలుగా నియామకం ఎలా చేశారు?
ఉద్యోగి అయిన మీ భార్య పేరుతో అద్దె వాహనం ఎలా ఉంది? అద్దె ఎలా చెల్లించారు?
డ్వామా పూర్వ పీడీ శీనారెడ్డిపై త్రిసభ్య కమిటీ కురిపించిన ప్రశ్నల వర్షమిది. వీటిలో కొన్నింటికి మౌనం వహించగా.. మరికొన్నింటికి 'అప్పటి పరిపాలనా అవసరాల కోసం చేయాల్సి వచ్చింది' అంటూ విచారణలో దాటవేశారు.

కంటిచూపుతో నాలుగున్నరేళ్లపాటు శాసించిన కార్యాలయంలోనే డ్వామా పూర్వ పీడీ శీనారెడ్డికి విచారణ ఎదుర్కోవాల్సిన పరిస్థితులు దాపురించాయి. ఆయన పీడీగా పనిచేసిన కాలంలో భారీగా అవినీతి, అక్రమాలు జరిగి ప్రజాధనం దుర్వినియోగమైందన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో త్రిసభ్య కమిటీ విచారణ ముమ్మరంగా కొనసాగుతోంది. అందులో భాగంగా శీనారెడ్డిని గురువారం కమిటీ సభ్యులు విచారించారు. ఫిర్యాదులో ఉన్న పలు అంశాలను ప్రస్తావిస్తూ నిబంధనలు విస్మరించి అలా ఎలా పనిచేశారని ప్రశ్నించారు. కొన్నింటికి సమాధానాలు దాటవేస్తూ మరికొన్నింటిపై తూతూమంత్రంగా ఆయన జవాబు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఆయన తీరుపై త్రిసభ్య కమిటీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం.

ఒంగోలు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ పాలనలో దాదాపు నాలుగున్నరేళ్ల పాటు డ్వామా పీడీగా పనిచేసిన శీనారెడ్డి బాధ్యతగల అధికారిగా కాకుండా వైసీపీ నాయకుడి మాదిరిగా ఇష్టారీతిన వ్యవహరించాడన్న ఆరోపణలు అప్పట్లోనే వచ్చాయి. ఒకస్థాయిలో ఉండే వైసీపీ ప్రజాప్రతినిధులను సైతం లెక్కచేయని స్థాయిలో వ్యవహరించి వారి ద్వారా భారీగా అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు వచ్చాయి. అవే అంశాలపై ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి

మిగతా 6లో...

ఊరికొకటి..

- ఉపాధి నిధులతో
- చెరువుల అభివృద్ధే లక్ష్యం
- ఇప్పటికే 416 గుర్తింపు
- పూడికతీత,
- మొక్కల పెంపకం
- వాకింగ్‌ట్రాక్‌ల ఏర్పాటు
- జంగిల్ క్లియరెన్స్ పనులు



ఒంగోలు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఊరి పక్కనే ఉండే చెరువుల అభివృద్ధి పనులను ఉపాధి పథకం కింద చేపట్టనున్నారు. అమృత్-2.0 కింద కేంద్ర ప్రభుత్వం ఈ పనులకు అనుమతి ఇవ్వడంతో డ్వామా అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు కూలీలకు పనుల కల్పన ప్రధాన లక్ష్యంతో చెరువులు, కుంటలు, కాలువల్లో మట్టి తవ్వకం, డొంకలు, రోడ్ల పక్కన మొక్కలు పెంపకం, ఉద్యాన పంటలు, పక్కా గృహ నిర్మాణం ఇతరత్రా చేపడుతున్నారు. గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రెయిన్లు, శ్మశాన వాటికల అభివృద్ధి, ప్రహరీలు, మినీగోకులం షెడ్ల నిర్మాణం, ఇతరత్రా పనులను మెటీరియల్ కోటా నిధులతో పెద్దఎత్తున చేస్తున్నారు. అలా ఒకవైపు గ్రామీణ కూలీలకు ఉపాధి కల్పించే పనులు చేస్తూనే మరోవైపు గ్రామాల్లో మౌలిక సదుపాయాల మెరుగునకు సంబంధించినవి ఈ పథకం కింద జరుగుతున్నాయి. అమృత్ సరోవర్ పథకం పేరుతో గ్రామాల్లో లేదా గ్రామాలకు అత్యంత సమీపంలో ఆయకట్టు భూమి లేకుండా తాగునీరు లేదా ఇతర సాధారణ అవసరాలకు వాడకం

మిగతా 6లో...


జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎమ్మెల్యేలు ఉగ్ర, బూచేపల్లి, వివిధ శాఖల అధికారులు

అంశాలవారీగా చర్చ

స్థాయీ సంఘాల సమావేశాల్లో పలు అంశాలపై తీర్మానం

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాల్లో పలు అంశాలపై చర్చించారు. స్థానిక పాత జిల్లా పరిషత్ సమావేశపు హాలులోని జడ్పీ చైర్‌పర్సన్ చాంబర్‌లో గురువారం చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన సమావేశాలు జరిగాయి. వాటిలో కనిగిరి, దర్శి శాసనసభ్యులు డాక్టర ఉగ్ర నరసింహారెడ్డి, డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. జడ్పీ సీఈవో బి.చిరంజీవి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్య, వైద్యంతోపాటు ఐసీడీఎస్, సాంఘిక సంక్షేమశాఖలపై చర్చించారు. సభ్యులు అడిగిన పలు అంశాలకు అధికారులు సమాధానాలు ఇచ్చారు. జిల్లా స్థాయీసంఘాల సమావేశాలలో అజెండా అంశాలను ఆమోదించారు. 5వ కమిటీకి మారెడ్డి అరుణ, ఆరవ కమిటీకి చుండి సుజ్ఞానమ్మ అధ్యక్షత వహించారు.

నేడు జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

ఎగ్జిబిషన్‌కు 114 ప్రాజెక్టులు

ఒంగోలు విద్య, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పాఠశాల విద్య ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఒంగోలు పబ్లిక్ స్కూలులో జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను నిర్వహించేందుకు అన్నిఏర్పాట్లు పూర్తయ్యాయి. 38 మండలాల నుంచి మూడు చొప్పున 114 ఎగ్జిబిట్లు ప్రదర్శిస్తారు. విద్యార్థులు గ్రూపు ప్రాజెక్టులు, వ్యక్తిగత ప్రాజెక్టు, టీచర్ ప్రాజెక్టు మొత్తం మూడు కేటగిరీలుగా ప్రదర్శిస్తారు. ప్రతి మండలం నుంచి ఎంపికైన ప్రాజెక్టులను శుక్రవారం ప్రదర్శనకు తీసుకురావాలని డీఈవో కిరణ్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు.

నేటి నుంచి మధ్యాహ్న భోజనం

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు అమలు

ఒంగోలు విద్య, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 24 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 4,145 మంది విద్యార్థులకు శుక్రవారం నుంచి కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అందిస్తారు. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు పథకాన్ని ప్రారంభిస్తారని జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి శ్రీనివాసరావు తెలిపారు. పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న కుకింగ్ ఏజెన్సీల ద్వారానే కళాశాలలకు అందిస్తారన్నారు.

ఎమ్మెల్యేల పనితీరుపై సర్వే

- టీడీపీ శ్రేణులకు ఫోన్‌కాల్స్
- పార్టీ అధిష్ఠానం అభిప్రాయ సేకరణ

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)
తెలుగుదేశం పార్టీ శాసనసభ్యుల పనితీరుపై ప్రజాభిప్రాయ సేకరణకు అధిష్ఠానం శ్రీకారం చుట్టింది. ఆ మేరకు ఐవీఆర్ఎస్ సర్వేను చేపట్టింది. నియోజకవర్గాల వారి పార్టీ శ్రేణులకూ, కొందరు ప్రముఖులకూ ఫోన్ చేసి

మిగతా 6లో...


బొమ్మలు గీయడంలో నిమగ్నమైన శ్రీనిధి

చిత్తరువులతోనే ఊసులు

- పుట్టుకతోనే చిన్నారికి వినికిడి సమస్య
- నిరాశచెందకుండా చిత్రలేఖనంలో ప్రతిభ
- ప్రోత్సహిస్తే ప్రతిభచాటే అవకాశం
- సాధారణ పాఠశాలలోనే విద్యాభ్యాసం
- పెదాల కదలికలను చూస్తూ
- రాయడం నేర్చుకున్న బాలిక

7

ఒంగోలు సబ్ డివిజన్‌లో 30 పోలీసు చట్టం అమలు

ఒంగోలు క్రైం, జనవరి2 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలు పరిరక్షణలో భాగంగా ఒంగోలు సబ్‌డివిజన్‌లో 30 పోలీసు చట్టం అమలులో ఉందని డీఎస్పీ ఆర్.శ్రీనివాస రావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పోలీసు ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించకూడదన్నారు. ఈనెల 1నుంచి 31వ తేదీ వరకు ఈ చట్టం అమలులో ఉంటేందని, ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు.

ఊరికొకటి..

(5వ పేజీ తరువాయి)

జరిగే చెరువుల అభివృద్ధిపై కేంద్రం దృష్టిసారించింది.

గ్రామానికి ఒక చెరువు

ఈ పథకం కింద 2022లో తొలివిడతగా దేశవ్యాప్తంగా 50వేల చెరువుల అభివృద్ధికి చర్యలు తీసుకోగా ప్రస్తుతం అమృత్-2.0 కింద గ్రామానికి ఒక చెరువు అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం జిల్లాలో మండలం యూనిట్‌గా ఎంపీడీవో, ఉపాధి హామీ పథకం ఏపీవోల ఆధ్వర్యంలో చెరువుల గుర్తింపు ప్రక్రియ జరుగుతోంది. జిల్లాలో 729 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో ఇప్పటివరకు 416 చెరువులను గుర్తించారు. వాటి అభివృద్ధి పనులను ఉపాధి కూలీల ద్వారానే చేయించి వేతన రూపంలో వారికి లబ్ధిచేకూరేలా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధానంగా చెరువులు, కుంటలలో పూడిక తీయడం, ఆ మట్టిని కట్టలపై పోసి పటిష్ఠం చేయడం, చెరువు కట్టలపైనా, లోపల అలాగే చెరువులకు వెళ్లే మార్గాలలో జంగిల్ క్లియరెన్స్, కట్టలపై మొక్కల పెంపకం వంటి పనులు చేపట్టాలని నిర్దేశించారు.

వాకింగ్ ట్రాక్‌లు

కేంద్రం సూచన మేరకు రాష్ట్రంలో ఈ తరహా అభివృద్ధి చేసే చెరువు కట్టలపై వాకింగ్‌కు అనుకూలంగా ట్రాక్‌లు ఏర్పాటుపై కూడా దృష్టిసారించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. అవసరమైతే గ్రావెల్ ఇతర మెటీరియల్ కోసం ఒక్కొక్క చెరువుకు సగటున రూ.3లక్షల వరకు నిధులు కూడా ఇవ్వనున్నట్లు ఉన్నతాధికారుల నుంచి స్థానిక అధికారులకు సమాచారం అందింది. స్థానికంగా దాతల సహకారం కూడా తీసుకొని ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా కట్టల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

దాతలు ముందుకొస్తే మరిన్ని చేస్తాం: పీడీ

జిల్లాలో ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా చెరువుల అభివృద్ధి పనులపై దృష్టి సారించినట్లు డ్వామా పీడీ జోసఫ్ కుమార్ తెలిపారు. చాలా గ్రామాల్లో ఈ తరహా చెరువులు, కుంటలు నివాసాలకు అత్యంత సమీపంలోనే ఉన్నాయని, అలాంటి వాటిని గుర్తించి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దాతలు ముందుకు వస్తే పటణాల్లో ఈ తరహా వాకింగ్ ట్రాక్‌లు ఇతర సౌకర్యాల కల్పనకు కూడా అవకాశం ఉంటుందన్నారు. ఆ దిశగా కూడా దృష్టిసారించామన్నారు.

లా, బీఈడీ అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్ గడువు పెంపు

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): లా, బీఈడీ కోర్సుల్లో అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్ల గడువును ఈనెల 5 వరకు పొడిగించినట్లు ఉన్నత విద్యామండలి ఓ ప్రకటనలో తెలిపింది. యూనివర్సిటీల్లో స్పాట్ అడ్మిషన్లు, ప్రైవేటు లా, బీఈడీ కాలేజీల్లో కేటగిరీ బీ అడ్మిషన్లకు ఈ గడువు వర్తిస్తుందని తెలిపింది. అభ్యర్థుల వినతి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఇకపై ఎలాంటి పొడిగింపు ఉండదని స్పష్టం చేసింది.

మధ్యాహ్న భోజనం.. శనివారం మెనూ మార్పు

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకంలో శనివారం అందించే ఆహారం మెనూను సవరిస్తూ మధ్యాహ్న భోజనం పథకం డైరెక్టర్ బి.శ్రీనివాసరావు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుత మెనూ ప్రకారం శనివారం రోజున విద్యార్థులకు ఆకు కూర అన్నం(పాలకూర, కొత్తిమీర, కరివేపాకు, పుదీనా), పప్పుచారు, స్వీట్ పొంగల్, రాగి జావ ఇస్తున్నారు. ఇక నుంచి ఆకు కూర అన్నం స్థానంలో సాధారణ అన్నం పెట్టి, స్థానికంగా అందుబాటులో ఉండే కూరగాయలతో కూర, స్వీట్ పొంగల్, రాగి జావ అందించాలని ఆదేశించారు.

30శాతం ఐఆర్ ప్రకటించాలి: ఆపస్

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): క్యాబినెట్ సమావేశంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిల అంశాలను ప్రస్తావించకపోవడం బాధాకరమని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) అధ్యక్షుడు ఎస్.బాలాజీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా.. ఇంతవరకు రూ.25 వేల కోట్ల బకాయిలు, ఐఆర్, డీఏ, 12వ పీఆర్ అంశాలపై సానుకూల ప్రకటనలు లేవన్నారు. ప్రతి నెలా రెండుసార్లు క్యాబినెట్ సమావేశాలు జరుగుతున్నా.. ఉద్యోగుల అంశాలపై చర్చ జరగట్లేదన్నారు. సంక్రాంతి కానుకగా 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

పకడ్బందీగా..

మూడోరోజు పరీక్షలో 188 మంది ఎంపిక

ఒంగోలు క్రైం, జనవరి2 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో గల పెరేడ్ మైదానం కానిస్టేబుళ్ల దేహదారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం 247మంది అభ్యర్థులు హాజరు కాగా 188 మెయిన్స్‌కు అర్హత సాధించినట్లు ఎస్పీ ఏఆర్.దామోదర్ తెలిపారు. మొత్తం 600మంది రావాల్సి ఉండగా 247 మంది హాజరయ్యారు. వీరిలో 188 మంది ఎంపిక కాగా 59 మంది అనర్హులుగా ప్రకటించారు. ఈనెల 10వ తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయని ఎస్పీ తెలిపారు.


పరుగు పందెంను పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్


లాంగ్ జంప్ దూకుతున్న అభ్యర్థి.. దూరాన్ని లెక్కిస్తున్న సిబ్బంది


పోటీలకు సిద్ధంగా అభ్యర్థులు


అభ్యర్థుల పరుగుపందెం

నెలాఖరులోపు సదరమ్ సర్టిఫికెట్ల పరిశీలన పూర్తిచేయాలి

● కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): చక్రాల కుర్చీలో, మంచానికి పరిమితమై నడవలేని స్థితిలో ఉండి రూ.15వేల పెన్షన్ తీసుకుంటున్న లబ్ధిదారుల సదరమ్ సర్టిఫికెట్లను పరిశీలించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. సదరమ్ సర్టిఫికెట్ల పరిశీలనపై వైద్యఆరోగ్యశాఖ, కుటుంబ సంక్షేమశాఖ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ సంబంధిత అధికారులతో గురువారం సమీక్షించారు. జిల్లాస్థాయిలో స్పెషలిస్టు డాక్టర్స్‌తో వైద్యబృందాలను ఏర్పాటు చేసి ఈ ప్రక్రియను ఈనెలాఖరులోపు పూర్తి చేయాలన్నారు. వైద్యబృందం పరిశీలన చేసేందుకు అర్హులు, అనర్హులను గుర్తించేందుకు మైక్రో యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని చెప్పారు. వైద్య, డీఆర్‌డీఏ, పంచాయతీరాజ్, మునిసిపల్‌శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు, జీజీహెచ్ సూపరింటెండెంట్ టి.జమున, డీసీహెచ్ఎస్ సూరిబాబు, లెప్రసి అధికారి సురేష్‌కుమార్, అధికారులు రవికుమార్, చిరంజీవి, వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బంగారు బాల్యంపై దృష్టి సారించాలి

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బంగారు బాల్యం కార్యక్రమంపై అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ తమీమ్‌అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో గురువారం సాయంత్రం సంబంధిత శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో పిల్లల పట్ల ముందుచూపు ఉండాలన్నారు. 15నుంచి 18 ఏళ్లలోపు డ్రాపౌట్స్ పిల్లలను గుర్తించి వారందరినీ పాఠశాలల్లో చేర్పించాలని చెప్పారు. ప్రతి పాఠశాలలో నోడల్ ఆఫీసర్‌ను ఏర్పాటు చేసి క్లబ్‌లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం అంశాల వారీగా సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు హెనసుజన్, డాక్టర్ వెంకటేశ్వర్లు, గొట్టిపాటి వెంకటనాయుడు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

కొత్తపట్నం బస్టాండ్ సరికొత్తగా...!

● ఆక్రమణల తొలగింపు



ఒంగోలు నగర వీధులను అందంగా తీర్చిదిద్దేందుకు, ట్రాఫిక్ సమస్యలు నియంత్రించేందుకు అవసరమైన చర్యలకు కార్పొరేషన్ అధికారులు శ్రీకారం పలికారు. ఈ మేరకు గురువారం స్థానిక కొత్తపట్నం బస్టాండ్‌సెంటర్‌లోని బస్టాప్‌ను ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించారు. గతంలో ఇక్కడ ఆర్టీసీకి సంబంధించిన బస్టాప్ ఉండగా, కాలక్రమేణ అది ఆక్రమణకు గురై వ్యాపార సంస్థగా మారింది. దీంతో ఆవైపు రాకపోకలు సాగించే వాహనాలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవ్వడమే కాకుండా పలు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. దీంతో కమ్మపాలెం, ఇందుర్తినగర్, మరోవైపు కొప్పోలు, కొత్తపట్నం వైపు వెళ్ళే రోడ్డు మార్గం నిరంతరం రద్దీగా ఉండటంతో అధికారులు నగర సుందరీకరణలో భాగంగా వాటిని తొలగించారు. అంతేగాకుండా ఆ ప్రాంతంలో ఉన్న రోడ్‌సైడ్ ఆక్రమణలు తొలగించి అందంగా తీర్చి దిద్దుతామని కమిషనరు వెంకటేశ్వరరావు తెలిపారు. భవిష్యత్‌లో ఈ ప్రాంతం సుందరమైన సర్కిల్‌గా తీర్చిదిద్ది ప్రజలు మెచ్చుకునే విధంగా మార్చబోతున్నట్లు ఆయన వెల్లడించారు.

- ఒంగోలుకార్పొరేషన్, ఆంధ్రజ్యోతి

అలా ఎలా చేశారు?

(5వ పేజీ తరువాయి)

శీనారెడ్డిపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఈదర మోహన్ రెండు విడతలుగా దాదాపు 50 అభియోగాలతో ప్రభుత్వానికి ఫిర్యాదు చేయగా జిల్లాలోని వివిధ ప్రాంతానికి చెందిన మరో ఐదారుగురు పలు అంశాలపై ఫిర్యాదులు చేశారు.

అక్రమాలు నిజమేనని నిర్ధారణ!

ఆయా ఫిర్యాదులపై విచారణ చేసి నివేదించాలన్న ప్రభుత్వ ఆదేశాలతో డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు నేతృత్వంలో ఆడిట్ అధికారి శంకర నారాయణరెడ్డి, స్టెప్ సీఈవో శ్రీమన్నారాయణతో కూడిన త్రిసభ్య కమిటీ విచారణ చేస్తూ పలు అంశాల్లో అక్రమాలు జరిగాయని ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. వారం క్రితం ప్రధాన ఫిర్యాదుదారుగా ఉన్న ఈదర మోహన్‌ను విచారించి పలు అంశాలపై స్పష్టత తీసుకున్నారు. సంబంధిత ఫైళ్లను పరిశీలన చేశారు. తాజాగా ఫిర్యాదులు ఎదుర్కొంటున్న డ్వామా పూర్వపు పీడీ శీనారెడ్డిని విచారించారు. పది రోజుల క్రితమే విచారణకు హాజరు కావాలని ఆయనకు నోటీసులు ఇవ్వగా గురువారం త్రిసభ్య కమిటీ ఎదుట హాజరయ్యారు. కమిటీ సభ్యులు తమకు అందిన ఫిర్యాదులపై లోతుగానే శీనారెడ్డిని వివరాలు అడుగగా కొన్నింటిని దాటవేస్తూ మరికొన్నింటిపై తన తప్పేమి లేదన్న రీతిలో సమాధానాలు చెప్పినట్లు సమాచారం.

రికవరీ చేసి వదిలేస్తారా..

'ఒంగోలు సీఎల్‌ఆర్‌సీలో రూ.14 లక్షలను బ్యాంకు నుంచి ఒక అటెండర్ డ్రా చేయడం ఏమిటి? అతని విషయంలో నిర్లక్ష్యంగా ఉన్న సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోకుండా ఏలా ఉన్నారు? క్రిమినల్ కేసు పెట్టాల్సిన ఈ విషయంలో రికవరీ చూపి సదరు వ్యక్తికి మళ్లీ పోస్టింగ్ ఎలా ఇచ్చారు?' అని కమిటీ ప్రశ్నించింది. చెక్కుపై సంతకాలను ఏపీడీ, సీఎల్‌ఆర్‌సీ డైరెక్టర్ పెట్టాల్సి ఉండన్న శీనారెడ్డి ఆ విషయంలో మరింత లోతుగా వెళితే ముగ్గురిపైనా కేసులు పెట్టాల్సి వస్తుందని, రికవరీ చేశాడు కనుక వదిలేశానని చెప్పినట్లు సమాచారం.

విచారణకు హాజరైన సమయంలో ఆయా అంశాలపై లిఖితపూర్వకంగా సమాధానాలు కూడా ఇవ్వాలని అధికారుల కమిటీ గతంలోనే సూచించగా కొన్నింటికి మాత్రమే ఇచ్చినట్లు తెలిసింది.

వారంరోజుల్లో మళ్లీ విచారణ

మొత్తంగా శీనారెడ్డి సమాధానాలపై త్రిసభ్య కమిటీ అసంతృప్తిని వ్యక్తంచేయడంతో పాటు మొత్తం అంశాలపైనా రాతపూర్వకంగా సమాధానాలు కోరినట్లు సమాచారం. గతంలో తమకు అందిన వాటితోపాటు ఇటీవల అందిన ఫిర్యాదుల్లోని అంశాలను కూడా శీనారెడ్డికి అందజేసి వారంరోజుల్లో మరోసారి హాజరై అన్ని అంశాలపై స్టేట్‌మెంట్ ఇవ్వాలని ఆదేశించారు. అనేక అంశాలలో అవకతవకలు, అక్రమాలు జరిగినట్లు అందులో కొందరు కార్యాలయ ఉద్యోగుల పాత్ర కూడా ఉన్నట్లు ఇప్పటికే నిర్ధారణకు వచ్చిన అధికారుల కమిటీ, కొందరు ఉద్యోగుల పేర్లు పలు ఫిర్యాదుల్లో ఉండగా వారందరికి నోటీసులు ఇచ్చి వ్యక్తిగతంగా విచారణ చేయాలని భావిస్తున్నట్లు తెలిసింది. త్రిసభ్య కమిటీ లోతుగా పరిశీలన చేస్తుండటం డ్వామా ఉద్యోగులలో విస్తృత చర్చతో పాటు కొందరిని కలవరపాటుకు గురిచేస్తోంది.

వైసీపీ నేత మహీధర్‌రెడ్డికి హైకోర్టులో ఉపశమనం

కందుకూరు పోలీసులు నమోదు చేసిన కేసులో తదుపరి చర్యలన్నీ 12వారాలు నిలుపుదల

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నియమావళి ఉల్లంఘించారంటూ వైసీపీనేత మాజీ మంత్రి మానుగుంట మహీధర్‌రెడ్డిపై కందుకూరు పట్టణ పోలీసులు నమోదు చేసిన కేసులో తదుపరి చర్యలు అన్నింటినీ 12వారాలపాటు నిలుపుదల చేసింది. ఈ వ్యవహారం పై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. విచారణను 8వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి గురువారం ఉత్తర్వులు ఇచ్చారు.

ఎన్నికల నియమావళి అమల్లో ఉండగా ఓటర్లను ప్రలోభపరిచేలా ప్రకటనలు చేశారని రిటర్నింగ్ అధికారి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కందుకూరు పట్టణ పోలీసులు మానుగుంట మహీధర్‌రెడ్డి పై ఐపీసీ, ప్రజా ప్రాతినిధ్యం చట్టంలోని పలు సెక్షన్ల కింద కందుకూరు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ మహీధర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం గురువారం విచారణకు రాగా పిటిషనర్ తరఫు న్యాయవాది ఐ.వెంకటేశ్వర్లు వాదనలు వినిపిస్తూ... ఎన్నికల నియమావళి అమల్లో ఉండగా ఎన్నికల్లో పోటీచేస్తున్న ఎంపీ అభ్యర్థులు, ఎమ్మెల్యేగా ఉన్న పిటిషనర్ దేవాలయాన్ని సందర్శించారన్నారు. దేవాలయం అభివృద్ధి కోసం ప్రభుత్వం నిధులు కేటాయించిందని ప్రకటన చేశారన్నారు. సొంతగా నిధులు ఇస్తానని చెప్పలేదన్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు చెల్లుబాటు కావన్నారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి కందుకూరు పట్టణ పోలీసులు నమోదు చేసిన కేసులో తదుపరి చర్యలు అన్నింటినీ 12వారాలపాటు నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు.

శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

పర్చూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులోని శ్రీవేణుగోపాల స్వామివారి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా 18 రోజులుగా గీతాపారాయణం, హనుమాన్ చాలీసా విష్ణు సహస్ర నామ పారాయణం జరుగుతోంది. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ అర్చకులు బృందావనం సత్యనారాయణ సారథ్యంలో గోదా దేవి కల్యాణం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ అధికారి దామా నాగేశ్వరరావు, రావువారి వెంకట శివ ప్రసాద్, రెడ్డెత్తు రామారావు పర్యవేక్షించారు.



సేవా దృక్పథాన్ని పెంపొందించాలి

అవీఇవీ

● డీఈవో కిరణ్‌కుమార్

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సేవా దృక్పథాన్ని పెంపొందించాలని డీఈవో కిరణ్‌కుమార్ సూచించారు. భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని పీఎంశ్రీ ఉన్నత పాఠశాలలకు చెందిన 41మంది ఉపాధ్యాయులకు స్కౌట్ మాస్టర్లుగా గురువారం ఒంగోలులోని డీఆర్‌ఆర్‌ఎం స్కూలులో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన డీఈవో మాట్లాడారు. క్రమశిక్షణ కలిగిన పౌరులుగా తయారుచేసేందుకు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు పాఠశాలలో స్కౌట్‌అండ్ గైడ్స్ ఏర్పాటు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఉపవిద్యాధికారి చంద్రమౌలేశ్వరరావు, పర్చూరు ఉపాధ్యాయ శాఖ అధికారి శ్రీనివాస్, సెక్రటరి బాలాజీ, డీఎల్.నారాయణ, బి.శివనాగిరెడ్డి, పి.వెంకట్రావు, కె.రాము, కేవీ.శేషారావు తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ డీఆర్పీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు నగరం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఫుడ్‌ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా జిల్లాలో (జిల్లా రిసోర్సుపర్సన్లు)డీఆర్పీలుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెలుగు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ తేళ్ళ రవికుమార్ గురువారం ఓ ప్రకటనలో కోరారు. డిగ్రీ పూర్తి చేసిన యువత డీఆర్పీలుగా పనిచేసేందుకు అర్హులని తెలిపారు. పార్మలైజేషన్ ఆఫ్ మైక్రోఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్(పీఎంఎఫ్ఎంఈ) పథకం అమలుకు డీఆర్పీలు పనిచేయాల్సి ఉంటుందన్నారు. ప్రతి మండలానికి ఒక డీఆర్పీని రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా నియమిస్తారని, వారికి కేటాయించిన మండలాల్లో పీఎంఎఫ్ఎంఈ పథకం కింద బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి యూనిట్లను స్థాపించుకునేందుకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను గుర్తించటం, వారికి డీపీఆర్‌లు తయారు చేయించటం, యూనిట్ స్థాపన, ఎఫ్ఎస్ఎస్ఏపై లైసెన్సు, ఉద్యమ్ నమోదు పూర్తి చేయటంలో సహకారం అందించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తులను ఈ నెల 6వ తేదీలోగా పంపుకోవాలని ఆయన కోరారు. షార్టు లిస్టు చేసిన అభ్యర్థులకు రాత పరీక్ష, ఇంటర్వ్యూ వివవరాలు ఈ మెయిల్ ద్వారా తెలియజేస్తామన్నారు. ఇతర వివరాలకు 9154395862, 9398052599 సెల్ నంబర్ల ద్వారా సంప్రదించాలని ఆయన కోరారు.

ఆక్వా షాపులను తనిఖీలు చేయాలి : జేసీ

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆక్వా షాపులను ప్రతి బుధవారం క్రమం తప్పకుండా టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు తనిఖీలు చేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో గురువారం సాయంత్రం మత్స్యశాఖ జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో జేసీ మాట్లాడారు. ఆక్వా రైతులు వినియోగించే రసాయనాలు, యాంటిబయోటిక్స్ నివారించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కమిటీ సభ్యులైన జిల్లా డ్రగ్ కంట్రోలు అధికారి, జిల్లా ఫుడ్ సెఫ్టీ అధికారి, ఎంపెడ రీజనల్ అధికారి, రెవెన్యూ, పోలీస్, మత్స్యశాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నిరంతరం ఆక్వా షాపులను తనిఖీలు నిర్వహించాలని చెప్పారు. ప్రతి శనివారం ఆక్వా రైతులు వినియోగించే రసాయనాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఆక్వా రంగంలోని ఆహార ఉత్పత్తులను ఎగుమతి చేసే క్రమంలో నిషేధిత యాంటిబయోటిక్స్ సమస్యలు రాకుండా ముందు జాగ్రత్తలు పాటించాలి సూచించారు. అందుకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చట్టపరమైన చర్యలతో పాటు జరిమానాలు విధించాలని జేసీ ఆదేశించారు. సమావేశంలో జిల్లా మత్స్యశాఖ అధికారి ఆవుల చంద్రశేఖర్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు 'ఆంధ్రజ్యోతి' ముత్యాల ముగ్గుల పోటీలు

అద్దంకి మార్కెట్ యార్డులో పూర్తయిన ఏర్పాట్లు

అద్దంకి, జనవరి 2 (ఆంధ్ర జ్యోతి) : ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్టవారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఆధ్వర్యంలో, అద్దంకిలో రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శుక్రవారం అద్దంకిలోని మార్కెట్ యార్డు ఆవరణలో జరగనున్నాయి. ఉదయం 9 గంటలకు ముగ్గుల పోటీలు ప్రారంభం కానున్నాయి. రెండు గంటల సమయంలో ముగ్గు వేయాల్సి ఉంటుంది. ప్రథమ బహుమతిగా రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.6వేలు, తృతీయ బహుమతిగా రూ.4వేలు అందజేయనున్నారు. ముగ్గుల పోటీలలో పాల్గొనే ప్రతి మహిళకు ఆకర్షణీయమైన బహుమతి ఇవ్వనున్నారు. ప్రకాశం, బాపట్ల జిల్లాల పరిధిలోని మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఫోన్ ద్వారా పేర్లు నమోదు చేసుకొని మహిళలు నేరుగా పాల్గొన వచ్చని తెలిపారు.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు

చినగంజాం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : కోళ్ల పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శీలం రమేష్ హెచ్చరించారు. పెదగంజాం గ్రామశివారులో గురువారం కోళ్ల పందేలు నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో ఎస్ఐ తన సిబ్బందితో దాడి నిర్వహించా రు. దాడిలో ఇద్దరు వ్యక్తులను అదుపులోనికి తీసుకోగా, పందేం ఆడుతున్న కొందరు తప్పించుకున్నట్లు తెలిపారు. పందెం నిర్వహిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి, వారి వద్ద ఉన్న ఒక కోడి, రూ.5వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

భూమి ఆన్‌లైన్ విషయంలో కేసు

మేదరమెట్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : మేదరమెట్లలో సాగు భూమి ఆన్‌లైన్ విషయంలో రెవెన్యూ అధికారులు, సబ్ రిజిస్ట్రార్, కొనుగోలుదారులపై మేదరమెట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫోర్జరీ కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మేదరమెట్లకు చెందిన మారిపూడి వెంకటేశ్వర్లు తనకు రావాల్సిన బకాయిపై అదే గ్రామానికి చెందిన నెక్కంటి సుబ్బారావుపై అద్దంకి కోర్టులో దావా వేశారు. విచారణలో భాగంగా న్యాయస్థానం సుబ్బారావుకు చెందిన భూమిని అటాచ్ చేసింది. ఈ విషయాన్ని రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అటాచ్‌మెంట్‌లో ఉన్న భూమిని రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్ మార్చడంతో సబ్ రిజిస్ట్రార్ వద్ద ఐదుగురు రిజిస్టర్ చేయించుకున్నారు. న్యాయస్థానం అప్పటి తహసీల్దార్, వీఆర్వో, అద్దంకి సబ్ రిజిస్ట్రార్, భూమి అమ్మిన వ్యక్తి, రిజిస్టర్ చేయించుకున్న ఐదుగురు వ్యక్తులపై ఫోర్జరీ, చీటింగ్ కేసు నమోదు చేయాలని ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు ఎస్ఐ మహమ్మద్ రఫీ కేసు నమోదు చేశారు.

5న జిల్లా స్థాయి ముగ్గుల పోటీలు

మేదరమెట్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : మేదరమెట్లలోని శ్రీ భ్రమర టౌన్ షిప్ ఆధ్వర్యంలో ఈ నెల 5న జిల్లా స్థాయి ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎండీ గల్లా రామచంద్రరావు తెలిపారు. గ్రోత్ సెంటర్‌లో నిర్వహించే పోటీలలోవిజేతలకు ప్రథమ బహుమతిగా రూ.15వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10వేలు, తృతీయ బహుమతిగా రూ.5వేలు అందిస్తున్నట్లు తెలిపారు. గంగిరెద్దులు, హరిదాసు పొంగళ్లు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ముగ్గుల పోటీలలో పాల్గొనే మహిళలు 8500248669, 8341894434 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు. మేదరమెట్లతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సంక్రాంతి పోటీలలో పాల్గొనాలని వారు కోరారు.

ఎమ్మెల్యేల పనితీరుపై సర్వే

(5వ పేజీ తరువాయి)

సమాచారాన్ని సేకరిస్తోంది. 'మీ ఎమ్మెల్యే పనితీరు ఎలా ఉంది' అన్న ప్రశ్నపై సర్వే జరుగుతోంది. పనితీరు బాగుంటే ఒకటి, పర్వాలేదు అంటే రెండు, బాగలేదంటే మూడు నొక్కండి అంటూ ఫోన్‌కాల్స్‌లో సూచిస్తూ ప్రజాభిప్రాయం తెలుసుకునే ప్రయత్నం చేస్తోంది. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు ఎమ్మెల్యేల పనితీరును సర్వే ద్వారా తెలుసుకుంటానని చెప్పిన విషయం తెలిసిందే. తదనుగుణంగా కార్యక్రమానికి శ్రీకారం పలకటంతో గురువారం కొన్ని నియోజకవర్గాల్లో ఫోన్‌కాల్స్ వచ్చాయి. ఒక్కొక్క నియోజకవర్గం నుంచి ఎంతమంది అభిప్రాయాన్ని సేకరిస్తున్నారు? కేవలం పార్టీ కార్యకర్తల అభిప్రాయానికి ప్రాధాన్యత ఇస్తారా? సామాన్య ప్రజానీకం నుంచి సేకరిస్తారా? అనేది తెలియాల్సి ఉంది.

'అమ్మ పాడే జోలపాట ఆ చిన్నారి వినలేదు. టీచర్ చెప్పే ఏ ఫర్ యాపిల్ అని మాట పలకలేదు. పుట్టుకతో వచ్చిన వినికిడి సమస్య అందుకు కారణం. కేవలం ముఖ కవళికలు, కంటితో చూస్తూ ఆ బాలిక ఓనమాలు నేర్చుకొంది. అలా కంటితో చూసిన వాటిని పొందికగా పేపర్‌పై బొమ్మలు వేస్తూ ఆ చిత్రాలతోనే ఆ చిన్నారి ఊసులాడుతోంది. మరోవైపు వినికిడి, మూగ సమస్య ఉన్న ఆ బధిర విద్యార్థిని శ్రీనిధి సాధారణ విద్యార్థులతో పాటే చదువులోనూ ప్రతిభ చూపడం గమనార్హం.


చిత్రాన్ని గీస్తున్న చిన్నారి శ్రీనిధి



పాఠశాలలో కళ్లతో చూసిన పాఠాన్ని చిత్రాన్ని వేసి పదికిపది మార్కులు సాధించిన శ్రీనిధి

చిత్తరువులతోనే ఊసులు

- పుట్టుకతోనే చిన్నారికి వినికిడి సమస్య
- నిరాశచెందకుండా చిత్రలేఖనంలో ప్రతిభ
- ప్రోత్సహిస్తే ప్రతిభ చాటే అవకాశం
- సాధారణ పాఠశాలలోనే విద్యాభ్యాసం
- నోటితో చెప్పింది చూసి ఆచరణలోకి..

ఎర్రగొండపాలెం రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎర్రగొండపాలెం మండలంలోని మిల్లంపల్లి పంచాయతీలోని వేగినాటి కోటయ్య నగర్‌కు చెందిన దాసరి సుబ్బయ్య, అనుషాకు ముగురు కుమార్తెలు. గిరిజన కుటుంబానికి చెందిన వీరు కూడా పెద్దగా చదువుకోలేదు. పెద్ద అమ్మాయి శ్రీలక్ష్మి దోర్నాల ఏకలవ్య పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. రెండో కుమార్తె శ్రీనిధి 3వ తరగతి, మూడవ కుమార్తె నాగవల్లి 1వ తరగతి ఎంపీయూపీ పాఠశాలలో చదువుతున్నారు. రెక్కల కష్టంతో కుటుంబాలను వెళ్లదీస్తున్నారు. అయితే వీరి రెండో కుమార్తె శ్రీనిధికి పుట్టుకతోనే వినికిడి సమస్య వచ్చింది. దీంతో మాటలు కూడా రావు. ఇలాంటి వారి కోసం ప్రత్యేకంగా థెరపీ ఇప్పించే ఆర్థిక స్థోమత వీరి వద్ద లేదు. ఈ చిన్నారి చికిత్స కోసం సుదూర ప్రాంతం కూడా వెళ్లలేని దైన్య పరిస్థితి వీరిది. ఈ నేపథ్యంలో చిన్నతనం నుంచి ఇంటివద్దే తోటి అక్కచెల్లెళ్లతో చిన్నారి పెరుగుతోంది. ఆచిన్నారి ప్రస్తుతం మూడో తరగతి చదువుతోంది. తనకు వినికిడి సమస్య ఉన్నప్పటికీ, నిత్యం స్థానిక ఎంపీయూపీ పాఠశాలకు వెళుతోంది. అక్కడ టీచర్లు చెప్పే పాఠాలను శ్రద్ధగా కంటి చూపుతో చూస్తుంది. టీచర్లు ఇచ్చిన హోమ్‌వర్క్‌ను పూర్తి చేస్తూ విద్యను అభ్యసిస్తోంది. చక్కటి చేతి రాతతో ఆకట్టుకొంటూ చదువులో సాధారణ విద్యార్థుల కంటే ముందే ఉంటోంది. దీంతో పాటు ఆ చిన్నారి చిత్రలేఖన కళకు ఎవరైనా మంత్రముగ్దులు కావాల్సిందే. పాఠశాల ఉపాధ్యాయులు చెప్పే చిత్రాలు, పాఠ్యపుస్తకాల్లోని చిత్రాలను చేతితో గీసి ఆకట్టుకొంటోంది. తాను గీసిన చిత్రాల ద్వారా తన ప్రతిభను పదిమందికి తెలియజేస్తోంది. చిన్నారి రైటింగ్, బొమ్మలు వేసే పద్ధతిని చూసి తల్లిదండ్రులు, టీచర్లు ప్రోత్సహిస్తున్నారు. ప్రభుత్వం నుంచి కూడా ప్రోత్సాహం అందిస్తే మరింత ముందుకు పోతుందని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.


చిన్నారి శ్రీనిధి వేసిన చిత్రాలు

కూలి పనులు చేసుకుంటూ...

పేద గిరిజన కుటుంబానికి చెందిన సుబ్బయ్య అనూష దంపతులు ఇద్దరు కూలీ పనులకు వెళుతూ ముగ్గురు కుమార్తెలను చదివించుకుంటున్నారు. దివ్యాంగురాలైన రెండోకుమార్తె పింఛన్ కోసం ఎన్నోసార్లు ప్రయత్నం చేసినా స్లాట్ ఓపెన్ కాకపోవడంతో శ్రీనిధికి పింఛన్ రాలేదు. ఇటీవల సదరం సర్టిఫికెట్‌ను పొందారు. ఇక కొత్తగా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. వాటిలోనైనా తమ కుమార్తెకు పింఛన్ వచ్చేలా చూడాలని ప్రభుత్వానికి కోరుతున్నారు. అదేవిధంగా చిన్నారి ప్రతిభను ప్రభుత్వం ప్రోత్సహించాలని కోరు తున్నారు.

శ్రీనిధి ప్రతిభ చూస్తే ఆశ్చర్యం వేస్తోంది

శ్రీనిధి చదువులో రాణించడంతో పాటు బొమ్మలు కూడా అవలీలగా వేస్తోంది. చాలాసార్లు ఆ చిన్నారి వేసే చిత్రాలను చూసి మంచి భవిష్యత్తు ఉందని అనిపిస్తోంది. పాఠశాలలో ఉపాధ్యాయులు కూడా చిన్నారిని ప్రోత్సహిస్తున్నారు.

- పి.అంజనేయులు, ఎంఈవో ఎర్రగొండపాలెం



దూర ప్రాంతాలకు వెళ్లలేక ఆగిపోయాం

శ్రీనిధికి చికిత్స, చదువు తిరుపతిలో ఉంటుందని చెప్పారు. అంతదూరం వెళ్లి చదువు చెప్పించి వైద్యం చేయించే స్థోమత మా వద్ద లేదు. ఇటీవల వరకు శ్రీనిధికి సదరం ధ్రువీకరణ పత్రం రాలేదు. స్లాట్ బుకింగ్‌లో సమస్యలు ఉన్నాయని అధికారులు చెప్పారు. ప్రస్తుతం ధ్రువపత్రం వచ్చింది. కొత్తగా వచ్చే జాబితాలో పింఛన్ వస్తుందని ఆశిస్తున్నాం. తద్వారా చిన్నారి చదువుకు ఉపయుక్తంగా ఉంటుంది.

- అనూష, శ్రీనిధి తల్లి

మత్స్యకార సహకార సంఘాలకు సబ్సిడీ రుణాలు

- జిల్లా నూతన అధ్యక్షుడు పేరయ్య


గొల్లపోతు పేరయ్య

ఒంగోలు నగరం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మత్స్యకార సహకార సంఘాలను బలోపేతం చేస్తామని, ఇందుకోసం సబ్సిడీ రుణాలు అందించేలా చర్యలు తీసుకోనున్నట్లు జిల్లా మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు గొల్లపోతు పేరయ్య తెలిపారు. నూతనంగా అధ్యక్షులుగా ఎన్నికైన ఆయన గురువారం ఒంగోలులోని మత్స్య శాఖ కార్యాలయంలో ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. వైసీపీ పాలనలో మత్స్యకార సహకార సంఘాలను పూర్తిగా గాలికొదిలేశారని విమర్శించారు. జిల్లా మత్స్యకార సహకార సంఘం పరిధిలో జిల్లాలో 97 సంఘాలు ఉన్నాయని, వాటి ద్వారా మత్స్యకారులకు సబ్సిడీ రుణాలు, చేపలసీడ్‌ను సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. 2019-2024 కాలంలో వైసీపీ ప్రభుత్వం గత తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేసిన అన్ని సంక్షేమ పథకాలను నిలిపివేసిందన్నారు. ఇప్పుడు వాటిని పునఃప్రారంభించబోతున్నాని పేర్కొన్నారు. జిల్లా సంఘం కింద పనిచేస్తున్న 97 మత్స్యకార సహకార సంఘాల్లో 47 మెరైన్, 50 ఇన్‌ల్యాండ్ సహకార సంఘాలు ఉన్నాయన్నారు. మెరైన్ సంఘాల ద్వారా సముద్రంపై వేట సాగిస్తున్న మత్స్యకారులకు 70శాతం సబ్సిడీపై బోట్లు, వలలు ఇస్తామన్నారు. అదేవిధంగా ఇన్‌ల్యాండ్ సంఘాలు ద్వారా చేపల చెరువులనే ఆధారంగా చేసుకుని జీవనం సాగిస్తున్న మత్స్యకారులకు ఆ చెరువుల్లో పెంచుకునేందుకు ఉచితంగా చేపల సీడ్‌ను అందిస్తామన్నారు. వీరికి చేపలు వేట సాగించేందుకు, చేపలు ఊరూరా తిరిగి అమ్ముకునేందుకు వాహనాలను కూడా రాయితీపై ఇస్తామని చెప్పా రు. ఆఫ్‌కాఫ్ సంస్థ ద్వారా జిల్లాలోని మత్స్యకారులకు సబ్సిడీ యూనిట్లు, ఉచితంగా చేపల సీడ్‌ను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

ఒంగోలులో రూ.కోటితో మత్స్యభవన్

మత్స్యకార సహకార సంఘానికి ఇంతవరకు జిల్లాలో సొంత భవనం లేదని ఛైర్మన్ పేరయ్య పేర్కొన్నారు. దీంతో సంఘం కార్యకలాపాలపై చర్చించేందుకు తగిన సౌకర్యం లేదని, త్వరలోనే ఆ ఇబ్బందులను అధికమించబోతున్నామన్నారు. ఒంగోలు నగరం కొప్పోలురోడ్డులో జిల్లా సహకార సంఘానికి రూ.కోటితో మత్స్యభవన్‌ను నిర్మించబోతున్నట్లు చెప్పారు. ఐ ఇప్పటికే భవన నిర్మాణానికి 10 సెంట్ల స్థలం ప్రభుత్వం కేటాయించిందని, నిధులు విడుదల చేసేందుకు సుముఖత వ్యక్తం చేసిందని పేర్కొన్నారు. త్వరలోనే భవన నిర్మాణం ప్రారంభం అవుతుందని ఆయన అన్నారు. జిల్లాలో ఉన్న 97 మత్స్యకార సహకార సంఘాల పనితీరును మెరుగుపరిచి వాటి ద్వారా మత్స్యకారులకు మెరుగైన సేవలు అందేలా చూస్తామన్నారు.

ఆసుపత్రి అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం

కనిగిరి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి పేర్కొన్నారు. న్యూ ఇయర్ వేడుకల్లో భాగంగా తనను కలసి శుభాకాంక్షలు చెప్పేందుకు వచ్చే అభిమానులు, ప్రజలు, నాయకులు బొకేలు, పూలదండలు, ఇతర వస్తువులు తీసుకురావద్దన్నారు. వాటికయ్యే ఖర్చును తాను చేపట్టిన ఆసుపత్రి అభివృద్ధి పనులకు సహకారం అందిస్తే ఎంతో మేలు చేసినవారవుతారని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. దీంతో న్యూఇయర్ వేడుకల్లో ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు చెప్పేందుకు వచ్చేవారంతా హుండీలో నగదును వేశారు. తొలుత ఎమ్మెల్యే తన సొంత నగదును రూ.50 వేలు వేశారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హుండీ నగదును తెలుగుమహిళలు లెక్కించగా రూ.2లక్షల 78వేల 337లు వచ్చాయి. ఎమ్మెల్యే వేసిన నగదుతో రూ3,28,337లు వచ్చినట్లు టీడీపీ కార్యాలయ వర్గాలు తెలిపాయి.నగదును లెక్కించిన వారిలో కరణం అరుణ, తులసి, కిన్నెరసాని, నారాయణమ్మ, నీరజ తదితరులు ఉన్నారు.


హుండీలో నగదు వేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర


నగదును లెక్కిస్తున్న తెలుగు మహిళలు

'శాంతిభద్రతల పరిరక్షణ ముఖ్యం. ప్రజల మానప్రాణాలకు విఘాతం కలిగించే అన్నీ వ్యవహారాలపై ఉక్కుపాదం మోపాం. పోలీసు ప్రథమ కర్తవ్యం అదే. పైగా ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పదేపదే అదే చెబుతున్నారు. అందుకే ఎవరికి నచ్చినా నచ్చకపోయినా రాజీలేని ధోరణితో ముందుకు పోతున్నాం. అందులోభాగంగా జూదం, మట్కా, రౌడీయిజం, అక్రమ వ్యాపారాలు ఏ రూపంలో జరుగుతున్నా నివారించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం. కొన్ని అక్రమ వ్యాపారాలకు సంబంధించి ఆయా శాఖలదే ప్రధాన బాధ్యత. ప్రభుత్వ ఆదాయానికి తూట్లు పొడుస్తూ ప్రజల్లో అలజడికి కారణమయ్యే విధంగా అక్రమాలకు పాల్పడితే చూస్తూ ఊరుకోం. పోలీసు పవర్‌ను చూపిస్తాం.' అని జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఏఆర్ దామోదర్ స్పష్టం చేశారు. ఇటీవల జిల్లాలో సంస్కరణలకు శ్రీకారం పలికి, మరికొన్ని విషయాల్లో పోలీసుశాఖ దూకుడుగా వ్యవహరిస్తున్న వైనంపై ఆయన సూటిగా తన అభిప్రాయాలను వెల్లడించారు



- ఆ నాలుగింటిపై ఉక్కుపాదమే
- అక్రమ వ్యాపారాలపై కఠిన చర్యలు
- రౌడీయిజం చేస్తే చూస్తూ ఊరుకోం
- చెప్పాను.. చేసి చూపిస్తాను
- అక్రమ కేసులు అనేవి ఉండవు
- శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం
- ఆంధ్రజ్యోతితో ఎస్పీ ఏఆర్ దామోదర్

పోలీస్ పవర్ ఏంటో చూపిస్తా

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

'ప్రజాప్రతినిధులను గౌరవిస్తాం.. అలాగని ప్రభుత్వ విధానాలకు తూట్లు పొడిచే చర్యలకు సిఫార్సులు చేస్తే తామేమి చేయలేమని' ఆయన స్పష్టం చేశారు. గురువారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన అనేక అంశాలను ప్రస్తావించారు.

అక్రమ వ్యాపారాల పరిస్థితి ఏమిటి?

జూదం, మట్కా, రౌడీయిజం, అక్రమ వ్యాపారాలను జిల్లాలో సమూలంగా రూపుమాపుతాం. ఈ అంశాల్లో ఎలాంటి సిఫార్సులు పట్టించుకోము. కింది స్థాయిలో మా సిబ్బంది ఎవరైనా తప్పుదారి పడితే ఉపేక్షించను. ఒంగోలులో ఇటీవల రౌడీయిజాన్ని అరికట్టేందుకు తీసుకున్న చర్యలు ఒక హెచ్చరిక. రాజకీయ నాయకుల పక్కన చేరి రౌడీయిజం చేయాలని చూసినా సహించను. జిల్లా నుంచి తరిమికొడతానా, ఇక్కడే ఉంచి కంట్రోల్‌లో పెడతానా అనేది బహిరంగంగా చెప్పను, చేసి చూపిస్తాను. జూద కేంద్రాలపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. ఎవరినీ ఉపేక్షించటం లేదు. అందుకే పేకాట, మట్కా నిర్వహణ, గంజాయి విక్రయాలపై ప్రత్యేక నిఘా బృందాన్ని ఏర్పాటు చేశాం. స్థానిక పోలీసు అధికారుల కన్ను కప్పాలనుకున్నా ఆ బృందం నుంచి తప్పుకోలేరు. అలాగని పండక్కో, పబ్బానికో గ్రామాల్లో రైతులు, బంధువులు సరదాగా జూదమాడితే అనవసరంగా కేసులు పెట్టబోము. మాదృష్టి అంతా ప్రత్యేక జూద కేంద్రాలను అరికట్టడంపైనే. ఎన్ని వత్తిళ్ల వచ్చినా క్లబ్బుల పేరుతో నిర్వహణకు అనుమతులు ఇచ్చే ప్రసక్తే లేదు. జూదకేంద్రాలు, గంజాయి విక్రయాలు, రౌజీయిజాన్ని చాలావరకు కంట్రోల్ చేయగలిగాము.

కొందరిపైనే అక్రమ కేసులు పెడుతున్నారా?

కొందరినే టార్గెట్ చేస్తున్నారనే ప్రచారంతో కొందరు రౌడీషీటర్లను కాపాడుకునే ప్రయత్నం జరుగుతుంది. రాజకీయ ప్రేరేపిత రౌడీమూకల విషయంలో అప్రమత్తంగా ఉన్నాము. అధికార పార్టీ నాయకులు చెప్పారని అక్రమ కేసులు బనాయించిన ఘటనలు ఒక్కటి చూపండి చర్యలు తీసుకుంటాను. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలను అరికట్టడంలో భాగంగా చాలామందిని అరెస్టు చేశాం. గతంతో పోలిస్తే దొంగతనాలు తగ్గిపోయాయి. ఆ కేసుల్లో పట్టుబడిన వారిని రాజకీయంగా కాపాడుకోవాలని చూసేవారు చేసే ప్రచారాలకు నేను సమాధానాలు చెప్పలేను.

గ్రానైట్ విషయంలో దూకుడుగా వ్యవహరించటం సమంజసమేనా?

ప్రభుత్వ ఆదాయానికి తూట్లు పొడుస్తూ ప్రజల్లో అలజడులు సృష్టించే ఏ వ్యవహారాన్నైనా నివారించే అధికారం పోలీసులకు ఉంది. అయితే మద్యం బెల్ట్ షాపుల విషయంలో ఎక్సైజ్, గ్రానైట్ అక్రమ రవాణా విషయంలో మైనింగ్ శాఖలదే ప్రధాన భూమిక. అలాగని మేము చూస్తూ ఊరుకోలేం. ఆ విషయాల్లో అప్పుడప్పుడు ప్రత్యేక తనిఖీలు చేయక తప్పదు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయంలో ఇస్తున్న ఆదేశాలను గుర్తించాలి. బెల్ట్‌షాపులు నిరోధించే విషయంలో పోలీసు శాఖకు ప్రత్యేక ఆదేశాలు ఉన్నాయి.

ట్రాఫిక్ నియంత్రణపై తీసుకుంటున్న చర్యలేమిటి?

జిల్లాలోని దాదాపు అన్నీ పట్టణ ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణపై మరింత దృష్టిసారిస్తా. స్థానికంగా వ్యాపారాలకు ఇబ్బందా, ఇతరత్రా వ్యక్తులకు ఇబ్బందా అనేది మాకు అనవసరం. ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాల్సిందే. మరికొన్ని రాష్ట్ర రహదారులపై, కూడళ్ల ప్రాంతాల్లోను ట్రాఫిక్ నిబంధనలు అమలు చేయబోతున్నాం. హెల్మెట్ వినియోగంపై రాజీలేదు. ముందుగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాం. ఆ తర్వాత వినియోగించకుంటే కఠినంగా వ్యవహరిస్తాం. ఒంగోలులో రెండు, మూడు పర్యాయాలు విస్తృత తనిఖీలు చేయగా అపహరణకు గురైన అనేక వాహనాలు దొరికాయి.

పోలీసు అధికారులు, సిబ్బంది గాడితప్పుతున్నట్లున్నారు?

జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బంది గాడితప్పితే కఠినంగానే వ్యవహరిస్తా కొన్ని పోస్టింగులు నా పరిధిలో ఉండవు. కానీ జిల్లాలో పనిచేయాల్సింది నాకిందే. ఎక్కడ ఎప్పుడు గాడితప్పినా ఉపేక్షించను. అదేసమయంలో పోలీసు అధికారులు సిబ్బందితో స్నేహపూరితంగా వ్యవహరిస్తూ వారి చేయూత కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నాను.

మీ వైఖరిపై ఎమ్మెల్యేలు కస్సుబుస్సు లాడుతున్నారు కదా..!

ఇప్పటివరకు నాకు ఎలాంటి సమస్య ఎదురుకాలేదు. ప్రజాప్రతినిధుల నుంచి మంచి సహకారం ఉంది. పోలీసుల సమర్థవంతమైన పనితీరుతో ప్రభుత్వానికి మంచిపేరు వస్తే అధికారపార్టీ ఎమ్మెల్యేలు సంతోషిస్తారు కదా.. బెల్ట్‌షాపుల విషయంలో నియోజకవర్గాల వారీ ప్రత్యేక విధానం ఏమీ లేదు. కిందిస్థాయిలో ఎక్కడైనా లోపాలుంటే చర్యలు తీసుకుంటాను.

ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు

- కోట్లాది రూపాయల విలువైన భూమి స్వాహా
- చోద్యం చూస్తున్న అధికారులు


బండిదారిని ఆక్రమించి నిర్మాణం పూర్తిచేసిన ఆక్రమణదారుడు

దర్శి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలో ప్రభుత్వ భూములను యథేచ్ఛగా ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారు. కోట్లాది రూపాయల విలువైన భూములు స్వాహా అవుతున్నప్పటికీ పట్టించుకున్న నాథుడు లేడు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నికలకు ముందు అనేకమంది పలు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అక్రమ నిర్మాణాలు ఆగలేదు. అధికారులు పట్టించుకోక పోవటంతో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలను పూర్తి చేసుకుంటున్నారు. దర్శి-కురిచేడు రోడ్డులోని 244, 247, 248,266 సర్వే నెంబర్లలలో సుమారు పది ఎకరాల బండిదారి భూమి ఉంది. ఒక కళాశాల యాజమాన్యం ఎకరానికి పైగా ఆక్రమించుకున్నారు. చుట్టుపక్కల వ్యక్తులు మరికొంత భూమిని ఆక్రమించారు. కొంతమంది అక్రమ నిర్మాణాలు నిర్మించి సొంత ఆస్తులుగా వాడుకుంటున్నారు. మరి కొంతమంది వ్యాపారులు గోడౌన్ ఏర్పాటు చేసుకొని వ్యాపారాలకు వినియోగించుకుంటున్నారు. కోట్లాది రూపాయల విలువచేసే బండిదారి భూమి అక్రమ నిర్మాణాలతో, ఆక్రమణలతో స్వాహా అవుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవటం పట్ల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

అదేవిధంగా దర్శి-అద్దంకి రోడ్డులోని 340/5 సర్వే నెంబర్‌లో 80 సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. ఆ భూమిని కొంతమంది ఆక్రమించేందుకు మళ్లీ ప్రయత్నాలు ప్రారంభించారు. కొద్దిరోజుల క్రితం ఆ భూమిలో నిర్మాణాలు చేపట్టారు. దశలవారీగా ప్రభుత్వ భూమిని పక్కనే ఉన్న సొంత భూమిలో కలుపుకునేందుకు పథకం ప్రకారం ముందుకు సాగుతున్నారు. అలాగే, దర్శి-తూర్పుగంగవరం రోడ్డులో సుమారు 30 సెంట్ల కుంట భూమికి నకిలీ పట్టాలు సృష్టించి ఆక్రమించే ప్రయత్నం చేశారు. అయితే, ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనాలతో తాత్కాలికంగా ఆభూమి ఆక్రమణకు అడ్డుకట్టపడింది. దర్శి-పొదిలి రోడ్డులో వాగు పోరంబోకు భూమిలో ముమ్మరంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నామమాత్రపు చార్జీలతో అందరికీ అందుబాటులో ఇసుక

● ఎమ్మెల్యే దామచర్ల



ఇసుక ట్రాక్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల, రియాజ్, అధికారులు

ఒంగోలు కార్పొరేషన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరి సొంతిల్లు కల సాకారం చేసేందుకు కూటమి ప్రభుత్వం కృత నిశ్చయంతో పనిచేస్తుందని, ఎన్నికల హామీల్లో భాగంగా ఉచిత ఇసుకను నామమాత్రపు చార్జీలతో అందిస్తున్నట్లు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తెలిపారు. గురువారం ఒంగోలు నగరం కొప్పోలురోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఫ్యూచర్ ట్రాన్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇసుక పంపిణీ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో పేదల సొంతింటి కల కలగానే మారిందన్నారు. ప్రజలకు అందించాల్సిన ఇసుకను తన పార్టీ శ్రేణుల లబ్ధి కోసం ఇసుక రీచ్‌లతో మాఫియా చేశారని ఆరోపించారు. ఒక్కో ట్రాక్టర్ రూ.5వేల వరకు అమ్మి ఇష్టారాజ్యంగా దోచేశారని మండిపడ్డారు. అయితే టీడీపీ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలలో ఇచ్చిన మాట నిలబెట్టుకుంటుందన్నారు. కేవలం లోడింగ్, రవాణా చార్జీలతో మాత్రమే ప్రతి ఇంటికి ఇసుక అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మైనింగ్ డీడీ రాజశేఖర్, ఏడీ వీరిష్, ట్రాన్స్‌పోర్ట్ డిప్యూటీ కమిషనర్ సుశీల, నగర కమిషనర్ వెంకటేశ్వర్వరరావు, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి నిధులతో రహదారులకు మోక్షం



గార్లపేటలో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న టీడీపీ నాయకులు

మర్రిపూడి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి నిధులతో గ్రామీణ రహదారులకు మోక్షం లభించింది. మండలంలోని పలు గ్రామాల్లో తొలిదశలో రూ2.30 కోట్లతో అంతర్గత రహదారుల అభివృద్ధికి మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి చొరవతో ఉపాధిహామీ నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో మూడు కిలోమీటర్ల మేర సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. రెండవ దశ కింద జగ్గరాజుపాలెం నుంచి వీరారెడ్డిపాలెం వెళ్లే రహదారికి రూ1.13 కోట్లు మంజూరు చేయించారు. ఆ నిధులతో 1.5 కిలోమీటర్ల తారురోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నారు. మండలంలోని గార్లపేట జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల నుంచి ఎస్సీ కాలనీకి వెళ్లే 670 మీటర్ల రహదారిని సిమెంట్ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు రూ.65 లక్షలు నిధులు మంజూరు అయ్యాయి. గురువారం సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు పార్టీ సీనీయర్ నాయకులు మాజీ సర్పంచ్ గుండపనేని వెంకటేశ్వర్లు కొబ్బరికాయ కొట్టి భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు రేగుల వీరనారాయణ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు తూళ్లూరి నరసింహారావు, స్థానిక టీడీపీ నాయకులు దేవరపు కోటేశ్వరావు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు శుభాకాంక్షలు



ఎంపీడీవో జ్యోతిని సత్కరిస్తున్న వైద్యశాఖ సిబ్బంది

మద్దిపాడు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మద్దిపాడులో ఎంపీడీవో వి.జ్యోతిని మండల వైద్యశాఖ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి గురువారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీడీవో వి.జ్యోతిని ఆమె కార్యాలయంలో కలిసి బొకే అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రజితకుమారి, సూపర్‌వైజర్ బాలకోటయ్య, నాగరాజి, సీతమ్మ, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

మంచినీటి సమస్యపై ఫిర్యాదు చేశాం

● ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సంతనూతలపాడు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు ఏపీ రెసిడెన్షియల్ స్కూల్లో తాగునీటికి కటకట అనే కథనం ఆంధ్రజ్యోతి పత్రికలో గురువారం ప్రచురితం కావడంపై ప్రిన్సిపాల్ డి.నాగేశ్వరరావు స్పందించారు. దాతలు ఇచ్చిన ఆర్వో ప్లాంట్ పనిచేయడంలేదని, ప్రభుత్వం వారు ఇచ్చిన ఆర్వో ప్లాంట్ సమస్యను కూడా పైఅధికారులకు తెలిపామన్నారు. సమస్యను యాప్‌లో నమోదు చేశామని, సంబంధిత ఆర్వో ప్లాంట్‌ను రెండురోజుల్లో సిబ్బంది వచ్చి మరమ్మతులు చేస్తారని ఆయన పేర్కొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రజా పోరాట సమితి ప్రచురించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ప్రజాసంఘాలు, బీఎస్పీ నాయకులు ఆవిష్కరించారు. స్థానిక కలెక్టరేట్ ఎదురుగా ఉన్న మంచిపుస్తకం కార్యాలయం వద్ద గురువారం జరిగిన కార్యక్రమంలో నాయకులు టి.వెంకటస్వామి, దాసరి సుందరం, చావలి సుధాకర్, కరవది సుబ్బారావు, చుండూరి రంగారావు, యాకసిరి జాలయ్య, అంజిబాబు, సత్యం, శ్రీను, దేవర కొండ వెంకటరమణ, పాల్గొన్నారు.

ఎస్‌టీయూ డైరీ..

కొండపి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ డైరీని ఎంఈవోలు కె.సురేఖ, పి.రామారావు గురువారం కొండపిలోని ఎంఈవో కార్యాలయంలో ఆవిష్కరించారు. పి.శ్రీనివాస్‌మూర్తి, కె.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కొప్పోలు రోడ్డు మురుగుమయం

సైడుకాలువలు లేక రోడ్డుపైకి చేరుతున్న వైనం

గుంతలు పడి వాహనదారుల అవస్థలు



రోడ్డుకు ఇరువైపులా నిలిచిన మురుగునీరు

ఒంగోలు(రూరల్), జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కొప్పోలు రోడ్డు మురుగుమయం అవుతోంది. సైడు కాలువలు లేకపోవడంతో సమీప కాలనీల్లోని మురుగు నీరు ఈ రోడ్డుపై చేరుతోంది. దీంతోరోజులు తరబడి నీరు నిలిచిపోవటంతో తారురోడ్డు గుంతలపడి అధ్వానంగా మారింది. దీంతో వాహనదారులు ఈ గుంతల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. వర్షాల సమయంలో ఈ రోడ్డు చెరువును తలపించేస్తోంది. రోడ్డుపై నీరు ఎటూ వెళ్లలేని పరిస్థితి నెలకొనడంతో ఈ మార్గంలో వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. ఈ రోడ్డులోని గుంతలతో ఇటీవల కొప్పోలుకు చెందిన ఇద్దరు విద్యార్థులు ట్రాక్టర్ కిందపడి మృతి చెందిన విషయం విదితమే. దీనికి తోడు రోడ్డులో మురుగు రోజులు తరబడి నిలిచిపోవటంతో దోమలు ఉత్పత్తి కేంద్రంగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి కొప్పోరోడ్డులోని సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షల వెల్లువ



కలెక్టర్ అన్సారియాకు మొక్కను అందిస్తున్న జేసీ గోపాలకృష్ణ



కలెక్టర్‌కు మొక్కను అందిస్తున్న ఎన్‌జీవో సంఘ నాయకులు



కలెక్టర్‌కు బొకే అందజేస్తున్న తహసీల్దార్లు

తరలివచ్చిన అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ తమీమ్ అన్సారియాను పలుశాఖల అధికారులు, ఉద్యోగ సంఘాలు, వివిధ వర్గాల ప్రజానీకం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మాజీప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మృతి చెందడంతో కేంద్ర ప్రభుత్వం సంతాప దినాలు ప్రకటించడంతో జిల్లా అధికారయంత్రాంగం బుధవారం నూతన సంవత్సర వేడుకలకు దూరంగా ఉన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి మొక్కలు, బొకేలు అందజేసి శుభాకాంక్షలు చెప్పారు. జేసీ ఆర్.గోపాలకృష్ణ, డీఆర్వో చిన్నఓబులేషుతో పాటు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, డీటీసీ సుశీల, వివిధ శాఖల అధికారులు లోకేశ్వరరావు, శ్రీమన్నారాయణ, ఉపేంద్ర, వెంకటేశ్వర్లు, పద్మశ్రీ తదితరులు ఉన్నారు. ఏపీఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్.శరత్‌బాబు, ఆర్‌సీహెచ్.కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌జీవో సంఘం నేతలు కలెక్టర్ అన్సారియాను కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టరేట్‌లోని వివిధ సెక్షన్ల సూపరిటెండెంట్లు కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు చెప్పారు.

అలాగే కలెక్టర్ తమీమ్ అన్సారియాకు జిల్లాలోని తహసీల్దార్లు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో గురువారం తహసీల్దార్లు, రెవెన్యూ అసోసియేషన్ నాయకులు కలెక్టర్‌ను కలిసి బొకే అందజేశారు. తహసీల్దార్లు పిన్నిక మధుసూదన్, బ్రహ్మయ్య, కలెక్టరేట్‌యూనిట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కాగా జేసీ గోపాలకృష్ణను పలు శాఖల అధికారులు, ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు కలిసి బొకేలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టరేట్‌లో నూతన సంవత్సర వేడుకలతో సందడి నెలకొంది.

వర్షాలకు దెబ్బతిన్న పంటలకు పరిహారం ఇవ్వాలి

● రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంకట్రావు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రావు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వరుసగా కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు కోరారు. స్థానిక రైతు సంఘం కార్యాలయంలో గురువారం రైతు సంఘం ఆఫీసు బేరర్ల సమావేశానికి జిల్లా అధ్యక్షుడు జె.జయంతిబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ వరుసగా వచ్చిన తుఫాన్ల కారణంగా ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. కంది పూత కాలంలో పూర్తిగా మబ్బులు ఉండటం, వర్షాల వల్ల పంట దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. అందువల్ల రైతులకు పరిహారం వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎరువుల కంపెనీలు పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. పెరిగిన ఎరువుల ధరల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సమావేశంలో నాయకులు పెంట్యాల హనుమంతరావు, అబ్బూరి వెంకటేశ్వర్లు, బెజవాడ శ్రీనివాసరావు, క్రిష్టిపాటి చిన్నపురెడ్డి, ఏడుకొండలు పాల్గొన్నారు.

పేదల మనిషి నల్లూరి అంజయ్య : సీపీఐ



మాట్లాడుతున్న ఈశ్వరయ్య

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 2(ఆంధ్రజ్యోతి) : ధనిక కుటుంబంలో పుట్టినా పేదల పక్షాన నిలిచి అనేక ఉద్యమాలకు శ్రీకారం చుట్టిన ఆదర్శనీయుడు నల్లూరి అంజయ్య అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడుగుజ్జుల ఈశ్వరయ్య పేర్కొన్నారు. నిస్వార్థ కమ్యూనిస్టు, సాయుధ పోరాట యోధుడు నల్లూరి అంజయ్య శత జయంతి ఉత్సవాల నిర్వహణ సన్నాహక సమావేశం గురువారం ఒంగోలులోని మల్లయ్యలింగం భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ జిల్లాలో పార్టీ నిర్మాణంలో అంజయ్య కీలకపాత్ర పోషించారన్నారు. దళితుల పక్షాన నిలిచి తాగునీటి ఉద్యమాన్ని నడిపిన మహోన్నతమైన వ్యక్తి అని చెప్పారు. జిల్లావ్యాప్తంగా అంజయ్య శతజయంతి ఉత్సవాలను జరపడమే కాకుండా ఆయన జీవిత చరిత్రను రేటి యువతకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. సీనియర్ నాయకులు నల్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పెద్దకొత్తపల్లి గ్రామంలో స్థానికులు అంజయ్య స్థూపంతో పాటు వేదికను కూడా ఏర్పాటు చేశారన్నారు. జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ మాట్లాడుతూ నల్లూరి అంజయ్య శత జయంతి ఉత్సవాలతో పాటు సీపీఐ శతజయంతి ఉత్సవాలను కూడా జిల్లావ్యాప్తంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఆర్.వెంకట్రావు, కె.వీరారెడ్డి, వి.హనుమారెడ్డి, ఆర్.రామకృష్ణ, ఎం.విజయ, సయ్యద్‌మౌలాలి, పి.ప్రభాకర్, నల్లూరి మురళి, కొత్తకోట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వెంకటశివాజీ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు

● నిర్వాహకులు వెంకటేశ్వర్లు, శివాజీ



పేద విద్యార్థులకు చెక్కులను అందజేస్తున్న నిర్వాహకులు వెంకటేశ్వర్లు, శివాజీ

ఒంగోలు(రూరల్), జనవరి2(ఆంధ్రజ్యోతి): వెంకటశివాజీ చారిట్రబుల్ ఫౌండేషన్ ద్వారా సామాజక సేవా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తామని సంస్థ వ్యవస్థాపకులు టుబాకో వ్యాపారులు రాయపాటి వెంకటేశ్వర్లు, రాయపాటి శివాజీలు తెలిపారు. గురువారం ఒంగోలు నగరం ముక్తినూతలపాడు గ్రామంలో గురువారం వెంకటశివాజీ చారిట్రబుల్ ఫౌండేషన్ సంస్థలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పేద విద్యార్థులకు రూ.50వేల చెక్కును, వృద్ధులకు రూ.2లక్షల చెక్కును వారు అందజేశారు. అనంతరం నిర్వాహకులు వెంకటేశ్వర్లు, శివాజీ మాట్లాడుతూ ప్రతి ఏటా పేద విద్యార్థులు, వృద్ధులకు అండగా ఉండటంతో పాటు వైద్యసేవలు అందిస్తామన్నారు. ప్రముఖ రచయిత పాటిబండ్ల ఆనందరావు మాట్లాడుతూ పేదలకు సేవ చేసేందుకు ట్రస్టును ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో త్రోవగుంట మాజీ సర్పంచ్ కట్టా శింగయ్య, నాయకులు రాయపాటి అంకయ్య, ఎంఈవో మేకల రామాంజనేయులు, హెచ్ఎం బత్తిన సుధాకర్‌రావు, మాజీ ప్రిన్సిపాల్ ఐనంపూడి వెంకటనరసింహం, బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ మేనేజర్ మార్నేని సుబ్రహ్మణ్యం, అడ్వకేట్ కొమ్మనబోయిన పిచ్చియ్య, రాయపాటి నాగేశ్వరరావు, సియోన్ పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ

జరుగుమల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): చిర్రికూరపాడు గ్రామానికి చెందిన జడ్పీ స్కూల్ పూర్వపు విద్యార్థి గుండపనేని రమేష్ స్కూల్‌లోని 13 మంది క్రీడాకారులకు రూ.10వేలు విలువైన క్రికెట్ క్రీడా దుస్తులు గురువారం పంపిణీ చేశారు. స్కూల్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం అనూరాధ మాట్లాడారు.



క్రీడా దుస్తులను అందజేస్తున్న దాత రమేష్, హెచ్ఎం అనూరాధ



నోటుపుస్తకాలను అందజేస్తున్న బ్యాంకు ప్రతినిధులు

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

సంతనూతలపాడు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కామేపల్లివారిపాలెం, మంగమూరు గ్రామాల్లోని మండలపరిషత్ పాఠశాలల విద్యారులకు గురువారం మంగమూరు కెనరాబ్యాంకు ఆధ్వర్యంలో నోటుపుస్తకాలు, పెన్నులు, పండ్లు పంపిణీ చేశారు. విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ఆర్ఎం కిశోర్‌రెడ్డి, మేనేజర్ అశ్విత్ తెలిపారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

నాగులుప్పలపాడు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాజ పేర్కొన్నారు. అమ్మనబ్రోలు జడ్పీ హైస్కూలులో విద్యార్థులకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర బాల వికాసం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజ మాట్లాడుతూ చిన్న వయసులోనే వివాహాలు చేసుకోవడం ద్వారా భవిష్యత్‌లో అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోందని, అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శ్రీదేవి, ఉషారాణి, ఉపసర్పంచ్ యజ్ఞేంద్రబాబు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

నాగులుప్పలపాడు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పోతవరం గ్రామంలోని పేకాట శిబిరంపై ఎస్ఐ శ్రీకాంత్‌త సిబ్బందితో గురువారం దాడి చేశారు. ఈ సందర్భంగా ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకొని రూ.2,160 నగదు స్వాధీనం చేసుకున్నారు.

ట్రెజరీ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ మాగుంట

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఏపీ ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఒంగోలులో గురువారం ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు ఎంపీకి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్‌కే.అబ్దుల్‌ఖాదర్, పీవీ.నారాయణ, కేవీ.కెనడి, విజయ్‌కుమార్, ఎస్.కొండలరావు, ఎం.వెంకటేశ్వర్లు, డార్విన్ తదితరులు పాల్గొన్నారు.

పేస్‌లో యోగాపై అవగాహన



సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

ఒంగోలు విద్య, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పేస్ పాలిటెక్నిక్ కళాశాల ప్రథమ సంవత్సర విద్యార్థులకు యోగాపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా యోగా గురువు ఎం.బాలకృష్ణ హాజరై యోగా, ధ్యానం చేయడం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. ప్రతిరోజు యోగాతో ఏకాగ్రతను పొందవచ్చని తెలిపారు. శారీరకంగా, మానసికంగా చాలా ధృఢంగా ఉంటారని, శరీరంలో రక్త ప్రసారణ బాగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎం.శ్రీధర్, ప్రిన్సిపాల్ జి.కోటిరెడ్డి, పేస్ కళాశాల ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, డీన్‌లు వీరాంజనేయులు, రూపా, విభాగాధిపతి బి.సుజాత, కో ఆర్డినేటర్ బి.అయ్యప్పజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

దేశ సమగ్రత కోసం కృషి చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మతం పేరుతో ప్రజలను వేరు చేసే కుట్రలను భగ్నం చేసి దేశసమగ్రత కోసం అందరూ కృషి చేయాలని సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సీపీఎం ఆధ్వర్యంలో గురువారం స్థానిక అద్దంకిబస్టాండులోని మునిసిపల్ కార్మికుల మస్టర్ పాయింట్ వద్ద కరపత్రాలను ప్రజలకు పంచారు. కొన్ని మతశక్తులు వ్యక్తి స్వేచ్ఛ, మత స్వేచ్ఛలకు భంగం కలిగిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మతోన్మాదాన్ని ప్రభుత్వాలే పెంచి పోషించడం విచారకరమన్నారు. ప్రజల్లో అనైక్యత వల్ల అభివృద్ధి కుంటుపడుతుందని, ప్రజలంతా మత సామరస్యాన్ని కాపాడుకోవాలని కోరారు. సత్యనారాయణపురం, మంగమూరు డొంకలో కరపత్రాల పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో దామా శ్రీనివాసులు, జి.రమేష్, తంబి శ్రీనివాసులు, కె.శ్రీనివాసరావు, జి.ఆదిలక్ష్మి, బీవీ.రావు పాల్గొన్నారు.

'తల్లికి వందనం'అమలు వాయిదా దారుణం

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 2(ఆంధ్రజ్యోతి) : తల్లికివందనం పథకాన్ని వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేస్తామని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించడాన్ని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.వినోద్ గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. ఎన్నో ఆశలతో కూటమికి ప్రజలు అధికారం ఇచ్చారన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో నిరాశ మిగిలిందని పేర్కొన్నారు. ఇంట్లో ఎంత మంది విద్యార్థులు ఉంటే అంతమందికి తల్లికివందనం కింద ప్రతిఏటా రూ.15వేలు ఇస్తామని చెప్పిన కూటమి నేతలు ఈ విద్యాసంవత్సరం ఇవ్వలేమని చేతులెత్తేయడం తగదన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

జీఎస్‌డబ్ల్యూఎస్ విధులకు సహకరించండి

● ఎంపీడీవో జ్యోతి

మద్దిపాడు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): జీఎస్‌డబ్ల్యూఎస్ ద్వారా మండలంలో నిర్వహిస్తున్న వివిధ సర్వేలకు సచివాలయ సిబ్బంది అందరూ సహకరించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో వి.జ్యోతి కోరారు. గురువారం మద్దిపాడు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామ కార్యదర్శులు, మండల అధికారులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామ సచివాలయాల్లో ఉన్న సిబ్బంది వివిధ కారణాలు చెబుతూ సెలవులు తీసుకుంటున్నారని, దీనివల్ల సర్వేలను నిర్వహించటం కష్టతరంగా మారిందన్నారు. పెన్షన్ల పంపిణీ సమయంలో ఎట్టి పరిస్థితుల్లోను సిబ్బందికి సెలవులు ఇవ్వద్దని ఆమె అధికారులను కోరారు. సచివాలయ కార్యదర్శులు సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు తమ సిబ్బందికి సెలవు మంజూరు చేసే క్రమంలో కార్యదర్శుల సంతకం ఉంటేనే సెలవు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో రమేష్‌బాబు, ఈవోఆర్డీ రఘుబాబు, పీఆర్ ఏఈ రవికుమార్, ఎస్ఐ బి.శివరామయ్య, డీటీ బి.అజయ్‌కుమార్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ చెన్నారెడ్డి, సీహెచ్‌వో రజితకుమారి, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేత్రదానం మహాదానం



కళ్లజోళ్లు అందజేస్తున్న చంద్రశేఖర్

టంగుటూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నేత్రదానం మహాదానం అని మాజీ ఎంపీపీ చదలవాడు చంద్రశేఖర్ అన్నారు. రావూరి వినీల ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు గురువారం కళ్ల అద్దాలు పంపిణీ చేశారు. టంగుటూరులో జరిగిన ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకుడు తిరుమల రాధాకృష్ణ పాల్గొన్నారు.

పంటల నమోదు తప్పనిసరి

టంగుటూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రైతులు తాము పండిస్తున్న పంటలను వెంటనే గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద నమోదు చేయించుకోవాలని వ్యవసాయ శాఖ ఒంగోలు సబ్‌డివిజన్ సహాయ సంచాలకుడు రమేష్‌బాబు సూచించారు. 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా మండలంలోని కాకుటూరివారిపాలెంలో జరిగిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్‌లకు శిక్షణ

జరుగుమల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్‌లకు బాలల హక్కుల పరిరక్షణ, స్కూల్ కమిటీల విధులు, బాధ్యతలు, కమిటీ సమావేశాల నిర్వహణ తదితర అంశాలపై ఎంఈవో బి.నాగేంద్రవదన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గురువారం ఉదయం జరుగుమల్లిలోని జడ్పీస్కూల్‌లో జరిగిన శిక్షణలో మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం అవసరమని అన్నారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: స్థానిక ఏపీరెసిడెన్షియల్ స్కూల్లో గురువారం మండలంలోని పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులకు, ఉపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఎంఈవోలు చంద్రమౌళీశ్వర్, వెంకారెడ్డి, రిసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు.

అవీ..ఇవీ

విశ్రాంత అధ్యాపకుడు ఐవీఎన్ఆర్ మృతి



ఐవీ నరసింహారావు (ఫైల్)

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌వీకేపీ కళాశాలలో భౌతికశాస్త్ర అధ్యాపకులుగా గుర్తింపు పొందిన ఐవీ నరసింహారావు (ఐవీఎన్ఆర్)(78) గురువారం వయోభారంతో మృతిచెందారు. పట్టణంలోని జీవీ రమణ వీధిలో నివాసం ఉండే ఆయన కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మార్కాపురం ఎస్‌వీకేపీ కళాశాలలో ఫిజిక్స్ హెడ్‌ఆఫ్‌ది డిపార్ట్‌మెంట్‌గా గతంలో సేవలందించారు. ఆ సబ్జెక్టుపై మంచి పట్టు కలిగి ఎంతోమంది విద్యార్థులను భౌతిక శాస్త్రంలో తీర్చిదిద్దారు. ఈయనకు భార్య, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఐవీఎన్ఆర్ మృతదేహాన్ని పలువురు రాజకీయ నాయకులు, పురప్రముఖులు, ఎస్‌వీకేపీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు సందర్శించి నివాళులర్పించారు. శుక్రవారం ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

రామలింగయ్య మృతికి ఎమ్మెల్యే సంతాపం

కొనకనమిట్ల, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పొదిలి మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ చప్పిడి రామలింగయ్య గుండెపోటుతో మంగళవారం మృతి చెందాడు. ఆయన మృతికి గురువారం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మండలంలోని గార్లదిన్నె గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రామలింగయ్య మరణం, పార్టీకి ప్రజలకు తీరని లోటన్నారు. కార్యక్రమంలో టీడీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

పెద్దదోర్నాల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్, డైరీని ఎంఈవోలు మస్తాన్‌నాయక్, కొండలరావు గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం మార్కాపురం డివిజన్ అధ్యక్షులు రెహమాన్, ప్రధాన కార్యదర్శి మండ్ల శ్రీనివాసులు, కోశాధికారి రెహంతుల్లా, ప్రధానోపాధ్యాయులు ఎస్‌వీ నారాయణరెడ్డి, జే.ఝాన్సీలక్ష్మీబాయి, మహంత్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి



మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈవోలు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు పట్టుదలతో చదివి మంచి ఉత్తీర్ణత శాతం సాధించాలని ఎంఈవోలు రామ్‌దాస్‌నాయక్, శర్వాణిలు అన్నారు. స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు తయారుచేసిన స్టడీ మెటీరియల్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ, విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదవాలన్నారు. ఇష్టపడి చదివితే ఏదీ కష్టం కాదన్నారు. విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్ తయారుచేసిన ఎస్టీయూను అభినందించారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు యర్రయ్య, ప్రసాద్ రావు, ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి, సుబ్బారెడ్డి, గోపాల్‌నాయక్, రామాంజనేయరెడ్డి, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు పాఠశాలల అభివృద్ధికి తోడ్పడాలి

ఎంఈవో మస్తాన్ నాయక్

పెద్దదోర్నాల, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పిల్లల తల్లిదండ్రులు పాఠశాలల అభివృద్ధికి తోడ్పడాలని ఎంఈవో మస్తాన్‌నాయక్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్ఎంసీ చైర్మన్లు, ప్రధానోపాధ్యాయులకు గురువారం పాఠశాలల అభివృద్ధిపై ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మస్తాన్‌నాయక్ మాట్లాడుతూ ఆయా పాఠశాలల్లో విద్యాభివృద్ధి జరగాలంటే కమిటీల బాధ్యత ఎక్కువగా ఉండాలన్నారు. ఈ క్రమంలో ఉపాధ్యాయుల సమన్వయంతో విద్యార్థులకు అందించే డొక్కా సీతమ్మ భోజనం పథకాన్ని పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. కార్యక్రమంలో మరో ఎంఈవో కొండలరావు, ఆర్‌పీలు కే.శ్రీనివాసులు, వీరాభద్రారెడ్డి, ఏడుకొండలు సీఆర్ఎంటీలు పాల్గొన్నారు.

పాఠశాల యాజమాన్య కమిటీలకు శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న డీవైఈవో సామ్యూల్

కంభం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వాసవీ విద్యాసంస్థల ప్రాంగణంలో గురువారం పాఠశాల యాజమాన్య కమిటీలకు, ప్రధానోపాధ్యాయులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డివైఈవో సామ్యూల్ జాన్ మాట్లాడుతూ పాఠశాల యాజమాన్య కమిటీల విధులను, బాధ్యతలను గుర్తుచేశారు. పాఠశాలలు సమగ్ర అభివృద్ధి చెందేందుకు ఈ శిక్షణ ఉపయుక్తంగా ఉంటుందన్నారు. భాగస్వామ్యం, అంచనాలు, అభివృద్ధి, ప్రణాళికల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంఈవో మాల్యాద్రి, శ్రీనివాసులు, యాజమాన్య కమిటీలు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే పాఠశాలల అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంఈవో ఆంజనేయులు

ఎర్రగొండపాలెం రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): అందరి సహకారంతోనే పాఠశాలల అభివృద్ధి సాధ్యమని ఎంఈవోలు పి.ఆంజనేయులు, మల్లునాయక్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమగ్ర శిక్షణ కార్యక్రమంలో భాగంగా హెచ్‌ఎంలకు పాఠశాలల చైర్మన్‌లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల హెచ్‌ఎంలు, చైర్మన్‌లు కలసికట్టుగా ఉండి పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పాఠశాల కమిటీ విధులు, విద్యా ప్రణాళికలపై వారికి అవగాహన శిక్షణ ఇచ్చారు. చైర్మన్లు పాఠశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. అందరు కలసి పనిచేసి విద్యార్థుల బంగారు భవితకు బాటలు వేయాలన్నారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌పీలు జిలానీ బాషా, డీఈఆర్ నాగరాజు, శ్రీభాను ప్రకాష్, ఖలీల్, హుస్సేన్ వలీ, హెచ్‌ఎంలు, చైర్మన్లు పాల్గొన్నారు.

పేదల భూముల జోలికి వస్తే సహించం

- ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి
- భూ అక్రమార్కుల ఆటకట్టిస్తామని హెచ్చరిక



గార్లదిన్నె గ్రామంలో రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల

కొనకనమిట్ల, జనవరి 2(ఆంధ్రజ్యోతి) : పేదల భూముల జోలికి వస్తే ఎంతటి వారైనా సహించేది లేదని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి హెచ్చరించారు. మండలంలోని గార్లదిన్నె గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం భూసమస్యలు పరిష్కారం దిశగా అడుగులేస్తుందన్నారు. వైసీపీ పాలనలో భూదోపిడిపై సమగ్ర విచారణ చేసి నిజమైన భూయజమానులకు న్యాయం చేసేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో దుర్మార్గులకు అంతే లేదని వాటిని సరిచేసేందుకు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు ల్యాండ్ గ్రాబింగ్ చట్టం తీసుకొచ్చారన్నారు. ఈ చట్టం ద్వారా పేదప్రజల భూములకు భరోసా ఉంటుందన్నారు. అధికారులు, నాయకులు ఎవరైనా రికార్డులలో ఎలాంటి లోసుగులు చేసినా తీవ్రపరిణామాలు ఉంటాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్వహించే ప్రజావిజ్ఞప్తుల కార్యక్రమానికి అధిక సంఖ్యలో వైసీపీ ప్రభుత్వంలో భూసమస్యలు ఎదుర్కొంటున్న బాధితులు 70శాతం మంది అర్జీలు ఇస్తున్నట్లు గుర్తుచేశారు. నాడు భూదందాతో పాటు మద్యం, ఇసుక దోపిడీకి అంతే లేకుండా పోయిందన్నారు. గత ప్రభుత్వం విద్యుత్‌రంగంపై వేల కోట్ల బకాయి పెట్టి రాష్ట్రప్రజలను దీవాలా తీయించిందన్నారు. ఇప్పుడు ఏమీ ఎరగనట్లు విద్యుత్ చార్జీలపై నిరసనల పేరుతో నాటకాలు ఆడుతోందన్నారు. తొమ్మిదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచిన ఘనత వైసీపీకే దక్కుతుందన్నారు. డిస్కమ్‌లకు విద్యుత్ చార్జీలు పెంచాలనే జీవోను నాడు వైసీపీ ఇచ్చిందన్నారు. ఆ జీవోను ఇప్పుడు డిస్కింలు అమలుచేస్తోంటే కూటమి ప్రభుత్వంపై బురదజల్లుతున్నారని చెప్పారు. విద్యుత్ చార్జీలను వారిపాలనలోనే పెంచి ఇప్పుడు నిరసన తెలపడం దొంగేదొంగన్నట్లుగా ఉందని ఎద్దేవ చేశారు. తహసీల్దార్ సురేష్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి అర్జీని 45 రోజుల్లో పరిష్కారించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కనుక భూసమస్యలు ఉన్న ప్రతి ఒక్కరు అర్జీల రూపంలో తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఈశ్వరమ్మ, ఆర్ఐ మాధవరెడ్డి, వీర్‌వోలు రమేష్, జానయ్య, దిలీప్, పలువురు వీఆర్‌వోలు, మండల ఇన్‌చార్జ్ సర్వేయర్ రాజశేఖర్, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.



కొమరోలు రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

కొమరోలు : నియోజక వర్గంలోని రైతాంగ సమస్యల పరిష్కారమే ఎన్‌డీఏ కూటమి లక్ష్యమని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. కొమరోలు గ్రామ పంచాయతీ ఆవరణలో రెవెన్యూ సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా ఎన్‌డీఏ ప్రభుత్వం చొరవతీసుకుంటుందన్నారు. దీనికి ఈ రెవెన్యూ సదస్సులే నిదర్శనం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో వచ్చే భూ సమస్యలను నూరు శాతం పరిష్కారించే దిశగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. రైతులు సమస్యలను రైతుల వద్దనే పరిష్కరించేందుకు ప్రతి రెవెన్యూ గ్రామంలో అధికారులు అందరూ ఒకే చోట ఉండి ఆ సమస్యలను అప్పటికప్పుడు పరిష్కారానికి చొరవ తీసుకుంటున్నారు. గత ప్రభుత్వం ల్యాండ్‌టైటిలింగ్ విధానం పెట్టి ప్రతి పాసుపుస్తకంపై జగన్‌రెడ్డి ఫోటో వేయిచుకుని రైతులకు అన్యాయం చేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రభుత్వ రాజముద్రతో ఉన్న పుస్తకాలను ముఖ్యమంత్రి చంద్రబాబు ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఎంపీడీవో సయ్యద్ మస్తాన్‌వలి, ఎంపీటీసీ మాజీ సభ్యులు ముత్తుముల సంజీవరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ షేక్ అబ్దుల్ ఖాదర్, నాయకులు బిజ్జం వెంటకట్రామిరెడ్డి, ముత్తుముల మదుసుధన్‌రెడ్డి, షేక్ హసీనా, జ్యోతిరెడ్డి, చలిచీమల శ్రీనివాసచౌదరి, కాంట్రాక్టర్ కృష్ణమోహన్ రెడ్డి, ముత్తుముల యల్లారెడ్డి, పులకుర్తి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 17 అర్జీలు

పెద్దదోర్నాల : మండలంలోని పెద్ద బొమ్మలాపురం గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 17 అర్జీలు అందినట్లు తహసీల్దారు కిన్నెర శాంతి తెలిపారు. అందరూ తమ భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలంటూ దరఖాస్తులు చేశారని, పరిశీలించి త్వరలోనే పాసు పుస్తకాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు సాలమ్మ, ఆర్ఐ ప్రసాద్, వీఆర్‌వో ఏడుకొండలు టీడీపీ నాయకులు ఏ వెంకటేశ్వరరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షులు వీరారెడ్డి పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా.. అధైర్యపడొద్దు

ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

మార్కాపురం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎల్లవేళలా కార్యకర్తలకు అండగా ఉంటా.. ఎవరూ అధైర్యపడొద్దు అని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం సాయంత్రం పట్టణంలోని టీడీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అయిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో లూటీ చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం వాటిని చక్కదిద్దే పనిలో నిమగ్నమైందన్నారు. పార్టీ కోసం సైనికుల్లా పనిచేసిన కార్యకర్తలు ఎన్నో ఆశలు పెట్టుకుని ఉన్నారన్నారు. భవిష్యత్తులో కార్యకర్తల ఆకాంక్షలన్నింటినీ తాము తీరుస్తామన్నారు. ప్రధానంగా కొందరు అసంతృప్తితో ఉన్న విషయం తాను గమనించానన్నారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ ఖచ్చితంగా సముచితస్థానం కల్పిస్తానన్నారు. కార్యకర్తలు అధైర్యపడకుండా ఉండాలని సూచించారు. పార్టీని ఆదరించిన ప్రతి ఒక్కరికీ అండగా తాను ఉంటానని భరోసా ఇచ్చారు. అంతేకాక భవిష్యత్తులో పార్టీలో చాలా మార్పులు ఉంటాయన్నారు. ముఖ్యంగా మున్సిపాలిటీలో ప్రతిపక్ష పార్టీ బలం ఎక్కువగా ఉన్నందున అభివృద్ధి చేసేందుకు ఆటంకాలు ఏర్పడుతున్నాయన్నారు. మనం కొందరిని కలుపుకుని బలం పెంచుకుంటే వార్డుల్లో సమస్యలను పరిష్కరించుకునేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. కూటమి ప్రభుత్వంపై ఆకర్షితులై చాలామంది పార్టీలో చేరేందుకు మొగ్గు చూపుతున్నారన్నారు. వారిని కూడా ఆహ్వానించాల్సి ఉంటుందన్నారు. పార్టీ పెద్దల సూచనల మేరకే నిర్ణయాలు తీసుకుంటున్నామన్నారు. పార్టీలో ఎవరికి ఇవ్వాల్సిన ప్రాధాన్యత వారికి ఇస్తామన్నారు. గత ఐదేళ్ల పార్టీ కోసం పనిచేసిన వారికే ప్రథమ ప్రాధాన్యత ఉంటుందన్నారు. అందుకు సీనియర్ నాయకులు, కార్యకర్తలు సంసిద్ధులై ఉండాలన్నారు. భవిష్యత్తులో కూడా నియోజకవర్గంలో టీడీపీ జెండానే ఎగిరే విధంగా అందరూ కలిసి సమష్టిగా పనిచేయాల్సి ఉందన్నారు. సమావేశంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, పట్టణ పార్టీ అధ్యక్షులు షేక్ మౌలాలి, మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి పి.ఇబ్రహీం, మాలపాటి వెంకటరెడ్డి, పి.హుసేన్‌ఖాన్, మయూరి ఖాశిం తదితరులు పాల్గొన్నారు.

రఫీ సేవలు అభినందనీయం



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎస్సై, ఎన్ఆర్ఐ రఫీ

కంభం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : పేదలకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న టీడీపీ ఎన్ఆర్ఐ ప్రచార సభ్యుడు సయ్యద్ రఫీ అభినందనీయుడని కంభం ఎస్సై నరసింహారావు తెలిపారు. గురువారం స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లా ఆవరణలో 200 మందికి పైగా పేదలు, యాచకులు, సాధువులకు రఫీ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్సై మాట్లాడుతూ శీతాకాలంలో ఎంతోమంది యాచకలు పేదలు రోడ్డుపక్కన ఫుట్‌పాత్‌లపై చలికి వణుకుతూ, దోమలతో ఇబ్బందులు పడుతూ పడుకుంటున్నారన్నారు. వారి దీన పరిస్థితిని గమనించి దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఖాదర్‌హుస్సేన్, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి గోన చెన్నకేశవులు, టీడీపీ మైనారిటీ సెల్ కార్యదర్శి సయ్యద్ నూరుల్లాఖాద్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకు గుర్తింపు కార్డు



ఆదిమూర్తిపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో

గిద్దలూరు టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఇక నుంచి ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయించనున్నట్లు ఏవో విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని గడికోట, ఆదిమూర్తిపల్లె గ్రామాలలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని పొలాల్లో సాగులో ఉన్న పంటలను పరిశీలించారు. రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏవో మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం సహకారంతో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఫార్మర్ రిజిస్టర్ కార్యక్రమం గురించి వివరించారు. వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమ పంటలకు సంబంధించి వెబ్‌సైట్‌లో రైతుల వివరాలు నమోదు చేస్తారన్నారు. రైతురిజిస్టర్ పోర్టల్‌లో నమోదు చేసిన తరువాత రైతుకు ప్రత్యేక సంఖ్యను కేటాయిస్తారన్నారు. కౌలు రైతు, వ్యవసాయ కూలీ, భూమి ఉన్న రైతు, వ్యవసాయ ఆధారిత వృత్తులపై జీవించే వారు అర్హులన్నారు. దీని ద్వారా ప్రభుత్వం నుంచి వచ్చే వివిధ రకాల రాయితీలు, భూ ఆధారిత చెల్లింపులైన పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటలబీమా, పంట నష్టపరిహారం, పంటరుణాలపై వడ్డీరాయితీ, వ్యవసాయ ఉపకరణాలు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆదిమూర్తిపల్లి సర్పంచ్ పర్వత వెంకటసుబ్బమ్మ, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, వ్యవసాయ విస్తరణాధికారి శ్రీకాంత్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు రాణా ప్రతాప్‌నాయక్, సురేఖ, పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ రఘు, రైతులు పాల్గొన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న పంటలకు పరిహారం ఇవ్వాలి

- రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంకట్రావు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రావు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వరుసగా కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పైర్లకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు డిమాండ్ చేశారు. స్థానిక రైతు సంఘం కార్యాలయంలో గురువారం ఆఫీసు బేరర్ల సమావేశానికి జిల్లా అధ్యక్షుడు జె.జయంతిబాబు అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ వరుసగా వచ్చిన తుఫాన్ల కారణంగా ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. కంది పూత కాలంలో పూర్తిగా మబ్బులు ఉండటం, వర్షాల వల్ల దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. బాధిత రైతులకు పరిహారం వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎరువుల కంపెనీలు పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. పెరిగిన ఎరువుల ధరల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సమావేశంలో నాయకులు పెంట్యాల హనుమంతరావు, అబ్బూరి వెంకటేశ్వర్లు, బెజవాడ శ్రీనివాసరావు, క్రిష్టిపాటి చిన్నపురెడ్డి, ఏడుకొండలు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని గుండ్లకమ్మ నదీ తీరాన వెలసిన లక్ష్మీపద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం మాసకల్యాణం నిర్వహించారు. స్వామి జన్మనక్షత్రం, శ్రవణా నక్షత్రం పురస్కరించుకుని అర్చకులు ఏవీకే నరసింహాచార్యులు లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి మూలవిరాట్‌లకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులకు ప్రత్యేకంగా అలంకరించారు. వైభవంగా కళ్యాణ ఘట్టాలు నిర్వహించారు. ఆలయ అధ్యక్షులు చెక్కా మాలకొండ నరసింహారావు ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.

ఆర్థికసాయం అందజేత

గిద్దలూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి కుటుంబానికి రూ.61వేల ఆర్థికసాయాన్ని దాతలు అందజేశారు. రాచర్లకు చెందిన బోగోలు యోగేంద్ర ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తలకు, కాళ్లకు తీవ్రగాయాలు కాగా, ఆయన కుటుంబానికి చికిత్స నిమిత్తం స్పందన విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ పేర్ల సుధీర్‌కుమార్‌రెడ్డి దాతలు, విద్యార్థులు, సిబ్బంది ద్వారా రూ61వేల సేకరించారు. ఆ బాలుడి చికిత్స కోసం తల్లిదండ్రులకు ఆ మొత్తాన్ని అందజేశారు.

'పీఎం కిసాన్' నగదు పెంపుపై హర్షం

గిద్దలూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పీఎం కిసాన్ పథకం కింద రైతులకు ఏడాదికి ఇస్తున్న రూ.6వేల సాయాన్ని రూ.10వేలకు కేంద్ర ప్రభుత్వం పెంచడంపై బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బీవీ.రామాంజనేయలు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. 2019 నుంచి కేంద్ర ప్రభుత్వం ఏటా రైతులకు రూ.6వేల పెట్టుబడి సాయాన్ని అందిస్తుండగా ఈ మొత్తాన్ని వచ్చే బడ్జెట్ నుంచి రూ.10వేలకు పెంచాలని నిర్ణయించడంపై రైతులకు ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుందన్నారు.

సీఎంకు మల్లికార్జుననాయుడు శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న మల్లికార్జుననాయుడు

ఎర్రగొండపాలెం రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి నలగాటి మల్లికార్జుననాయుడు మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆయననూ కలిసి శుభాకాంక్షలు తెలిపి జ్ఞాపిక అందజేశారు. అలాగే నూతనంగా చీఫ్ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టిన కావేటి విజయనంద్ యాదవ్‌ను కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు వరప్రసాద్ యాదవ్ ఉన్నారు.

పేదలకు చీరల పంపిణీ



చీరలు అందజేస్తున్న నివేదిత సొసైటీ సభ్యులు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక సుందరయ్య కాలనీలో నివేదిత రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ కళావతి, సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కందులకు పెన్నులు అందజేత

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి పిల్లలకు ఉపయోగపడే 400 పెన్నులు అందజేశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి ఈ మేరకు పెన్నులు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, ఉపాధ్యాయులు ఎం.రవిచంద్ర కుమార్, షేక్ అమీర్, బేబీ రాణి, ఉమాదేవి, సత్య రమేష్, సాంబశిరాజు, శ్యామలాదేవి తదితరులు పాల్గొన్నారు.

నాగెళ్లముడుపులో పశువైద్య శిబిరం



గొర్రెలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న పశువైద్యాధికారులు

తర్లుపాడు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగెళ్లముడుపులో డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ప్రస్తుతం గొర్రెలకు వచ్చే వ్యాధులకు టీకాలు వేసి మందులు పంపిణీ చేశారు. ప్రస్తుతం పశుగణన సర్వే నిర్వహిస్తున్నట్లు విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. అనంతరం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మిరప, కంది, మినుము పంటలను పరిశీలించి ప్రస్తుతం వచ్చే తెగుళ్లకు నివారణకు సస్యరక్షణ చర్యలు రైతులు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు, వ్యవసాయ సహాయకులు దేవేంద్ర గౌడ్, వెంకట సుబ్బమ్మ, త్రినాథ్, పుణ్యావతి, రైతులు పాల్గొన్నారు.

అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక తోడ్పాటు

గిద్దలూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నల్లబండ బజారు ఎస్సీకాలనీలో నివసిస్తున్న పల్లపాటి జోసఫ్ అనే నిరుపేద కుటుంబానికి అమ్మఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ బోనేని వెంకటేశ్వర్లు రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు భూపాల్, బాలసుబ్బయ్య, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి క్రికెట్ టోర్నమెంట్

వీసీపల్లి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదఅలవపాడులో ఈనెల 7నుంచి నియోజకవర్గస్థాయి క్రికెట్ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 6వతేదీ సాయంత్రంలోపు రూ.700 ఎంట్రీ ఫీజు చెల్లించి నమోదు చేయించుకోవాలని కోరారు. మొదటి బహుమతిగా రూ.30,116, ద్వితీయ బహుమతిగా రూ.20,116, మూడవ బహుమతిగా రూ.10,116 ఇవ్వనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 7780219338, 9640886218 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

వైరస్‌తో మూగ రోదన

పామూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): అంతుచిక్కని వైరస్‌తో ఆవులు మూగరోదన చేస్తున్నాయి. ఆవులకు చుక్కల వైరస్ వ్యాపించింది. వీటి చర్మంపై చుక్కలు పుండ్లు ఏర్పడి నెత్తురు కారుతున్నది. మండలంలోని పలు ఆవులకు వైరస్ వ్యాపించింది. సక్రమంగా మేత మేయకపోవడంతో బక్కచిక్కి నీరసం పడుతున్నాయి. పశువైద్య సిబ్బంది వైద్యం చేస్తున్నా తగ్గడంలేదని పశుపోషకులు వాపోతున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వైరస్ నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

చలో విజయవాడను జయప్రదం చేయాలి

పామూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): విశ్వ హిందూపరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 5న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆసంఘం మండల కమిటీ సభ్యులు జమకాల నరేష్, పందిటి హరీష్ పిలుపునిచ్చారు. స్థానిక మదన వేణుగోపాలస్వామి దేవస్థానంలో గురువారం జరిగిన సమావేశంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వరద ఓబులేసు, ఓగూరి ఏడుకొండలు, బండ్ల సురేష్, కె.నవీన్, శివారెడ్డి, ఎస్.తరుణ్‌కుమార్, టి.సాయిరెడ్డి, సీహెచ్ హర్షవర్ధన్, పి.సంతోష్, జి.రమణయ్య, మెంటా ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

కందిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

తాళ్లూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కందిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. తాళ్లూరు-1, తాళ్లూరు 2 రైతు సేవా కేంద్రాల పరిధిలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా కంది పంటను పరిశీలించారు. పూత, పిందె దశలో ఉన్న పొలాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ నాగరాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

వీసీపల్లి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదఅలవలపాడు సచివాలయాన్ని ఎంపీడీవో ప్రభాకరశర్మ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది హాజరును పరిశీలించారు. సమయపాలన పాటించని ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సర్వేలను త్వరగా పూర్తిచేయాలని సిబ్బందిని ఆదేశించారు.

బడిలోనే బంగారు బాల్యం

పామూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): బడిలోనే బంగారు బాల్యం ఉంటుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ అన్నారు. చదువుకుంటేనే బంగారు భవిష్యత్తు ఏర్పడుతుందని చెప్పారు. పట్టణంలోని వడ్డేపాలెం ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌ఎం జమ్ముల శ్రీనివాసులు అధ్యక్షతన బంగారు బాల్యం అనే కార్యక్రమం గురువారం నిర్వహించారు.

ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యా హక్కు బాలల హక్కు అని అన్నారు. వివక్షత, అసమానతత్వం, బాలకార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలతో బాలికల బంగారు బాల్యం కుంటుపడుతుందన్నారు. కార్యక్రమంలో స్వయంకృషి సేవా సంస్థ అధ్యక్షుడు షేక్ నాయబ్ రసూల్, ఉపాధ్యాయురాలు అరుణకుమారి, అంగన్‌వాడి కార్యకర్త షేక్ రమీజా, అమల, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

సీఎస్‌పురం(పామూరు), జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి సూచించారు. టీడీపీ సీఎస్‌పురం మండల ప్రధాన కార్యదర్శి మన్నెపల్లి శ్రీనివాసులు అనారోగ్యంతో ఒంగోలులోని ఓ ప్రయివేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకొన్న ఉగ్ర వైద్యశాలకు వెళ్లి పరామర్శించి తగు సూచనలు చేశారు. మన్నెపల్లిని పరామర్శించిన వారిలో సింగిల్‌విండో మాజీ చైర్మన్ బోయిళ్ల నారాయణరెడ్డి, టీడీపీ పట్టణ ప్రధానకార్యదర్శి బోయిన మాలకొండరాయుడు, ముప్పాళ్ల శ్రీనివాసులు, మన్నెపల్లి మహేంద్ర ఉన్నారు.

ఈపంట నమోదు చేసుకోవాలి

కనిగిరి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేసిన కంది పంట వివరాలను సీఎం యాప్‌లో నమోదు చేసుకోవాలని ఏవో జ్యోష్ణాదేవి అన్నారు. గురువారం మండలంలోని శంఖవరంలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రబీలో సాగు చేసిన మినుము, శనగ, వరి, పొగాకు, మిరప, నువ్వులు తదితర పంటలకు రైతు సేవాకేంద్రాల్లో ఈ పంట నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు, ఆర్బీకే సిబ్బంది కె.స్వర్ణ, డి.హసీనా, తదితరులు పాల్గొన్నారు.

అటవీ సంపద అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా


అటవీ డివిజన్‌స్థాయి సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న రేంజర్ ఉమామహేశ్వరరెడ్డి

- కనిగిరి డివిజన్ ఫారెస్ట్ రేంజర్ ఉమామహేశ్వరరెడ్డి

కనిగిరి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): అటవీ సంపద అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టినట్టు కనిగిరి డివిజన్ ఫారెస్ట్ రేంజర్ ఉమామహేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక అటవీశాఖ కార్యాలయంలో డివిజన్ స్థాయి ఫారెస్ట్ అధికారులు, సిబ్బందితో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ సంరక్షణే లక్ష్యంగా ఎర్రచందనం, అటవీ సంపద అక్రమ రవాణాపై ప్రత్యేకంగా బీట్ సిబ్బంది, అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలన్నారు. సీఎస్‌పురం మండలంలోని అటవీ సంపదపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. అటవీ భూముల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపాలన్నారు. రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఆక్రమణలకు గురైన వాటిని స్వాధీనం చేసుకుని, సెంటు భూమి కూడా అన్యాక్రాంతం కారాదని సూచించారు. అటవీ ప్రాంతాల్లో డ్రోన్‌ల ద్వారా నిఘా పెట్టాలని ఆదేశించారు. ఫారెస్ట్ బీట్‌లలో తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. నాగిరెడ్డిపల్లి, ముళ్ళపాడు బీట్‌లలో, అటవీ సరిహద్దులలోకి ప్రవేశించే, వెళ్ళే వాహనాలను తనిఖీలు చేపట్టాలన్నారు. సమావేశంలో డివిజన్‌స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధిలో కమిటీలదే కీలకపాత్ర

సీఎస్‌పురం(పామూరు), జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల అభివృద్ధిలో యాజమాన్య కమిటీలదే (ఎస్‌ఎంసీ) కీలక పాత్ర అని డీఎల్‌డీవో ఎం.శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం సీఎస్‌పురం మండలంలోని ప్రధానోపాధ్యాయులు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల చైర్మన్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు పాఠశాలల్లో పిల్లల నమోదు, హాజరు, నిధుల వినియోగం, మధ్యాహ్న భోజనం, విద్యార్థుల కిట్లు, పంపిణీ పర్యవేక్షణలో వారిదే కీలక పాత్ర ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ మంజునాథరెడ్డి, ఎంఈవోలు జె.ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి, రిసోర్స్ పర్సన్‌లు పి.మాలకొండయ్య, రామకృష్ణ, చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.


పామూరు: సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌డీవో ఎం.శ్రీనివాసరెడ్డి

పాఠశాలల అభివృద్ధికి తోడ్పాటునందించాలి

తాళ్లూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల అభివృద్ధికి యాజమాన్య కమిటీలు తోడ్పాటునందించాలని మండల విద్యాశాఖాధికారి జి.సుబ్బయ్య కోరారు. గురువారం స్థానిక వీకే ఉన్నత పాశాలలో పాఠశాలల యాజమాన్య కమిటీల(ఎస్‌ఎంసీ) చైర్మన్లకు, ప్రధానోపాధ్యాయులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ గ్రామంలో బడి ఈడు పిల్లలందరూ బడిలే ఉండేలా చూడాలన్నారు. దివ్యాంగులు ఏదైనా ఇతర కారణాలతో బడికి వెళ్లకున్నా, ఇతర గ్రామాలకు వలస వెళ్లి ఉంటే తగు సలహాలు అందించి చదువు కొనసాగించేలా చూడాలన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్నభోజనం మరింత మెరుగుపడేందుకు ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు రోజుకొకరు చొప్పున పరిశీలించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి సామూహిక భోజనం కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. వంట గ్యాస్, వంట గదుల నిర్మాణాలకు సహకరించాలని కోరారు. స్థానికంగా లభించే ఆకుకూరలు, పండ్లు విద్యార్థులకు అందించాలన్నారు. శుభ్రమైన మంచినీరు అందేలా చూడాలన్నారు. విద్యార్థులకు స్వచ్ఛ పాఠశాల గురించి వివరించాలన్నారు. స్వచ్ఛంద సంస్థల సహాయ సహకారాలతో పాఠశాలలను అభివృద్ధి చేయాలన్నారు. ఎంఈవో-2 ఎల్.సుధాకర్‌రావు మాట్లాడుతూ పాఠశాలలకు ఎక్కువగా రాని పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి సక్రమంగా హాజరయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వీకే ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శేషగిరిరావు, పలు పాఠశాలల హెచ్‌ఎంలు నాగరాజు, నరసింహారావు, ఎస్‌ఎంసీ చైర్మన్ అనపర్తి సత్యవర్ధన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించాలి

దొనకొండ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పాఠశాలల అభివృద్ధిలో యాజమాన్య కమిటీలు, ప్రధానోపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలని ఎంఈవో సాంబశివరావు సూచించారు. గురువారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో పాఠశాలల యాజమాన్య కమిటీ సభ్యులకు, ప్రధానోపాధ్యాయులకు జరిగిన శిక్షణలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి అందరి బాధ్యతని చెప్పారు. ప్రభుత్వం అందించే పథకాలను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ప్రభుత్వ, దాతల సహకారంతో పాఠశాలల్లో అన్నీ వసతులు కల్పించి విద్యార్థులు మంచిగా చదువుకునేలా దోహదపడాలని కోరారు. ఎస్సై విజయ్ కుమార్ మాట్లాడుతూ సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. రిసోర్స్‌పర్సన్‌లుగా కె.బాబుప్రసాద్, ఎం.మోహన్ నరసింహం, ఆర్.మనోష వ్యవహరించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 షేక్ అమీర్, పాఠశాలల యాజమాన్య కమిటీలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

పామూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యల పరిష్కరానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తహసీల్దార్ బీవీ రమణారావు అన్నారు. వీరి సమస్యలను పరిష్కరించడానికే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని చెప్పారు. గురువారం మండలంలోని వెంకటాపురంలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులకు చెందిన సమస్యలపై కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా రికార్డులు పరిశీలించి సత్వరమే న్యాయం జరిగేలా కృషి చేస్తామని సూచించారు. ఈసందర్భంగా రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కందుల శ్రీనివాసరెడ్డి, టీడీపీ నాయకులు యారవ శ్రీనువాసులు, దైండే శివశంకర్, పోతురాజు వెంకట్రావు, ఈవోపీఆర్డీ కేఎల్ శ్రీనివాసరావు, డీటీ బ్రహ్మయ్య, ఎంఆర్ఐ బి.మల్లి కార్జునరావు, మండల సర్వేయర్ స్నేహ, వీఆర్వోలు కేసీ వెంకటస్వామి, మండ్ల శ్రీనువాసులు, దుద్దుకూరు శ్రీను, పంచాయతీ కార్యదర్శి జి.నాగేశ్వరరావు, వీఆర్ఏ శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పామూరు: వెంకటాపురం రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

రెవెన్యూ సదస్సుల ద్వారా సత్వర పరిష్కారం

దర్శి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల ద్వారా సమస్యలు సత్వరమే పరిష్కారమవుతున్నాయని తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని లంకోజనపల్లిలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. ఎంతోకాలంగా చిన్న చిన్న సమస్యలు కూడా పరిష్కారం కాక యజయానులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సదస్సుల ద్వారా సమస్యలు పరిష్కారమవుతుండటంతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఆర్‌ఐ పరిటాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ముండ్లమూరులో 22 అర్జీలు

ముండ్లమూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలను పరిష్కరిస్తున్నట్టు డిప్యూటీ తహసీల్దార్ ఆర్.శ్రీకాంత్ అన్నారు. గురువారం మండలంలోని శంకరాపురం, భట్లపల్లి గ్రామాల్లో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన మాట్లాడారు. ప్రధానంగా దారి సమస్య, రైతుల సరిహద్దుల సమస్య, 1బీ, అడంగల్‌లో తప్పులు లాంటివి ఉంటే సరిచేస్తున్నట్టు చెప్పారు. ఇనాం, బండి దారి పోరంబోకు, వాగు పోరంబోకు లాంటి సమస్యలు ఉంటే జిల్లా రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నట్టు చెప్పారు. రైతులు అర్జీ ఇచ్చిన వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామన్నారు. చిన్న చిన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తున్నట్టు చెప్పారు. ఈసందర్భంగా 22 అర్జీలు వచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కూరపాటి మహేశ్వరి నారాయణస్వామి, టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ శేషగిరిరావు, గ్రామ సర్వేయర్ వెంకటరెడ్డి, వీఆర్‌వోలు సీహెచ్ బ్రహ్మతేజ, కె.దయానందం, రాఘవరెడ్డి, సుజాత, పంచాయతీ కార్యదర్శి రసూల్ తదితరులు పాల్గొన్నారు.


ముండ్లమూరు: శంకరాపురం రెవెన్యూ సదస్సులో అధికారులను ప్రశ్నిస్తున్న రైతు కృష్ణారావు

వివాదంలో ఉన్న భూమిని ఆన్‌లైన్ ఎలా చేస్తారు!

ముండ్లమూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శంకరాపురం గ్రామానికి చెందిన సర్వే నెంబరు 75/4లో ఉన్న 5.18 ఎకరాల భూమిలో 2.59 ఎకరాలకు సంబంధించి దర్శి సివిల్ జూనియర్ కోర్టులో కేసు ఉంది. దీనిని వేరే వ్యక్తుల పేరుపై ఎలా ఆన్‌లైన్ చేశారని అదే గ్రామానికి చెందిన బాధితుడైన రైతు మేడికొండ వెంకట కృష్ణారావు మొర పెట్టుకున్నారు. గురువారం గ్రామంలో రెవెన్యూ సదస్సు జరగ్గా డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్‌కు జరిగిన అన్యాయంపై అర్జీ ఇచ్చారు. 2018 నుంచే ఆ భూమిలో వివాదం ఉండటంతో దర్శి కోర్టు పెండింగ్‌లో ఉందన్నారు. ఇటీవల రెవెన్యూ అధికారులు కోర్టులో పెండింగ్‌లో ఉన్న భూమిని సైతం ఆన్‌లైన్ చేయడాన్ని ప్రశ్నించారు. మ్యాన్యువల్‌గా 1బీలో ఇతరుల పేర్లు ఎక్కించటంతో వారు రిజిస్టర్ కూడా ఆ భూమిని చేసుకున్నారని, దీనికి రెవెన్యూ అధికారులే వత్తాసు పలికారని తెలిపారు. దీంతో తహసీల్దార్ ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదని చెప్పగా మరి ఎవరు చేశారో చెప్పాలని, దీనిపై హైకోర్టుకు కూడా వెళ్ళటం జరిగిందని అధికారులతో వాగ్వివాదానికి దిగారు.

వార్డు సభ్యుల ప్రమేయంలేకుండా నిధుల డ్రా

- దొనకొండ మేజర్ పంచాయతీ సమావేశంలో వాగ్వాదం

దొనకొండ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): తమ ప్రమేయం లేకుండా నిధులు విడుదల చేసి దుర్వినియోగం చేశారని దొనకొండ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్, కార్యదర్శిపై వార్డు సభ్యులు ధ్వజమెత్తారు. గురువారం జరిగిన సమావేశంలో సర్పంచ్, వార్డుసభ్యుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. వార్డుసభ్యులు తీర్మానం చేసిన పనులు చేపట్టారా, సొంత పనులు చేశారా, ఎటువంటి పనులు చేశారు, అందుకు ఎంత నిధులు ఖర్చు చేశారో తెలపాలంటూ పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికులు పనులు సక్రమంగా చేయటం లేదని, తాము ఎన్నిసార్లు చెప్పినా స్పందించటం లేదని సభ్యులు పేర్కొన్నారు. ఎక్కడ చెత్త అక్కడ పేరుకుపోతుండటంతో తాము ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నామన్నారు. గట్టిగా అడిగితే మాకు జీతాలు ఇవ్వటం లేదని, ముందు మాకు జీతాలిప్పించండి అంటూ కార్మికులు సమాదానం చెబుతున్నారని సభ్యులు ఆరోపించారు. సర్పంచ్ రత్నకుమారి మాట్లాడుతూ గ్రామ పంచాయితీలో ఎటువంటి నిధుల దుర్వినియోగం జరగలేదన్నారు. తాము చేపట్టిన పనులకు ఇంకా బిల్లులు మంజూరు కాలేదని చెప్పారు. అందుకు సంబంధించి పూర్తి బిల్లులు చూపాలని గ్రామ కార్యదర్శిని ఆదేశించారు. పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా జరగాలని, ప్రతిరోజు చేపట్టిన పనుల గురించి తనకు తెలపాలని కార్మికుల మేస్త్రి లూకయ్యను ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి పి.కృష్ణమూర్తి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఎటువంటి నిధులు మంజూరు కాలేదన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరయ్యాయని చెప్పారు. ఆ నిధులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని సిద్ధం చేసి శుక్రవారం చూపిస్తానని తెలిపారు. అన్ని రికార్డులు, బిల్లులు చూపిన తర్వాత తాము సంతకాలు చేస్తామని వార్డుసభ్యులు తెలిపి సమావేశం నుంచి వెళ్లిపోయారు.


సమావేశంలో మాట్లాడుతున్న వార్డు సభ్యులు

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

కురిచేడు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలకల ఉన్నత పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన మండలస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. ముఖ్యఅతిథులుగా ఎంఈవోలు వస్త్రం నాయక్, సుబ్బారావు, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ హాజరయ్యారు. మండలంలోని ఏడు ఉన్నత పాఠశాలల నుంచి 21 ప్రదర్శనలు రాగా వాటిలో ఉన్నతమైన వాటికి బహుమతులు అందజేశారు. ఉత్తమంగా ఎంపికైనవి శుక్రవారం ఒంగోలులో జరిగే జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రదర్శిస్తారని ఎంఈవో తెలిపారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. వ్యక్తిగత ప్రదర్శనలో బోధనంపాడు జడ్పీ ఉన్నత పాఠశాలకు ప్రథమస్థానం, నాయుడుపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల ద్వితీయ, కురిచేడు కేజీబీవీ పాఠశాల తృతీయ స్థానంలో వచ్చాయి. గ్రూపు విభాగంలో కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల, పొట్లపాడు జడ్పీ ఉన్నత పాఠశాల, బోధనంపాడు జడ్పీ ఉన్నత పాఠశాల వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో వచ్చాయి. ఉపాధ్యాయుల విభాగంలో కురిచేడు జడ్పీ ఉన్నత పాఠశాల, కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలు, కురిచేడు బాలికల పాఠశాల వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి.


వైజ్ఞానిక ప్రదర్శనను పరిశీలిస్తున్న డాక్టర్ ప్రవీణ్

రైల్వేలైన్ పనులను పరిశీలించిన ఉన్నతాధికారులు


రైల్వే లైన్ పనులను పరిశీలిస్తున్న ఉన్నతాధికారులు

దర్శి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్ నిర్మాణ పనులను ఆశాఖ ఉన్నతాధికారులు గురువారం పరిశీలించారు. సికింద్రాబాద్‌కు చెందిన రైల్వే భద్రతాశాఖ కమిషనర్ మాధవి, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి సత్యప్రకాష్, చీఫ్ ఇంజనీర్ డీపీ సుబ్రమణ్యం, గుంటూరుకు చెందిన డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ దుర్గాప్రసాద్ దర్శి-పొదిలి ప్రాంతాల్లో రైల్వేలైన్ నిర్మాణాలను పరిశీలించారు. గతంలో దర్శి వరకు గూడ్స్ రైల్ వాహనాల ట్రయిల్ రన్ పూర్తయిన విషయం తెలిసిందే. తాజాగా దర్శి నుంచి పొదిలి వరకు నిర్మించిన రైల్వేలైన్‌ను పరిశీలించారు. దర్శి నుంచి మల్లవరం వరకు రైల్వేలైన్ నిర్మాణం పూర్తయినట్టు ధ్రువీకరించారు. మల్లంవరం వరకు రైళ్ల రాకపోకలకు అనుకూలంగా ఉన్నట్లు తెలిపారు. మల్లవరం-పొదిలి మధ్యలో ఒక రైతు కోర్టుకు వెళ్లటంతో సుమారు 200 మీటర్ల రైల్వేలైన్ నిలిచిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని ఆ సమస్య పరిష్కరిస్తే పొదిలి వరకు రైళ్లు నడిపే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ


శిక్షణ పొందుతున్న ఎన్‌సీసీ విద్యార్థులు

దొనకొండ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులకు ఒంగోలుకు చెందిన 34వ ఆంధ్ర బెటాలిన్ ప్రతినిధులు గురువారం ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. సంతోష్కుర్‌సింగ్, ఎంవీ నారాయణలు ఎన్‌సీసీ విద్యార్థులకు ఈనెలలో జరుగబోయే ఏ సర్టిఫికెట్ పరీక్షకు సంబంధించి శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు పట్టుదలతో శిక్షణ తీసుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్, ఎన్‌సీసీ కేర్‌టేకర్ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

వీసీపల్లి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక కేజీబీవీలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినులకు ఎంఈవో ఆర్.శ్రీనివాసులు ఆయన సతీమణి భవానీదేవి జ్ఞాపకార్థం గురువారం మెటీరియల్‌ను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే ట్రిపుల్ ఐటీలో సీట్లు పొందవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ1 సంజీవి, నేరేడు పల్లి, పెదయిర్లపాడు, పెదఅలవలపాడు జడ్పీ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు టి.అంజలీదేవి, ఎస్‌కే సుభాని, సీహెచ్ సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్ బి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

కాగా, స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఎంఈవోలు ఆర్.శ్రీనివాసులు, సంజీవి అధ్యక్షతన పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలు, విద్యాభివృద్ధికి యాజమాన్య కమిటీలు తమవంతు సహకారాన్ని అందించాలన్నారు. మన పాఠశాలల అభివృద్ధితో మన పిల్లల భవిష్యత్తు బాగుంటుందని చెప్పారు. ఎస్‌ఎంసీ చైర్మన్‌ల విధివిధానాలు, ప్రధానోపాధ్యాయుల విధుల గురించి వారు వివరించారు. కార్యక్రమంలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఆయా పాఠశాలల ఎస్‌ఎంసీ చైర్మన్‌లు పా ల్గొన్నారు.

దాడి కేసులో ఆరు నెలలు జైలు

కనిగిరి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిని గాయపరచిన కేసులో ఆరు నెలల జైలుశిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ కనిగిరి జుడిషియల్ ఫస్ట్‌క్లాస్ న్యాయాధికారి కె.భరత్‌చంద్ర గురువారం తీర్పు ఇచ్చారు. కోర్టు వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం.. 2017 ఆగస్టులో పామూరులో జరిగిన గణేష్ నిమజ్జనం కార్యక్రమంలో భాగంగా కటకం రవి అనే వ్యక్తి బాణసంచా కాల్చుతున్న క్రమంలో ఆకుల మోహన్‌రావు అనే వ్యక్తిపై నిప్పురవ్వలు ఎగసిపడ్డాయి. దీంతో మోహన్‌రావు అనే వ్యక్తి జాగ్రత్తగా కాల్చుకోవాలని చెప్పాడు. దీంతో గణేష్ నిమజ్జనం ఊరేగింపుగా ముగించుకుని వస్తుండగా ప్రభుత్వ డిగ్రీ కాలేజి వద్ద కటకం రవి అనే వ్యక్తి మోహన్‌రావు ముఖంపై దాడిచేసి గాయపరిచాడు. ఈ మేరకు అప్పట్లో పామూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. విచారణ అనంతరం నేరం రుజువైనందున జైలుశిక్ష, జరిమానా విధించారు.

ఉరేసుకుని యువతి ఆత్మహత్య

వెలిగండ్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని యువతి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మండలంలోని పందువ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన విలియం, సరళమ్మకు నలుగురు సంతానం. బతుకుదెరువు కోసం హైదరాబాదులో బేల్దారి పనికి వెళ్లి క్రిస్మస్ సందర్భంగా స్వగ్రామానికి వచ్చారు. ఇంట్లో ఎవరూలేని సమయంలో మూడవ కుమార్తె కుమ్మరికుంట అనుషా (22) ఫ్యాన్‌కి ఉరేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ప్రయివేటు వైద్యశాలకు తరలించంగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి వివరాలను సేకరిస్తున్నట్లు సీఐ భీమానాయక్, ఎస్ఐ మధుసూదన్ రావు తెలిపారు

అధ్వానంగా పారిశుధ్యం


నీటి ట్యాంక్ వద్ద పడవేసి ఉన్న పురుగుమందుల ఖాళీ డబ్బాలు

పామూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని దూబగుంట పంచాయతి వెంకటాపురం గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. రామాలయం వద్ద దారుణంగా ఉంది. ఆలయం ఎదురుగా ఉన్న చేదుడు బావిలో నీరు ఇంకిపోయి వృధాగా ఉంది. బావి పక్కనే నీటి ట్యాంక్ నిర్మించారు. గ్రామంలోని వ్యవసాయ రైతులు, పశుపోషకులు పురుగుల మందులను, జీవాల వైద్యం కోసం తెచ్చిన మందులను నీటి ట్యాంక్ వద్దనే కలుపుకొని ఖాళీ ప్యాకెట్లను బావిలో, ట్యాంక్ పక్కనే పడవేస్తున్నారు. దాంతో నీరు నిలువచేరి ఆప్రాంతమంతా అధ్వానంగా తయారైంది. వాటర్ ట్యాంక్ వద్ద మురికి నీరు నిలువ ఉండటంతో దోమల ఉధృతి ఎక్కువైంది. దీంతో వ్యాధులు ప్రబలుతున్నాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి పారిశుధ్య చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.


5


తెనాలి : సాలీడు ఏర్పరచుకున్న గూడుపై పడిన మంచుతో మెరిసిపోతున్న చిత్రం

ముత్యమల్లే మెరిసిపోయే మంచు తీగ

- కొత్త సంవత్సరంలో మంచు అందాలు
- పల్లెలు, పట్టణాలపై మంచు దుప్పటి
- ముత్యాలను తలపించేలా మంచు సోయగాలు

కలల రాజధానిపై.. కొత్త ఆశలు


అమరావతిలోని సీడ్ యాక్సెస్ రోడ్డు వెంబడి ముమ్మరంగా సాగుతున్న చెట్లు తొలగించే పనులు

కొత్త ఏడాది.. రాజధాని రైతుల్లో కొంగొత్త ఆశలు నింపుతున్నాయి. కూటమి ప్రభుత్వం రాకతో ఈ ఏడాది మలి అర్ధభాగంలో సంతోషం కళ్ల చూసిన రాజధాని రైతులకు రాబోయే ఏడాది మరింత సంతోషాన్ని నింపుతుందని కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారు. ఎంతో సంతోషంగా నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతున్నారు. ఐదేళ్ల వైసీపీ నిరంకుశ పాలనలో ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి నియంతృత్వం కింద నలిగిపోయిన రాజధాని రైతులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఊపిరి తీసుకున్నారు. అధికారంలోకి వచ్చీ రాక ముందే కూటమి ప్రభుత్వం రాజధాని అమరావతికి భరోసా కల్పించడం, నిర్మాణ పనుల్లో కదలిక తీసుకురావడంతో రైతుల ఆశలు తిరిగి ప్రాణం పోసుకున్నాయి. వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.



- కొత్త ఏడాది అమరావతిలో కొత్త వెలుగులు!
- కూటమి సర్కారు రావడంతో పూర్వ వైభవం
- అభివృద్ధి పనులతో దూసుకుపోతున్న నవనగరం
- ఆశావహంగా సాగిన ఈ ఏడాది మలి అర్ధభాగం
- కొత్త ఏడాది కొత్త భవనాలతో నగరం శోభాయమానం
- ఐదేళ్ల బాధలు.. కౌలు కష్టాలు తీరడంతో రైతుల్లో ఆనందం


జీఏడీ టవర్స్ నిర్మించాల్సిన ప్రాంతంలో భారీ మోటార్లతో నిర్విరామంగా సాగుతున్న నీటిని తొలగించే పనులు





గుంటూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): 2014లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవ, కల్పించిన భరోసా కారణంగా రాజధానిలోని 28వేల మంది రైతులు భూ సమీకరణలో 34వేల ఎకరాల భూములు ఇచ్చారు. అప్పటి కూటమి ప్రభుత్వం రూ. 10వేల కోట్లతో రాజధానిలో శాశ్వత పరిపాలనా కార్యాలయాల నిర్మాణ పనులను చేపట్టింది. నాలుగేళ్లపాటు జోరుగా పనులు సాగడంతో నవ్యాంధ్ర రాజధాని కళకళలాడింది. 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం రైతుల ఆశలను, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను చిదిమేసింది. రాజధాని అమరావతిని శ్మశానంతో పోల్చి, పనులన్నింటినీ అర్థాంతరంగా ఆపేసింది. రాజధాని రైతులపై, ప్రత్యేకించి మహిళలపై అనేక దాష్టీకాలకు పాల్పడింది. భూములిచ్చిన రైతులను వేధించడమే లక్ష్యంగా రైతుల కౌళ్లు నిలిపివేసింది. వాళ్లకు ఇవ్వాల్సిన రిటర్నబుల్ ప్లాట్లను ఆపేసింది. జోన్-5 పేరుతో రాజధానిలో చిచ్చు రాజేశారు. రైతుల భూములను వారికి ఇవ్వకపోగా వాటిని వేరెవరికో పందేరం చేశారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతులపై లాఠీలతో విరుచుకుపడింది. మహిళల పొత్తికడుపులపై పోలీసుల బూటు కాళ్లు విరుచుకుపడ్డాయి. ముళ్ల కంచెల్లో వేసి రైతులు, మహిళలను ఈడ్చుకుంటూ పోయి అరెస్టులు చేశారు. వేలాది మంది రైతులపై వందలాది కేసులు బనాయించి వేధించారు. అసైన్డ్ రైతుల భూములపై సీఐడీ కేసులు పెట్టి వారిని కౌలుకు అనర్హులుగా చేశారు. దళితులపైనే ఎస్సీ ఎస్టీ కేసులు పెట్టారు. ఇలా చెప్పుకుంటూ పోతే గడిచిన ఐదేళ్లలో రాజధానిలో రైతులు, మహిళలపై జరిగిన దాష్టీకాలకు అంతే లేకుండాపోతుంది. అంతటి దాష్టీకాలను సైతం రైతులు, మహిళలు సహనంతో, శాంతియుత పోరాటాలతో ఎదుర్కొని నిలిచారు. రాజధానిని నిలబెట్టుకున్నారు. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే వరకూ అమరావతిని పొత్తిళ్లలో పెట్టుకుని కాపాడుకున్నారు.

కూటమి రాకతో మారిన తలరాత

కూటమి ప్రభుత్వం రావడంతో రాజధాని తలరాత ఒక్కసారిగా మారిపోయింది. ఐదేళ్లపాటు రైతులు, మహిళలకు కష్టాలు తొలగిపోయాయి. రాజధానికి భరోసా లభించడంతో వారి ఆశలు తిరిగి ఊపిరి పోసుకున్నాయి. రైతుల ఆశలను, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను గుర్తించిన కూటమి ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన రాజధాని పనులు ప్రారంభించింది. ఐదేళ్ల పాలనలో అడవిలా మారిన అమరావతిని అద్దంలా మార్చే పనికి శ్రీకారం చుట్టింది. రూ. 36.5 కోట్ల రూపాయలతో జంగిల్ క్లియరెన్స్ పనులను నిర్వహించి కంపచెట్లను తొలగించింది. జూన్ 12న కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేయడానికి ముందే అమరావతిలో జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభించి రాజధాని పట్ల తనకున్న చిత్త శుద్ధిని ప్రకటించింది. స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు రాజధాని గ్రామాల్లో పర్యటించి రైతులకు విశ్వాసం కల్పించారు. ఆగిపోయిన భవనాల నిర్మాణ పనులపై అధికారులను కదిలించారు. దీంతో రాజధానిలో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.

ఎల్ఈడీ కాంతులతో నవనగరం..

కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రాజధాని రహదారులకు మోక్షం కలిగింది. అప్పటివరకూ కంప చెట్లతో నిండిపోయిన రోడ్లను అధికారులు వినియోగంలోకి తెచ్చారు. సీడ్ యాక్సిస్ రోడ్డుపై ఎల్ఈడీ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసి

(మిగతా 6వ పేజీలో)

నేడు అవయవ దాతల సంఘం ఐదో మహాసభ

- హాజరుకానున్న ఆరోగ్య మంత్రి సత్యకుమార్

గుంటూరు మెడికల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సావిత్రిబాయి పూలే 194వ జయంతిని పురస్కరించుకొని అఖిల భారత శరీర అవయవ దాతల సంఘం ఐదో మహాసభ శుక్రవారం గుంటూరు వైద్య కళాశాల జింకాన ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. గురువారం తన ఛాంబర్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. మరణించినా అవయవదానంతో జీవించండి అనే నినాదంతో అవయవదానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణ బాబు, వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం, జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషన్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్, అఖిల భారత శరీర అవయవదాతల సంఘం వ్యవస్థాపకురాలు గూడూరు సీతామహాలక్ష్మి పాల్గొంటారని ఆయన వివరించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే జీవిత సాఫల్యత పురస్కారాన్ని ప్రముఖ గుండె మార్పిడి శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ ఆళ్ల గోపాలకృష్ణ గోఖలేకు అందజేయనున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా అవయవదానంపై సమాజంలో అవగాహన కల్పిస్తున్న వ్యక్తులకు, సంస్థలకు సావిత్రిబాయి పూలే సేవా పురస్కారాలను ప్రదానం చేస్తామని అన్నారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ అవయవదాతలకు ఐడీ కార్డులను పంపిణీ చేస్తారని, ప్రత్యేక సావనీర్‌ను ఆవిష్కరిస్తారని తెలిపారు. ఈ మహాసభకు దక్షిణ భారత దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు.

కొందరికే.. కందిపప్పు

- అరకొరగా సరఫరా
- రాగి.. గోధుమ పిండి పంపిణీ నిలిపివేత
- జొన్నలూ లేవాయే




జొన్నలు

రేషన్ కార్డు దారులకు వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన రాయితీ కందిపప్పు సరఫరాను కూటమి ప్రభుత్వం పునరుద్ధరించింది. అయితే.. కందిపప్పు పంపిణీ రెండు నెలలకే పరిమితమైంది. ఈ నెల అరకొరగా కందిపప్పు సరఫరా చేశారు. కొందరు లబ్ధిదారులకే కందిపప్పు పంపిణీ పరిమితమైంది. జొన్నలు.. రాగి.. గోధుమ పిండి సరఫరా నిలిపివేశారు. పెద్ద పండుగ సంక్రాంతికి సరుకులు కోత విధించడంపై కార్డుదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రేషన్ సరుకుల కుదింపుతో పేదలు ఇక్కట్లు పడుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో కంది పప్పు కిలో రూ. 175 నుంచి రూ. 180 వరకు ధర పలుకుతున్నది. ప్రభుత్వం తెల్లకార్డు దారులకు ప్రతి నెల కందిపప్పు పంపిణీ చేయడంలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత రెండు నెలలు కందిపప్పు ఇతర సరుకులను పంపిణీ చేసింది. ఈ నెలలో సరుకుల పంపిణీలో కోత విధించింది. ప్రైవేట్ మార్కెట్‌లో ధర పెరగడంతో ప్రభుత్వం రాయితీపై పంపిణీ చేసే కందిపప్పు కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. కార్డు దారులకు బియ్యం.. పంచదార పంపిణీతో సరిపెడుతున్నారు. కందిపప్పు అడిగితే పంపిణీ దారులు స్టాక్‌లేదంటున్నారు. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాలకు అరకొరగానే ఈ నెలలో కందిపప్పు సరఫరా అయింది. మూడు జిల్లాలకు గోధుమ పిండి సరఫరా నిలిచిపోయింది. జొన్నలు ఒక్క పల్నాడు జిల్లాకే అది కూడా 7.17 శాతం కార్డు దారులకే సరఫరా చేశారు. గుంటూరు, బాపట్ల జిల్లాలకు జొన్నలు సరఫరా నిలిపివేశారు. రాగి పిండి కూడా పల్నాడు జిల్లాకు 0.19 శాతం పంపిణీ చేయగా బాపట్ల, గుంటూరు జిల్లాలకు పూర్తిగా నిలిపివేశారు.

- పల్నాడు జిల్లాలో 6,45,126 తెల్ల కార్డులు ఉన్నాయి. ఒక్కొక్క కార్డు దారునికి ఒక కిలో కందిపప్పు ప్యాకెట్ అందజేయాలి. ఈ నెలలో 27.26 శాతం కార్డుదారులకు మాత్రమే కందిపప్పు సరఫరా చేసినట్లు పౌరసరఫరాల శాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి. 1,94,409 ప్యాకెట్లకు డీలర్ల నుంచి ఇండెంట్ వచ్చింది. 1,75,892 ప్యాకెట్ల కందిపప్పును మాత్రమే డీలర్లకు సరఫరా చేశారు.
- బాపట్ల జిల్లాలో 4,86,151 తెల్ల కార్డులు ఉన్నాయి. ఈ నెలలో 53.33 శాతం కార్డుదారులకు మాత్రమే కందిపప్పు సరఫరా చేస్తున్నారు. డీలర్ల నుంచి 2,69,762 ప్యాకెట్‌ల కందిపప్పు కోసం ఇండెండ్ వచ్చింది. దీనిలో 2,56,276 ప్యాకెట్‌ల కందిపప్పు కార్డుదారులకు పంపిణీ చేసేందుకు డీలర్లకు అందజేశారు.
- గుంటూరు జిల్లాలో 5,99,558 తెల్ల కార్డులు ఉన్నాయి. ఈ నెలలో 62.72 శాతం కార్డుదారులకు కందిపప్పు సరఫరా చేస్తున్నారు. డీలర్లు 3,93,627 కందిపప్పు ప్యాకెట్‌ల కోసం ఇండెంట్ వచ్చింది. దీనిలో 3,76,046 కార్డుదారులకు పంపిణీ చేసేందుకు డీలర్లకు కందిపప్పు అందజేశారు.
- కందిపప్పు పంపిణీ కొందరికే పరిమితం కావడంతో పాటు రాగి గోధుమ పిండి.. జొన్నలు సరఫరా నిలిపివేయడంతో కార్డు దారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కిలో కందిపప్పు రాయితీపై రూ. 67కి ఇస్తున్నది. ప్రైవేట్ మార్కెట్‌లో దాదాపు రూ. 100 నుంచి రూ. 110 వరకు అధికంగా ఉండటంతో కార్డుదారులు రాయితీ కందిపప్పు పంపిణీ చేయాలని కోరుతున్నా పాలకులు పట్టించుకోవడంలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కందిపప్పుతో పాటు నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో పేదలపై మోయలేని ఆర్థిక భారం పడుతుండటంతో వారు ఆవేదన చెందుతున్నారు.

అద్భుతంగా అభివృద్ధి ప్రణాళిక

- ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్



బాపట్ల, జనవరి 02 (ఆంధ్రజ్యోతి): బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి అద్భుతమైన ప్రణాళిక రూపొందించినట్లు ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ తెలిపారు. నూతన సంవత్సరంలో చేపట్టబోయే కార్యక్రమాల గురించి ఆయన గురువారం విలేకరుల సమావేశంలో వివరించారు. విజయవాడ-గూడూరుకు రెండు రైల్వేలైన్‌లు ఉన్నాయని మూడో లైన్ నిర్మాణంలో ఉందన్నారు. నాల్గో లైన్ కూడా ఏర్పాటు చేయాలని తాను ప్రతిపాదించినట్లు తెలిపారు. దీనివల్ల బాపట్ల, చీరాల, ఒంగోలు, విజయవాడల మధ్య ప్యాసింజర్ రైళ్ళు, ఇంటర్‌సిటీలు క్రాసింగ్ పెట్టకుండా నడిపే అవకాశం ఉంటుందన్నారు. రేపల్లె- తెనాలి రైల్వేలైన్ ఒకటి ఉండగా మరొకటి ఏర్పాటు చేయాలని ప్రతిపాదించగా మంజూరు చేశారన్నారు. రేపల్లె-బాపట్ల కొత్త రైల్వేలైన్ ప్రతిపాదించగా శాంక్షన్ చేసి సర్వే ప్రారంభించారన్నారు. బాపట్ల, చీరాల రైల్వేస్టేషన్‌లు అప్‌గ్రేడ్ చేయాలని ప్రతిపాదించారన్నారు. వేమూరు దగ్గర డెల్టా ప్యాసింజర్ ఆగేవిధంగా, వందేభారత్ ఎక్స్‌ప్రెస్ చీరాల, బాపట్లలో ఏదో ఒక ప్రాంతంలో ఆపాలని ప్రతిపాదించగా పరిశీలనలో ఉందన్నారు.

అమరావతి నుండి నిజాంపట్నంకు నాలుగు వరుసల రోడ్డు మంజూరయిందని వివరించారు. జాతీయ రహదారి 216కు ఎన్‌హెచ్16ను కనెక్టివ్ చేయనున్నట్లు తెలిపారు. దీనివల్ల మచిలీపట్నం, నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్‌ల నుండి చెన్నై వెళ్ళటానికి సులభతరంగా ఉంటుందన్నారు. 216 జాతీయ రహదారి రెండు వరుసల రోడ్డుగా మాత్రమే ఉందని దీనిని నాలుగు వరుసల రోడ్డుగా అభివృద్ధి చేయాలని కోరామన్నారు. దీనికి సంబంధించిన సర్వే ప్రారంభమౌతుందన్నారు. బాపట్ల-గుంటూరు రోడ్డు 8 మీటర్ల వెడల్పు ఉండగా దీనిని 10 మీటర్లకు పెంచే విధంగా ప్రతిపాదించగా 63 కిలోమీటర్ల పొడువునా ఎస్‌హెచ్‌సీ 40 రోడ్డుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.

- బాపట్ల పార్లమెంట్ పరిధిలోని నాలుగు పురపాలక సంఘాలలో నాలుగు కేంద్రియ విద్యాలయాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు చేసినట్లు ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ తెలిపారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలో నవోదయ విద్యాలయం ఏర్పాటు చేయాలని కోరినట్లు చెప్పారు.
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బాపట్ల పర్యటనకు వచ్చినప్పుడు తాను చెప్పిన ప్రకారం మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశానన్నారు.
- గత పాలకులు జలజీవన్‌మిషన్ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్ళలేకపోయారన్నారు. 582 కోట్ల రూపాయలు మంజూరైతే 523 కోట్లు వినియోగించకుండా వదిలేశారన్నారు. దీనిని ఉపయోగించి ప్రతి ఇంటికి, ప్రతి పాఠశాలకు తాగునీటిని సరఫరా చేసేవిధంగా కృషి చేస్తామని ఎంపీ తెలిపారు. అదేవిధంగా పరిశ్రమల ఏర్పాటు విషయమై ప్రతి మండలంలో టీమ్‌ల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ తెలిపారు.

మధ్యాహ్న భోజనం.. మెనూలో మార్పులు

- పరిగణలోకి స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల సూచనలు
- ఏజన్సీలకు బకాయిలు చెల్లించేలా ఏర్పాట్లు

గుంటూరు(విద్య),జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేసే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం మెనూలో మార్పులు సంక్రాంతి తరువాతే అమల్లోకి రానున్నాయి. విద్యార్థులకు పౌష్టిక విలువలతో కూడిన నాణ్యమైన భోజనం అందించడమే లక్ష్యంగా భారీ మార్పులు చేయబోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్తమైన మధ్యాహ్న భోజన పథకాన్ని గాడిలో పెట్టేలా ఎన్డీఏ ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. ఇందులో భాగంగా తొలుత స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల్ని పునరుద్ధరించారు. వారి సూచనలు, తల్లిదండ్రుల అభిప్రాయాలు తీసుకుని మెనూలో మార్పులకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ, మండల పరిషత్,ఎయిడెడ్ సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలలు నిర్వహిస్తున్నారు. ఇందులో ప్రాథమిక,ప్రాథమికోన్నత పాఠశాలలు 4300పైగా ఉండగా, ఉన్నత పాఠశాలలు 345పైగా ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో ఒకటవ తరగతి నుంచి 10వ తరగతి చదివే విద్యార్థిని విద్యార్థులు దాదాపు 6.45 లక్షల మంది ఉన్నారు. అయితే ఇందులో దాదాపు 20 నుంచి 35శాతం వరకు విద్యార్థులు వివిధ కారణాలతో మధ్యాహ్న భోజనం చేయడం లేదు. దీనికి ప్రధాన కారణాలు అనేక ఉన్నాయి. ఆయా విషయాలు అనేకసార్లు గత ప్రభుత్వం దృష్టికి విద్యాశాఖ నివేదిక రూపంలో అందించినా ఫలితం లేదు. ఈ నేపథ్యంలో కలెక్టర్లు సంబంధిత విభాగాలతో, సమీక్ష నిర్వహించారు. పాఠశాలకు హాజరయ్యే విద్యార్థుల సంఖ్యకు భోజనం తీసుకునే విద్యార్థుల సంఖ్యకు మధ్య ఉన్న వ్యత్యాసాలు తొలగించడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు.

మెనూలో మార్పులు ఇలా.....

- ప్రభుత్వ, జడ్పీ, ఎయిడెడ్, మండల పరిషత్ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసే బడ్జెట్ తొలుత పెంచాలి. భోజనం కోసం సరఫరా చేసే బియ్యం పోర్టిఫైడ్ అంటూ లావుగా ఉన్న బియ్యం సరఫరా చేస్తు న్నారు. వాటి స్థానం లో సన్న బియ్యం ఇవ్వాలని యాజమాన్యల విజ్ఞప్తులు పరిశీలిస్తున్నారు.
- రోజువారీ మెనూలో అందించే చింతపండు పులిహోర బదులు లెమన్ రైస్ అడుగుతున్నారు. ఉదయం ఇచ్చే రాగిజావలో నాణ్యత ఉండటం లేదు. దానికి ప్రత్యామ్నాయంగా రాగితో చేసిన చిక్కీలు, లడ్డూలు ఇవ్వాలని లేదా పాలు ఇవ్వాలనే ప్రతిపాదన ఉంది.
- విద్యార్థుల రోజూవారీ మెనూలో ఒకరోజు ఇచ్చే పొంగలి కూడా తినటం లేదు దీనిలో కూడా మార్పులు చేయాలి.
- మంగళగిరి, తెనాలి, తాడికొండ తదితర నియోజక వర్గాల్లో అక్షయ పాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందించే మధ్యాహ్న భోజనం సాంబారుతో కలిపి ఇస్తున్నారు. ఇలా కాకుండా వైట్‌రైస్ సాంబారు విడివిడిగా ఇవ్వాలనే విజ్ఞప్తులు ఉన్నాయి.
- అక్షయ పాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంపిణీచేసే మధ్యాహ్న భోజనంలో కోడి గుడ్లు ఇవ్వడం లేదు. ఇందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి కోడిగుడ్లు కూడా సరఫరా చేయాలని యోచిస్తున్నారు.
- వంట ఏజెన్సీలు గుడ్డు ఉడకపెట్టి పెంకు తీసి ఇస్తున్నారని, దాన్ని పిల్లలు ఇష్టపడటం లేదు. ఉడికించిన గుడ్లు విద్యార్థులకే ఇస్తే వాళ్ళే పెంకు తీసుకొని వారే తినేలా ఏర్పాట్లు చేయాలి.
- ప్రతి శనివారం అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే మధ్యాహ్న భోజన పథకంలో స్వీట్ ను ప్రసాదంగా భావించి పిల్లలు తినటం లేదని దీనికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆలోచిస్తున్నారు.
- వంట ఏజెన్సీలకు బకాయిలు సకాలంలో చెల్లించడం లేదు. అప్పులు చేయాల్సి వస్తుందని, ఏ నెలకు, ఆనెల సకాలంలో బిల్లులు ఇస్తే అప్పులు బాధ తప్పుతుందని విజ్ఞప్తులు ఉన్నాయి. వంట చేసే ఏజన్సీలకు చెల్లించే ఛార్జీలు పెంచేలా ప్రభుత్వానికి నివేదించాలని యాజమాన్యలు చేసిన విజ్ఞప్తులు పరిష్కరించేలా చర్యలు తీసుకోనున్నారు. ఆయా మార్పులతో సంక్రాంతి తరువాత నూతన మెనూ అమలు చేస్తారు.


భోజనం చేస్తున్న విద్యార్థులు (ఫైల్)



- అద్దంకి మార్కెట్ యార్డులో పూర్తయిన ఏర్పాట్లు

అద్దంకి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్టవారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్ఫియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఆధ్వర్యంలో, అద్దంకిలో రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శుక్రవారం అద్దంకిలోని మార్కెట్ యార్డు ఆవరణలో జరగనున్నాయి. ఉదయం 9 గంటలకు ముగ్గుల పోటీలు ప్రారంభం కానున్నాయి. రెండు గంటల సమయంలో ముగ్గు వేయాల్సి ఉంటుంది. ప్రథమ బహుమతిగా రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.6వేలు, తృతీయ బహుమతిగా రూ.4వేలు అందజేయనున్నారు. ముగ్గుల పోటీలలో పాల్గొనే ప్రతి మహిళకు ఆకర్షణీయమైన బహుమతి ఇవ్వనున్నారు. ప్రకాశం, బాపట్ల జిల్లాల పరిధిలోని మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరారు. ఫోన్ ద్వారా పేర్లు నమోదు చేసుకోని మహిళలు కూడా నేరుగా పోటీల్లో పాల్గొన వచ్చని తెలిపారు.

చిన ముంబయి వ్యాపారం 1000 కోట్లు

దేశంలోనే చీరాల రెండో అతిపెద్ద వస్త్ర సముదాయం

•వస్త్ర వ్యాపారానికి కేరాఫ్‌గా గుర్తింపు •సంక్రాంతి పండుగ వేళ వ్యాపారాలపై ప్రత్యేక దృష్టి



మహాత్మాగాంధీ క్లాత్ మార్కెట్ ముఖద్వారం

చీరాల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : చీరాల వస్త్ర వ్యాపారానికి ప్రసిద్ధి. చీరాలను చినముంబయి అని కూడా పిలుస్తారు. క్షీరపురి అని మరో పేరు కూడా వాడుకలో ఉంది. చీరాల మహాత్మాగాంధీ క్లాత్ మార్కెట్(ఎంజీసీ మార్కెట్‌గా)కు విశేష ఆదరణ ఉంది. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి ఇక్కడకు వస్త్రాల కొనుగోలుకు వస్తుంటారు. సాధారణ వ్యక్తులతో పాటు రిటైల్ విక్రయాలు జరిపే వారు హోల్‌సేల్‌గా కొంటారు. ఏడాదికి సుమారు


వస్త్ర బండిల్స్‌ను దింపుతున్న కార్మికులు

రూ.1000 కోట్లకుపైగా వ్యాపార లావాదేవీలు నడుస్తాయి. దుకాణ యజమానులు కాకుండా వెయ్యి మందికి పైగా గుమస్తాలు ఉపాధి పొందుతున్నారు. ప్రస్తుతం సంక్రాంతి విక్రయాలపై దుకాణదారులు ప్రత్యేక దృష్టి సారించారు.

నిర్మాణం ఎప్పుడు జరిగింది.. ఎన్ని దుకాణాలు ఉన్నాయి

మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ కొణిజేటి రోశయ్య సహకారంతో ఎంజీసీ మార్కెట్ పురుడు పోసుకుంది. 1977లో సుమారు 3 ఎకరాల స్థలంలో వస్త్ర దుకాణాల నిర్మాణానికి అంకురార్పణ జరిగింది. స్థలం, దుకాణ నిర్మాణానికి కలిపి ఒక్కొక్కరికీ రూ.19,100 ఖర్చయింది. తొలుత 320 దుకాణాలను నిర్మించారు. నిర్మాణం అనంతరం 1979 మార్చి 19న అప్పటి గవర్నర్ కేసీ అబ్రహం, కొణిజేటి రోశయ్య చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరిగింది. ఆ తరువాత 70 దుకాణాలను నిర్మించారు. దాదాపుగా అన్ని షాపులకు పై అంతస్తులో మరో షాప్ ఉంటుంది. దీంతో సుమారు 750 దుకాణాలున్నాయి.

పండుగలు, పెళ్లిల సీజన్‌లో భారీ కొనుగోళ్లు

పెళ్లిల్లు, పండుగల సీజన్‌లో వస్త్ర వ్యాపారాలకు అనుకూలం. దసరా, క్రిస్మస్, సంక్రాంతి పండుగలకు ప్రధానంగా గిరాకీ ఉంటుంది. ఇక పెళ్లిళ్ల సీజన్‌లో అయితే సందడే సందడి. కొనుగోలుదారుతో కొట్లు కిటకిటలాడతాయి.

వ్యాపారం.. ఆధ్యాత్మిక కార్యక్రమాలు

గత 34 సంవత్సరాల నుంచి వినాయక చవితి ఉత్సవాలను ఇక్కడ నిర్వహిస్తున్నారు. మార్కెట్ ప్రధాన ముఖద్వారం వద్ద ఉన్న అమ్మవారి ఆలయం వద్ద దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తుంటారు. వ్యాపారంతో పాటు ఆధ్యాత్మికతకు అక్కడ ప్రాధాన్యత ఉంటుంది.



అతిపెద్ద వస్త్ర దుకాణ సముదాయం

ఎంజీసీ మార్కెట్ దేశంలోనే అతిపెద్ద వస్త్ర దుకాణ సముదాయం. గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో ఉన్న సముదాయం అతిపెద్దది. తరువాత చీరాల ఎంజీసీ మార్కెట్. వీటితో పాటు ఆర్‌ఆర్ రోడ్డు, కామదేను కాంప్లెక్స్, ఇతర హోల్‌సేల్, రిటైల్ దుకాణాలన్నీ కలిపితే సుమారు 1500 దుకాణాల వరకూ ఉన్నాయి.

ఎగుమతి.. దిగుమతి

చీరాల వస్త్ర వ్యాపారులు దేశంలో వివిధ ప్రాంతాల్లో వస్త్రోత్పత్తి జరిగే మిల్లుల నుంచి టోకున కొనుగోలు చేస్తారు. సూరత్, అహ్మదాబాద్, వారణాశి, ఈ-రోడ్డు, బెంగళూరు, సేలం తదితర ప్రాంతాల్లో మిల్లుల నుంచి దిగుమతి చేసుకుంటారు. ఆ సరుకును స్థానికంగా హోల్‌సేల్, రిటైల్‌గా విక్రయిస్తుంటారు.

రోశయ్య ఆశీస్సులతోనే నిర్మాణం



వేముల చంద్రశేఖర్, మహాత్మాగాంధీ క్లాత్ మార్కెట్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు, చీరాల

మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య ఉన్నంత కాలం ఆయన మాకు అండగా ఉన్నారు. ఆయన ప్రోద్బలం, సహకారంతోనే ఈ మార్కెట్ నిర్మాణం జరిగింది. అదే విధంగా హౌసింగ్ కాలనీ, గుమస్తాల కాలనీ నిర్మాణాలకు ఆయన అందించిన సహకారం ఎప్పటికీ మరువలేం. మార్కెట్ కమిటీ నిర్ణయాలకు అనుగుణంగా నడుస్తోంది. క్రమశిక్షణగా ఉంటాం.

ఏడాదికి రూ.1000 కోట్ల టర్నోవర్.. 1000 మంది గుమస్తాలకు ఉపాధి

ఎంజీసీ మార్కెట్‌లో ఉన్న వస్త్ర దుకాణాల్లో ఏడాదికి రూ.1000 కోట్ల టర్నోవర్ జరుగుతుంది. ఇక ఆర్‌ఆర్ రోడ్డు, కామదేను కాంప్లెక్స్, ఇతర హోల్‌సేల్, రిటైల్ దుకాణాల్లో మొత్తంగా చీరాల నియోజకవర్గంలో ఏడాదికి మరో రూ.1000 కోట్ల వ్యాపారం జరుగుతుంది. ఎంజీసీ మార్కెట్‌లో దుకాణ యజమానులు కాకుండా సుమారు వెయ్యి మందికి పైగా గుమస్తాలు ఉపాధి పొందుతున్నారు. ఇతర ప్రాంతాల్లో దుకాణ సముదాయాలను ఏర్పాటు చేసుకునే సమయంలో చీరాల ఎంజీసీ మార్కెట్ బైలాపై అవగాహన కల్పించుకుని, తమ కార్యాచరణ రూపొందించుకుంటుంటారు.

వస్త్ర వ్యాపారంతో ప్రత్యేక గుర్తింపు



తాతా కుమారస్వామి, సొసైటీ సెక్రటరీ, చీరాల

వస్త్ర వ్యాపారంలో చీరాలకు ప్రత్యేక స్థానం ఉంది. అన్ని వర్గాల ప్రజల అభిరుచుల మేరకు ఇక్కడ దుకాణాల్లో వస్త్రాలు అందుబాటులో ఉంటాయి. వినియోగదారుల అభిరుచి మేరకు మేం కూడా ట్రెండ్‌ను ఫాలో అవుతుంటాం.

ఒక్కో దుకాణం, ఒక్కో వెరైటీలో...



మేటూరి శేషసాయి, సొసైటీ కార్యవర్గ సభ్యుడు, చీరాల

హ్యాండ్లూమ్, ప్యూర్‌సిల్క్ శారీస్, జెంట్స్ క్లాత్, రెడీమేడ్, జరీ, లుంగీలు, బనియన్లు, పంజాబీ డ్రెస్ మెటీరియల్, దుప్పట్లు, కార్పెట్ మ్యాట్ తదితరాలకు సంబంధించి ఒక్కో దుకాణం ఒక్కో రకానికి ప్రత్యేకంగా గుర్తింపు ఉంటుంది. కొనుగోలుదారుల ఆదరణతో ముందుకు సాగుతున్నాం.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు

చినగంజాం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : కోళ్ల పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ శీలం రమేష్ హెచ్చరించారు. పెదగంజాం గ్రామ శివారులో గురువారం కోళ్ల పందేలు నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో ఎస్‌ఐ తన సిబ్బందితో దాడి నిర్వహించారు. దాడిలో ఇద్దరు వ్యక్తులను అదుపులోనికి తీసుకోగా, పందేం ఆడుతున్న కొందరు తప్పించుకున్నట్లు తెలిపారు. పందెం నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి వద్ద ఉన్న ఒక కోడి, రూ.5వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

భూమి ఆన్‌లైన్ విషయంలో కేసు

మేదరమెట్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : మేదరమెట్లలో సాగు భూమి ఆన్‌లైన్ విషయంలో రెవెన్యూ అధికారులు, సబ్ రిజిస్ట్రార్, కొనుగోలుదారులపై మేదరమెట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫోర్జరీ కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మేదరమెట్లకు చెందిన మారిపూడి వెంకటేశ్వర్లు తనకు రావాల్సిన బకాయిపై అదే గ్రామానికి చెందిన నెక్కంటి సుబ్బారావుపై అద్దంకి కోర్టులో దావా వేశారు. విచారణలో భాగంగా న్యాయస్థానం సుబ్బారావుకు చెందిన భూమిని అటాచ్ చేసింది. ఈ విషయాన్ని రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అటాచ్‌మెంట్‌లో ఉన్న భూమిని రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్ మార్చడంతో సబ్ రిజిస్ట్రార్ వద్ద ఐదుగురు రిజిస్టర్ చేయించుకున్నారు. న్యాయస్థానం అప్పటి తహసీల్దార్, వీఆర్వో, అద్దంకి సబ్ రిజిస్ట్రార్, భూమి అమ్మిన వ్యక్తి, రిజిస్టర్ చేయించుకున్న ఐదుగురు వ్యక్తులపై ఫోర్జరీ, చీటింగ్ కేసు నమోదు చేయాలని ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు ఎస్‌ఐ మహమ్మద్ రఫీ కేసు నమోదు చేశారు.

5న జిల్లా స్థాయి ముగ్గుల పోటీలు

మేదరమెట్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : మేదరమెట్లలోని శ్రీ భ్రమర టౌన్ షిప్ ఆధ్వర్యంలో ఈ నెల 5న జిల్లా స్థాయి ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు భ్రమర ఎండీ గల్లా రామచంద్రరావు గురువారం ప్రకటనలో తెలిపారు. గ్రోత్ సెంటర్‌లో నిర్వహించే పోటీలలో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.15వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10వేలు, తృతీయ బహుమతిగా రూ.5వేలు అందిస్తున్నట్లు తెలిపారు. సంక్రాంతి సంబరాలల్లో భాగంగా గంగిరెద్దులు, హరిదాసు పొంగళ్ల తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ముగ్గుల పోటీలలో పాల్గొనే మహిళలు 8500248669, 8341894434 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు. మేదరమెట్లతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సంక్రాంతి పోటీలలో పాల్గొనాలని వారు కోరారు.

పాఠశాల స్థాయి నుంచే పరిశోధనపై అవగాహన ఉండాలి

జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైన నమూనాలు

పంగులూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో శాస్త్ర పరిశోధనలపై అవగాహన ఉండాలని ఎంఈవో జి.వీరాంజనేయులు అన్నారు. మండలంలోని కొండమంజులూరు ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ఎంఈవో ప్రారంభించారు. ఈ సైన్స్ ఫేర్‌లో వ్యక్తిగత విభాంగంలో 7, విద్యార్థుల సామూహిక విభాగంలో 8, ఉపాధ్యాయ విభాగంలో 4 ప్రాజెక్టులను ప్రదర్శించారు. సమూహ విభాగంలో బూదవాడ ఉన్నత పాఠశాల బాలికలు సిరి చందన, సుహేన ప్రదర్శించిన ఎర్గోనామిక్ టూల్ ఫర్ లేబర్ సేవింగ్ నమూనా, వ్యక్తిగత విభాగంలో పంగులూరు ఉన్నత పాఠశాల విద్యార్థి షేక్ సాజిదా ప్రదర్శన, ఉపాధ్యాయ విభాగంలో బూదవాడ రసాయన శాస్త్ర బోధకుడు చంద్రశేఖర్ ప్రదర్శించిన అల్టిమేట్ ట్రాన్స్‌పోర్ట్ జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికయ్యాయి. మండల స్థాయిలో ఉత్తమ ప్రదర్శనలుగా ఎంపికైన వారు 3వ తేదీన జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనలో ఎగ్జిబిట్ చేస్తారని హెచ్‌ఎం అణిత తెలిపారు. ఉత్తమ ప్రదర్శనలకు ప్రోత్సాహక బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో అజిత్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వడ్డవల్లి వీరనారాయణ, ముప్పవరం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ప్రసాద్, ఉపాధ్యాయులు సోమశేఖర్, శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్, రామకోటిరెడ్డి పాల్గొన్నారు.


ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

పోటీలతో లక్ష్యాలపై గురి

చీరాలటౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : పోటీలలో పాల్గొనడం వలన విద్యార్థులకు లక్ష్యాలపై గురి పెరుగుతుందని ఎంఈవో-2 సుధారాణి అన్నారు.పట్టణ పరిధిలోని కేజీబీవీలో మండల స్థాయి దక్షిణ భారత విద్యా వైజ్ఞానిక ప్రదర్శన-2025 కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా మండల పరిధిలోని 8 పాఠశాలల విద్యార్థులు పలు నమూనాలను తయారు చేసి ప్రదర్శించారు. పోటీలకు న్యాయ నిర్ణేతగా గీతా యంగ్ సైంటిస్ట్ అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ వ్యవహరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణమోహన్‌రావు, జిల్లా సైన్స్ కో-ఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి, యన్నం యలమందేశ్వరరావు గైడ్ టీచర్‌లుగా విధులు నిర్వహించారు. ఉత్తమ ప్రదర్శన కనబరిచిన ఈపూరుపాలెం బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు అక్షయ, తేజశ్రీ, కల్పనకు ప్రశంసా పత్రాలు అందించారు. వీరు బాపట్లలో శుక్రవారం జరిగే పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

కలల రాజధానిపై... కొత్త ఆశలు

(5వ పేజీ తరువాయి)

కొత్త కాంతులు తీసుకు వచ్చారు. రాజధాని అవసరాలకు తగినట్లుగా కొత్త విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. కొత్త భవనాల్లో పనులను ప్రారంభించారు. జూలైలోనే ఫోరెన్సిక్ ల్యాబ్ నిర్మాణ పనులు మొదలయ్యాయి. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్(ఎన్‌ఐడీ) నిర్మాణ పనులు కూడా మొదలయ్యాయి. కేంద్ర పెద్దలను ఒప్పించడంతో అదే నెల కేంద్రం బడ్జెట్లో రాజధానికి రూ. 15వేల కోట్ల సహాయం ప్రకటించారు. దీంతో మొత్తం రాజధాని స్వరూపమే మారిపోబోతోందని తేలిపోయింది. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకుల నుంచి సహాయం కూడా అందడంతో పనులు ఊపందుకోబోతున్నాయి. ఐకానిక్ భవనాలు, ట్రంకు రోడ్లు, లే అవుట్లకి సంబంధించి రూ. 24,276.83 కోట్లతో చేపట్టే పనులకు సీఆర్‌డీఏ ఆమోదం తెలిపింది. ఇప్పటికే సెక్రటేరియట్ పునాదుల్లో నీళ్ల తొలగించే పనులు చేపట్టారు. 4,688 కోట్లు నిర్మాణానికి కేటాయించారు. 250 మీటర్ల ఎత్తులో, 103 ఎకరాల్లో అసెంబ్లీ భవనాన్ని నిర్మించనున్నారు. 42.3ఎకరాల్లో శాశ్వత హైకోర్టు భవనాన్ని నిర్మించేందుకు ప్రణాళికుల టెండర్ల ప్రక్రియ జరుగుతోంది. తక్షణ ప్రాతిపదికన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవనాల నిర్మాణాలు చేపట్టాలని, ఆ తరువాత ప్రాధాన్య క్రమంలో ఆలిండియా సర్వీసెస్ ఉద్యోగుల భవనాలు, ఎన్జీవో భవన సముదాయాలను పూర్తి చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వ కార్యదర్శుల భవనాలు, అధికారుల అపార్టుమెంట్లు అన్నీ వచ్చే ఏడాది అందుబాటులోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది. వైసీపీ సర్కారు నిర్వాకంతో ఉనికే లేకుండా పోయిన హ్యాపీనెస్ట్ తిరిగి ప్రాణం పోసుకుంటోంది. రూ. 800 కోట్లతో భవనాల నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది.

● క్యూ కడుతున్న కేంద్ర సంస్థలు

కూటమి ప్రభుత్వం వచ్చాక అమరావతికి కేంద్ర సంస్థలు క్యూ కడుతున్నాయి. ఎయిమ్స్‌కు కొత్త వైభవం వచ్చింది. సాక్షాత్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాకతో ప్రాధాన్యం మరింత పెరిగింది. ఇండియా పోస్టు, ఇండియన్ నావీ, ఇండియన్ ఆర్మీ, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్, సీబీఐ, సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్, కాగ్, ఆర్బీఐ, ఏంఐడీ, నాబార్డు, ఎస్‌బీఐ, యూబీఐ, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఎల్‌ఐసీ, ఐఓసీఎల్, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, గెయిల్ వంటి సంస్థలకు గతంలోనే భూములు కేటాయించారు. ఇస్రో రీసెర్చ్ సెంటర్, నేషనల్ పోలీస్ అకాడమీ ఎక్స్‌టెన్షన్ క్యాంపస్, ఆలిండియా సర్వీసెస్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ రీజనల్ కార్యాలయం, ఎన్‌సీసీ అకాడెమీ, ఆర్‌బీఐ, ఎస్‌బీఐ, సీఏజీ, సీపీడబ్ల్యూజీ, ఎన్టీపీసీ, ఓఎన్‌జీసీ, ఇండియన్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంకుతో పాటు అనేక కేంద్ర సంస్థలు, 13 అంతర్జాతీయ విద్యాసంస్థలు రాజధాని అమరావతికి రానున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ ఏడాది అమరావతికి మహర్దశ రాబోతోందని తెలుస్తోంది.

● కౌలు కష్టాలకు చెల్లు.. అసైన్డ్ రైతులకు విముక్తి

వైసీపీ ప్రభుత్వం వచ్చాక రాజధాని రైతులను కౌలు కష్టాలు వెంటాడాయి. రాజధాని రైతులపై కక్షబూనిన గత ప్రభుత్వం వారికి కౌలు చెల్లించకుండా వేదించింది. మూడేళ్లపాటు కౌలు నిలిపివేసింది. అసైన్డ్ రైతుల భూములపై సీఐడీ కేసులు బనాయించి కౌలుకు అనర్హులుగా ప్రకటించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రైతుల వార్షిక కౌలు వారికి దక్కింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో ఒక ఏడాది కౌలు కింద రూ. 280 కోట్లు విడుదల చేసింది. రెండో ఏడాది కౌలు కూడా ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. సీఐడీ కేసులతో నరకం చూస్తున్న 2,600 మంది రైతులకు కూటమి ప్రభుత్వం విముక్తి కలిగించింది. ఈ ఏడాది డిసెంబరుతో వారందరికీ విముక్తి పత్రాలు ఇవ్వడంతో వారికి కూడా కౌలు కష్టాలు తీరబోతున్నాయి. దీంతో వచ్చే ఏడాది నుంచి అమరావతిలోని ప్రతి రైతు ఇంట సంతోషాల పంట పండబోతోంది.

పకడ్బందీగా..

నాల్గో రోజు పరీక్షలో 188 మంది ఎంపిక


ఒంగోలు క్రైం, జనవరి2 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో గల పెరేడ్ మైదానం కానిస్టేబుళ్ల దేహదారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం 247మంది అభ్యర్థులు హాజరు కాగా 188 మెయిన్స్‌కు అర్హత సాధించినట్లు ఎస్పీ ఏఆర్.దామోదర్ తెలిపారు. మొత్తం 600మంది రావాల్సి ఉండగా 247 మంది హాజరయ్యారు. వీరిలో 188 మంది ఎంపిక కాగా 59 మంది అనర్హులుగా ప్రకటించారు. ఈనెల 10వ తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయని ఎస్పీ తెలిపారు.



పరుగు పందెంను పరిశీలిస్తున్న అధికారులు


లాంగ్ జంప్ దూకుతున్న అభ్యర్థి.. దూరాన్ని లెక్కిస్తున్న సిబ్బంది


పోటీలకు సిద్ధంగా ఉన్న అభ్యర్థులు


అభ్యర్థుల పరుగుపందెం

ప్రమాణ స్వీకారాన్ని విజయవంతం చేయండి

ఆహ్వాన పత్రికను విడుదల చేసిన ఆర్య వైశ్యులు


ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న ఆర్య వైశ్య నేతలు

అద్దంకి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఆర్య వైశ్య వెల్ఫేర్ డెవలప్‌ఎమెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా డి.రాకేష్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆర్య వైశ్యులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని టీడీపీ అద్దంకి పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చిన్ని లక్ష్మీశ్రీనివాసరావు కోరారు. విజయవాడలో ఆదివారం జరిగే ప్రమాణస్వీకార కార్యక్రమం ఆహ్వాన పత్రికను గురువారం స్థానిక గీతామందిరంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వాసవి ఆర్య వైశ్య అన్నదాన సత్రం అధ్యక్షుడు శ్రీరామ్ నాగేశ్వరరావు, వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం అధ్యక్షుడు ఊటుకూరి రామకోటేశ్వరరావు, భోజనపల్లి సత్యనారాయణ, చుండూరి మురళీ సుధాకర్, కౌన్సిలర్ అత్తులూరి రమేష్, పొట్టి వెంకటశివరావు, మామిడి రాంబాబు, సంకా సుబ్రహ్మణ్యం, పబ్బిశెట్టి శ్రీనివాసరావు, నూకల రామాంజనేయులు, ఆత్మకూరు మస్తానయ్య, చామర్తి శ్రీనివాసరావు, ఐతా సత్యనారాయణ పాల్గొన్నారు.

మోసగాళ్ల బారిన పడొద్దు : ఎస్సై


యువకులకు హడల్స్ బహూకరిస్తున్న ఎస్సై శంకరబాబు

ఈపూరుపాలెం(చీరాలటౌన్), జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగులు మోసపూరిత వ్యక్తులబారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని ఈపూరుపాలెం ఎస్‌ఐ అంబటి చంద్రశేఖర్ అన్నారు. కొంత కాలంగా పీఈటీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఈపూరుపాలెం బాయ్స్ హైస్కూల్ గ్రౌండ్‌లో సుమారు 50 మంది నిరుద్యోగులు ఖాకీ కొలువుల కోసం సాధన చేస్తున్నారు. ఈక్రమంలో ఎస్‌ఐ గురువారం ఆ యువకులతో మాట్లాడారు. ఉద్యోగ సాధన కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అలాగే వీరి సాధన, పడుతున్న శ్రమను గురించి ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనాన్ని ప్రచురించడంతో జాండ్రపేటకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బద్ధి శంకరబాబు స్పందించారు. సుమారు రూ.50 వేల విలువైన సాధనకు ఉపయోగపడే హడల్స్‌ను బహూకరించారు. యవకులు దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే ఏలూరి ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

జోరుగా సాగుతున్న పారిశుధ్య పనులు

కారంచేడు (పర్చూరు), జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాలలో గ్రామాల్లో పారిశుధ్య పనులు జోరుగా సాగుతున్నాయి. గత కొంత కాలంగా మురుగు కాలువల్లో పూడిక తీయకపోవడంతో నీరు కదలని పరిస్థితి ఏర్పడింది. పేరుకుపోయిన చెత్తాచెదారం, మురుగు నీటితో తీవ్రమైన కంపుతోపాటు, దోమలు పెరిగిపోయి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సమస్యను స్థానికులు ఎమ్మెల్యే ఏలూరి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన స్పందించి వెంటనే పారిశుధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. గురువారం కారంచేడు గ్రామంలోని ప్రధాన మురుగు కాలువలో పూడిక తీసే పనులు మొదలుపెట్టారు.


కారంచేడు.. కాలువలో పూడికను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

బ్రిడ్జిలపై భయం..భయం!



పాత మద్రాస్ రోడ్డులో పూసపాడు వాగుపై శిథిలమై ఉన్న బ్రిడ్జి



పర్చూరు వాగుపై చిల్లచెట్లతో శిథిలావస్థలో ఉన్న బ్రిడ్జి

- **శిథిలావస్థలో వారధులు**
- **గోడల్లో మొలిచిన చిల్లచెట్లు**
- **పాత మద్రాసు రోడ్డులోనూ అదే పరిస్థితి**
- **భారీ వాహనాలు, ప్రయాణికులతో రద్దీ**
- **పొంచి ఉన్న ప్రమాదం**
- **పట్టించుకోని అధికారులు**

పర్చూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : భయం..భయంగా ప్రయాణికులు బ్రిడ్జిలపై రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. ఓ పక్క బ్రిడ్జిలు శిథిలావస్థకు చేరాయి. మరోపక్క బ్రిడ్జి అంచుల్లోని గోడలకు చిల్లచెట్లు కమ్మేశాయి. వానాకాలంలో బ్రిడ్జిపై నీరు చేరి రోజులతరబడి నిలిచి ఉంటుంది. ఇలాగే కొనసాగితే బ్రిడ్జి కూలే ప్రమాదముందని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం పిడుగురాళ్ల - వాడరేవు జాతీయ రహదారి రోడ్డు పను లు సాగుతుండడంతో వందల సంఖ్యలో భారీ వాహనాలు ఈబ్రిడ్జిపై నుంచే రాకపోకలు సాగిస్తున్నాయి. టన్నులకొద్దీ రోడ్డు సామగ్రిని బ్రిడ్జి మీదుగా తరలిస్తున్నారు. దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పాత మద్రాసు రోడ్డులో ఇంకొల్లు మండలం పూసపాడు వద్ద అర్అండ్‌బీ రహదారిపై బ్రిడ్జి శిథిలమై కూలే దశకు చేరింది. దశకు చేరుకుంది. బ్రిడ్జి నిర్మాణం చేపట్టాల్సి ఉండగా, డైవర్షన్‌తో సరిపెట్టారు. ఏళ్లు గడుస్తున్నా బ్రిడ్జి నిర్మాణం ఊసే లేవు. కొద్దిపాటి వర్షం కురిసినా రాకపోకలు నిలచిపోల్సిందే. నిత్యం వందల సంఖ్యలో వాహనాలతో రాకపోకలు సాగించే పర్చూరు - ఇంకొల్లు (పాత మద్రాస్) రోడ్డులో బ్రిడ్జి పరిస్థితి దయనీయంగా మారింది. దీనికి తోడు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు కూడా అస్తవ్యస్తంగా మారింది. అమరావతికి వెళ్లే వారు ఇంకొల్లు - పర్చూరు మీదుగా రాకపోకలు సాగించాల్సి ఉంది. పర్చూరు ఆయా పట్టణాలకు ప్రధాన కూడలి కావడం, రాజధాని అమరావతికి వెళ్లే మార్గం కూడా కావడంతో ఈ బ్రిడ్జిపై వాహనాల రద్దీ ఎక్కువైంది. ఇంతటి ప్రాధాన్యత ఉన్న పర్చూరు వాగుపై బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జి గోడలను చీల్చుకుంటూ పిచ్చి మొక్కలు వస్తున్నా పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బ్రిడిపై అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

పలువురు ప్రముఖులకు కొండయ్య శుభాకాంక్షలు



మంత్రి గొట్టిపాటికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : నూతన ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకుని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే విజయానంద్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్, మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, జనార్దన్‌రెడ్డి, ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్రకుమార్ తదితరులను కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భగా జ్ఞాపికలను అందజేశారు. ఆయా సందర్భాల్లో చీరాల నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కొండయ్య కోరారు.

నేడు మంత్రి పర్యటన వివరాలు

అద్దంకి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం పలు కార్యక్రమాలలో పాల్గొననున్నారు. ఉదయం 10 గంటలకు కొరిశపాడు మండలం పి.గుడిపాడు, అద్దంకి మండలం దేనువకొండ, బల్లికురవ మండలం ఎస్ఎల్ గుడిపాడులో పాల్గొనున్నారు.



ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని ప్రారంభించిన వాణిశ్రీ

ప్రకృతి వ్యవసాయ పంటలతో ఆరోగ్యం

జిల్లా అధికారి వాణిశ్రీ

తోటవారిపాలెం(చీరాలటౌన్), జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయంతో సాగు చేసిన పంటలతో ఆరోగ్యవంతంగా జీవిస్తారని, ప్రజలు వాటిపై దృష్టి సారించి ముందుకు సాగాలని ఆ శాఖ జిల్లా అధికారి వాణిశ్రీ అన్నారు. గురువారం చీరాల మండల పరిధిలోని తోటవారి పాలెంలో ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సాగునుద్దేశించి మాట్లాడారు. అలాగే ఆయా రైతులు కేంద్రంలో తక్కువ ధరలకే విక్రయాలు జరుపుతున్న పదార్థాలతో సాగుతో ప్రయోజనముంటుందని సూచించారు. వెలుగు ఏపీఎం మధు మాట్లాడుతూ పొదుపు సంఘాల మహిళలు ప్రకృతి వ్యవసాయ పంటలపై శ్రద్ధ చూపాలన్నారు. ఆ విధంగా పండించిన పంటలనే ఆహారంగా ఉపయోగించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ శ్రీవల్లి, ఎంటీలు భీమరాజు, భారతి, శ్రీనివాస్, పొదుపు సంఘాల మహిళలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వృద్ధులకు వస్త్రాల పంపిణీ

మార్టూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : వెంకయ్య ఆశ్రమంలో గురువారం బొమ్మినేని గీతాన్వి పుట్టినరోజు సందర్భంగా తాతయ్య బి వసంతరావు, నాన్నమ్మ వెంకటసుబ్బాయమ్మ పేదలు, వృద్ధులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. ఎస్‌ఐ సైదా, ఏఎస్‌ఐ బాషా చేతులమీదగా వారికి వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ బల్లికురవ చీఫ్ మేనేజరు కే సీనానాయక్, మేనేజరు పీ రవీంద్రబాబు, మార్టూరు మేనేజరు జీవన్‌బాబు పాల్గొన్నారు. అందరికీ ఆశ్రమ అధ్యక్షుడు తన్నీరు శివ రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు.

హెల్మెట్‌పై అవగాహన



వాహనదారులతో మాట్లాడుతున్న సీఐ, ఎస్‌ఐ

మార్టూరు, జనవరి2 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనంపై ప్రయాణించేవారు తప్పనిసరిగా హెల్మెట్‌ను ఉపయోగించాలని సీఐ ఎం.శేషగిరిరావు సూచించారు. గురువారం మండల పరిధి రాజుపాలెం కూడలి వద్ద జాతీయ రహదారిపై తనిఖీ చేసి, వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించనివారికి హెల్మెట్ వల్ల కలిగే ఉపయోగాలను తెలియజేశారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే జరిమానా విధిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సైదా, ఏఎస్‌ఐ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

మృతదేహాలకు పోస్టుమార్టం

మార్టూరు, జనవరి2 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఇద్దరు తోడళ్లుల్లు కొల్లు రాంబాబు, పల్లపు గోపి మృతదేహాలకు గురువారం మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు పోస్టుమార్టం పూర్తి చేశారు. అనంతరం వారిద్దరి మృతదేహాలను కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించారు. దాంతో వారు వాటిని ఒక ప్రైవేటు అంబులెన్సులో విజయవాడకు తీసుకొని వెళ్లారు. బుధవారం మార్టూరు నుంచి చిలకలూరిపేట వైపు వెళ్లే జాతీయ రహదారిపై లారీ ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న రాంబాబు, గోపి మృతిచెందిన విషయం విదితమే. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాంబాబు భార్య ఉమ పరిస్థితి విషమంగానే ఉన్నట్లు తెలిసింది. పోస్టుమార్టం నిర్వహించిన ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు బొల్లాపల్లి, ధర్మవరం గ్రామాలకు చెందిన బంధువులు, ముఖ్యంగా మహిళలు వచ్చి విలపించారు.



మాట్లాడుతున్న ఏడీఏ ధనరాజ్

మొక్కజొన్నలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

అద్దంకిటౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు కోసం సస్య రక్షణ చర్యలు చేపాట్టాలని ఏడీఏ ధన్‌రాజ్ అన్నారు. గురువారం మండలంలోని కలవకూరు, సింగరకొండపాలెం గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కత్తెర పురుగు నివారణ కోసం నోవాలురాన్ 5.25 శాతం ఏమామెక్టిన్ బెంజోయేట్ 9 శాతం ఎకరాకు 300 ఎంఎల్ మొవ్వులో పడేలా పిచికారీ చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని రైతులకు ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి ఎస్.దీప్తి, ఏఈవో కోటేశ్వరరావు, వీఏఏలు సాయిబాబు, మస్తాన్‌రావుతో పాటు మానం స్వాములు పాల్గొన్నారు.

సావిత్రీబాయిపై వ్యాసరచన పోటీలు



పోటీల్లో పాల్గొన్న పలు పాఠశాలల విద్యార్థులు

అద్దంకిటౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : సావిత్రీ బాయి పూలే జయంతి సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో సింగరకొండలోని గురుకుల పాఠశాలలో సావిత్రీబాయి పూలే జీవిత చరిత్ర అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను తెలుగు, ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు ప్రత్యేకంగా నిర్వహించారు. ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు, షేక్ మస్తాన్‌రావు, జ్యోతి చంద్రమౌళి, కళాశాల ప్రిన్సిపాల్ గాయత్రిదేవి పోటీలను పర్యవేక్షించారు.

స్కూళ్ల అభివృద్ధిలో భాగస్వాములు అవ్వాలి

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులకు శిక్షణ



ఎస్ఎంసీ శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా అధికారి శ్రీనివాసరెడ్డి

వేటపాలెం (చీరాల), జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల అభివృద్ధిలో స్కూల్ మేనేజ్‌మెంట్ సభ్యులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. మండల వనరుల కేంద్రంలో గురువా రం పాఠశాలల మేనేజ్‌మెంట్ కమిటీ బాధ్యులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, స్కూల్ కమిటీ చైర్మన్‌లకు ఇచ్చిన ఈ శిక్షణ కార్యక్రమానికి జిల్లా అధికారులు శ్రీనివాసరెడ్డి, నాగిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు పాఠశాలల అభివృద్ధి, వసతుల కల్పన, విద్యా ప్రణాళికకు సంబంధించిన అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈవోలు జేవీ సుబ్బయ్య, ఐ.పురుషోత్తం, రీసోర్స్ పర్సన్స్ ఎ.సుబ్బారావు, టి.బంగారు నాయుడు, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్లు చెరుకూరి రాంబాబు, డి.శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు, కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

పంగులూరు : పాఠశాలల అభివృద్ధిలో స్కూల్ మేనేజిమెంట్ సభ్యులు భాగస్వామ్యం కావాలని ఎంఈవో-2 జె.వీరాంజనేయులు సూచించారు. పంగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఎస్ఎంసీ చైర్మన్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. పాఠశాలల ప్రగతి, పరిశుభ్రత, మౌలికవసతుల కల్పన విషయంలో ఎస్ఎంసీ చేపట్టాల్సిన చర్యలపై ఆర్పీలు శ్రీధర్‌బాబు, శేషగిరి, రత్తయ్య అవగాహన కల్పించారు. శిక్షణలో పాల్గొన్న ప్రతినిధులు ఈ నెల 4వ తేదీన వారివారి పాఠశాలల్లో ఎస్ఎంసీ సభ్యులందరికీ శిక్షణ ఇవ్వాలని శిక్షణ పర్యవేక్షకులు ఎంఈవో కె.నాగభూషణం తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మార్టూరు : పాఠశాలల అభివృద్ధిలో యాజమాన్య కమిటీలు భాగస్వామ్యం అయ్యేలా కృషి చేయాలని ఎంఈవో వస్రాంనాయక్ ప్రధానోపాధ్యాయులకు సూచనలు చేశారు. పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్‌లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో భాగంగా గురువారం మార్టూరులో విద్యాశాఖ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎంఈవో వస్రాంనాయక్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధిలో యాజమాన్య కమిటీలు పాత్ర కీలకమైనదన్నారు. తరచూ వారితో సమావేశమై సూళ్ల అభివృద్ధిపై సమావేశాలు నిర్వహించాలన్నారు. పాఠశాలల్లో విద్యా ప్రమాణాలును, విద్యార్థుల సంఖ్య ను పెంచాలన్నారు. కార్యక్రమంలో రిసో ర్సు పర్సన్లుగా బి బాల ప్రసాద్, సీహెచ్ శ్రీరామమూర్తి, సూర్యప్రకాష్ వ్యవహరించగా, ఎంఈవో 2 ప్రేమలతతో పాటు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

యద్దనపూడి : ప్రజల భాగస్వామ్యంతో యాజమాన్య కమిటీల సహకారంతో పాఠశాలలను అభివృద్ధి చేసుకోవాలని ఎంఈవో గోపి అన్నారు. గురువారం యద్దనపూడిలో విద్యాశాఖ కార్యాలయంలో జరిగిన శిక్షణలో ఆయన పాల్గొన్నారు. రీసోర్సు పర్సన్‌లుగా నాగిరెడ్డి,షఫీబాషా, శ్రీనివాసరావు, సీఆర్పీలు ప్రేమ్‌కుమార్, మస్తానవలి పాల్గొన్నారు.

పర్చూరు : ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ, అభివృద్ధిలో ప్రజలు బాగస్వామ్యం కావాలని ఎంఈవో వెంకట్రామయ్య అన్నారు. విద్యావనరుల కేంద్రంలో పాఠశాలల యాజమాన్య కమిటీలకు, ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో వేణుగోపాలుడు

పర్చూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులోని శ్రీ వేణుగోపాల స్వామివారి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా 18 రోజులుగా గీతాపారాయణం, హనుమాన్ చాలీసా విష్ణు సహస్ర నామ పారాయణం జరుగుతోంది. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ అర్చకులు బృందావనం సత్యనారాయణ సారథ్యంలో గోదా దేవి కల్యాణం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ అధికారి దామా నాగేశ్వరరావు, రావువారి వెంకట శివ ప్రసాద్, రెడ్డెత్తు రామారావు పర్యవేక్షించారు.

గుంటూరుకు కొత్త బస్సు సర్వీసు


ఇంకొల్లు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు నుంచి నేరుగా గుంటూరుకు నూతన బస్సు సర్వీసును గురువారం ప్రారంభించినట్లు మండల ప్రయాణికుల సంఘం అధ్యక్షుడు మోహనకృష్ణ తెలిపారు. గతంలో ఇంకొల్లు నుంచి ఉదయం 6.30కు ఒక సర్వీసు ఉండేది. కానీ ప్రయాణికుల సౌకర్యార్థం మరో సర్వీసు కావాలని గుంటూరు రీజనల్ మేనేజరు రవికాంత్‌కు కోరగా ఈ మేరకు ఇంకొల్లు నుంచి ఉదయం గం.8.15లకు మరో కొత్త సర్వీసును ప్రారంభించారు. తిరిగి సాయంత్రం గం.5.15లకు మరో ట్రిప్పు ఉంటుందని తెలిపారు. ఇంకొల్లు, దగ్గుబాడు, పర్చూరు, పత్తిపాడు మీదుగా ప్రతి రోజూ ఈ సర్వీసు తిరుగుతుందన్నారు. ఈ ప్రాంత ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్నేహశీలి నరసింహారావు

అద్దంకిటౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : స్నేహశీలి టీవీ నరసింహారావు అన్ని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో మండల కార్యదర్శి, జేవీవీ నాయకులు టీవీ నరసింహారావు సంతాప సభ వినుకొండ సుధాకరావు అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వినయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు హాజరై నివాళులర్పించారు. కార్యక్రమంలో బాబూరావు, హనుమంతరావు, యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రామారావు, పూర్ణచంద్రరావు, కోశాధికారి రామాంజనేయులు, రాజశేఖర్, పోతురాజు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ముందుగా నరసింహారావు సంతాప సభ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య మాట్లాడుతూ మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా, శాస్త్రీయ ఆలోచనలు పెరిగేలా చివరివరకూ పోరాటం సాగించిన సామాజిక కార్యకర్త నరసింహారావు అన్నారు. కార్యక్రమంలో సీపీఎం టౌన్ కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి



'సోమశిల'కు 3,086 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి 3,086 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. డ్యాంలో 71.843 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, దిగువ డెల్టాకు 1,550, కండలేరుకు 800, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



మనుబోలు : జాతీయ రహదారిపై కమ్ముకున్న పొగ మంచు

పొగ మంచు... ప్రమాదం పెచ్చు!

రహదారులపై పొగ మంచు దుప్పటి

జిల్లాను పొగమంచు కమ్మేస్తోంది. ఉదయం 8 గంటలు దాటేవరకు మంచు తెరలు తొలగకపోవడంతో రోడ్లు కనిపించడం లేదు. పొగ మంచు కమ్ముకున్న సమయంలోనే రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో డ్రైవర్లు ఎంతో అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ సురక్షితంగా గమ్యం చేరాలని నిపుణులు సూచిస్తున్నారు.

- వివరాలు 6లో..

తెగ తాగేశారు!

- మూడు రోజుల్లో రూ.22 కోట్ల మద్యం హాంఫట్
- గతేడాదితో పోల్చుకుంటే భారీగా పెరిగిన విక్రయాలు
- అయినా రాబడి పెరిగింది 4.64 శాతమే
- ధరల తగ్గుదలే కారణం



సంవత్సరం	నెల	లిక్కర్	బీర్	విలువ
2023	డిసెంబరు	1,55,823 కేసులు	31,022 కేసులు	రూ.133.39 కోట్లు
2024	డిసెంబరు	1,92,926 కేసులు	41,240 కేసులు	రూ.139.06 కోట్లు
వ్యత్యాసం		37,103 కేసులు	10,218 కేసులు	రూ.5.67 కోట్లు

నెల్లూరు (క్రైం), జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఆంగ్ల సంవత్సరాది వేడుకలు ఎక్సైజ్ శాఖకు భారీ ఆదాయాన్నే తెచ్చిపెట్టాయి. మూడు రోజుల్లో రూ.22 కోట్ల మద్యాన్ని తాగేశారు. జిల్లావ్యాప్తంగా 182 మద్యం వైన్‌షాపులు, 52 బార్లు ఉండగా, సహజంగా రోజుకు రూ.4 కోట మద్యం విక్రయాలు సాగుతుంటాయి. అయితే, డిసెంబరు 30వ తేదీన 12.4 కోట్లు, 31న 6.4 కోట్లు, జనవరి 1వ తేదీన రూ.3.4 మద్యం విక్రయాలు జరిగాయి. అయితే తక్కువ ధరకు మద్యం విక్రయాలు జరగడంతో రాబడి మాత్రం అంతంత మాత్రంగానే వచ్చింది. 2023, డిసెంబరు నెలతో పోల్చుకుంటే 2024, డిసెంబరులో 24 శాతం లిక్కర్, 33 శాతం బీర్ కేసులు అమ్మకాలు పెరిగాయి. రాబడి విషయానికి వస్తే 4.67 శాతం మాత్రమే పెరిగింది. ఇందుకు ప్రధాన కారణం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నూతన మద్యం పాలసీలో భాగంగా ప్రైవేటు వైన్ షాపులను ఏర్పాటు చేయడంతో అన్ని రకాల బ్రాండ్లు ప్రతి మద్యం దుకాణాల్లో ఉండటం, రూ.99లకే మద్యం అందుబాటులోకి రావడం, పలు రకాల బ్రాండ్లు క్వార్టర్‌పై రూ.30 వరకు తగ్గించడమే. ఏదిఏమైనా గతేడాదికంటే ఈఏడాది మద్యం విక్రయాలు పెరిగిన రాబడి మాత్రం తగ్గింది.



సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈవో బాలాజీరావు తదితరులు

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం

పెంపే లక్ష్యం

- జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు సర్వం సిద్ధం
- 114 వినూత్న ప్రాజెక్టల ప్రదర్శన
- నేడు ఆర్ఎస్ఆర్ఎంలో నిర్వహణ

నెల్లూరు (విద్య), జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో దాగిఉన్న శాస్త్రీయ దృక్పథాన్ని వెలికితీయడం.. నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టడమే లక్ష్యంగా విద్యా శాఖ జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను శుక్రవారం నిర్వహిస్తోంది. ఇప్పటికే జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, కేంద్రీయ విద్యాలయాల్లో పాఠశాల, మండల స్థాయిల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సదరన్ ఇండియన్ సైన్స్ ఫెయిర్‌ను నిర్వహించారు. వ్యక్తిగతం, సమూహం, ఉపాధ్యాయ విభాగాల్లో జరిగిన ఈ పోటీల నుంచి ఒక్కో ప్రాజెక్టను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఒక్కో విభాగం నుంచి 38 చొప్పున 114 ప్రాజెక్టలు జిల్లాస్థాయి పోటీలకు హాజరవుతున్నాయి. నగరంలోని స్టోన్‌హౌస్‌పేట ఆర్ఎస్ఆర్ఎం మునిసిపల్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జరిగే ఈ పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు రిజిస్ట్రేషన్, ఆహ్వానం, ఫుడ్, మంచినీరు, పారిశుధ్యం, ఆరోగ్యం, క్రమశిక్షణ, డాక్యుమెంటేషన్ కమిటీలను నియమించి అన్ని ఏర్పాట్లు చేపట్టారు. 150 మంది విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు కూడా తమ ఎగ్జిబిట్‌లను ప్రదర్శించనున్నారు.

విజయవంతం చేయండి : డీఈవో

జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.బాలాజీరావు గురువారం ఎగ్జిబిషన్ జరిగే ప్రాంతాన్ని పరిశీలించి అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎక్కడా ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటూ సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించారు. అందరితో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు కృషి చేయాలన్నారు. పోటీల్లో పాల్గొనేవారంతా ఉదయం 8 గంటలకు పాఠశాల వద్ద హాజరై తమ ఎగ్జిబిట్స్‌ను రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీఈఓ జానకిరామయ్య, జిల్లా సైన్స్ అధికారి కరుణాకర్‌రెడ్డి, డీసీఈబీ కార్యదర్శి రామ్‌కుమార్, ఎంఈఓలు మురళీధర్, శ్రీనివాసులరెడ్డి, అంకయ్య, ప్రధానోపాధ్యాయులు, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పార్కులకు మహర్దశ

- నెల్లూరులో 24 పార్కుల అభివృద్ధికి టెండర్లు
- ఎన్‌క్యాప్ ప్రోగ్రాం కింద రూ.4 కోట్లు మంజూరు
- ఆట వస్తువులు, జిమ్ సదుపాయాలు

- వివరాలు 6లో..

- 'పెరంకొండ' అక్రమార్కుల ప్రయత్నాలు
- విచారణాధికారులను మేనేజ్ చేసే కుట్ర

ఎంత ఖర్చయినా సరే..

తప్పించుకోవాల్సిందే!



'ఎంత ఖర్చయినా సరే.. డ్రైవర్‌ను పనిలో నుంచి తీసేయండి.. ఎంత ఖర్చయినా సరే..' ఈ డైలాగ్ ఏ సినిమాలోనిదో మీకు తెలుసుకదా!. ఆ సినిమాలో హీరో తన అవసరం కోసం రూ.లక్షల విలువైన కారును బహుమతిగా ఇచ్చి డ్రైవర్ పనిలో నుంచి మానేసేలా చేస్తారు. ఇప్పుడు అదే విధంగా 'ఎంత ఖర్చయినా సరే.. మేము తప్పించుకోవాలి' అన్న రీతిలో 'పెరంకొండ' అక్రమార్కులు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఎలాగైనా విచారణాధికారులను, ఆపై అధికారులను మేనేజ్ చేసి విచారణ నుంచి బయటపడాలని దొడ్డిదారిలో కుట్రలు పన్నుతున్నట్లు సమాచారం. ఇప్పటికే కొన్ని మార్గాల్లో ప్రయత్నాలు సాగించడం, ఆ క్రమంలోనే తాజాగా ఓ ఎమ్మెల్యేను ఆశ్రయించి సాయం కోరడం చర్చనీయాంశంగా మారింది. సదరు ఎమ్మెల్యే అక్రమార్కులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడమేగాక తిట్టి పంపినట్లు తెలుగుగంగ ప్రాజెక్టు ఉద్యోగ వర్గాలు చెప్పుకుంటున్నాయి.

6

రండి బాబు రండి..

కిలో రూ.10లే!

- సామాన్యుడి చెంతకు పేదవాడి ఆపిల్

పేదవాడి ఆపిల్‌గా పిలుచుకునే టమోటా ధరలు నేలను తాకుతున్నాయి. నెల రోజుల క్రితం వరకూ కిలో వందరూపాయలు పలికిన టమోటాలు ఇప్పుడు రూ.10లకు దొరుకుతున్నాయి. అన్నమయ్య, చిత్తూరు, అనంతపురం, కర్నూలు తదితర జిల్లాల్లో విస్తారంగా టమోటాలను పండించారు. బద్వేల్, మదనపల్లి, నెల్లూరు మార్కెట్లలో 25 కేజీల బాక్సు ధర రూ.180 నుంచి 200 పలుకుతోంది. ధరలు పతనం కావడంతో మన జిల్లాలో సామాన్యుడికి అందుబాటులోకి వచ్చాయి. కిలో పది రూపాయలు చొప్పున వందకు పది కిలోలు విక్రయిస్తున్నారు. మండల కేంద్రమైన అనంతసాగరంలో పది రూపాయలకు విక్రయించడంతో జనం ఎగబడి కొనుగోలు చేశారు.

- అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి)



బాగుంది... కానీ!

- పేదవారి ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్లు
- నిర్వహణపై మరింత పర్యవేక్షణ అవసరం



ఆత్మకూరు క్యాంటీన్‌లో నీళ్ల సాంబారు

నెల్లూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ఫొటోలకు దండం పెడుతూ ఒకచోట, నిండిన కడుపుతో చంద్రబాబును దీవిస్తూ మరోచోట.. కూటమి ప్రభుత్వ లోగోను ముద్దాడుతూ ఇంకోచోట.. అన్నా క్యాంటీన్ల వద్ద తరచూ అగుపిస్తున్న దృశ్యాలివి. ఒకపూట భోజనానికే ఇంతలా సంబరపడిపోవాలా!? అని విమర్శకులు ఆశ్చర్యపోయినా క్యాంటీన్ల వద్ద పేదల కృతజ్ఞతలు చేతల రూపంలో కనిపిస్తుండటం ముమ్మాటికీ నిజం. ఉపాధి కోసమో, విద్య కోసమో, సమస్యల పరిష్కారం కోసమో జిల్లా కేంద్రం, రెవెన్యూ డివిజనల్ కేంద్రాలకు వచ్చే ఎంతోమందికి హోటల్ భోజనం అంటే చాలా ఖరీదైన విషయం. అంత డబ్బు ఖర్చు చేసే సాహసం చేయలేక ఎంతోమంది పస్తులతో ఇల్లు చేరుకునేవారు. అలాంటి వారికి అన్నా క్యాంటీన్లు కడుపు నింపే అన్నపూర్ణలా మారిపోయాయి. నెల్లూరులో ఆరు, కందుకూరు, ఆత్మకూరు, కావలి ఒక్కోచోట ఈ క్యాంటీన్లు నడుస్తున్నాయి.

కానీ..

ఇంతటి ఆదరణ పొందుతున్న ఈ పథకంలో కొన్ని సాదక బాదకాలు కనిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని తెలియజేస్తున్నాయి. గురువారం ఆంధ్రజ్యోతి పరిశీలనలో ప్రధాన అంశాలను పాలకుల దృష్టికి తీసుకురావాల్సిన ఆవశ్యకతను తెలియజేశాయి. నెల్లూరులో ఆదరణ ఉన్నా రద్దీకి తగినంత భోజనం అందడం లేదు. భోజనం లేక చాలా మంది వెను తిరిగిపోతున్నారు. అలాగే, ఆత్మకూరులో టిఫిన్లు, భోజనాలు రుచించడం లేదు. ఇక కందుకూరు, కావలిలో రోజువారి ఇండెంట్ ప్రకారం సరఫరా చేస్తున్నారు.

నెల్లూరు (సిటీ) : నగరంలోని ముత్తుకూరు గేటు కూడలిలో ఉన్న అన్న క్యాంటీన్‌ను గురువారం ఆంధ్రజ్యోతి పరిశీలించింది. ఉదయం టిఫిన్‌కు 400 మంది వరకు వస్తున్నారు. మధ్యాహ్నం భోజనంతో 500 మంది ఆకలి తీర్చుకుంటున్నారు. రాత్రి పూట 200 మంది వరకు భోజనం చేస్తున్నారు. అయితే, ఆకలి తీర్చుకునేందుకు జనం వస్తున్నా ఐటమ్స్ అయిపోతుండటంతో వెనుతిరుగుతున్నారు. టోకన్ల సంఖ్య పెంచాలని పలువురు కోరుతున్నారు.



నెల్లూరులో భోజనం చేస్తున్న విద్యార్థినులు

కావలిలో మంచి ఆదరణ



అన్నం వడ్డిస్తున్న క్యాంటీన్ సిబ్బంది

- కావలి : అన్నా క్యాంటీన్‌కు కావలిలో మంచి ఆదరణ కనిపిస్తోంది. ఉదయం 150మందికి టిఫిన్, మధ్యాహ్నం 300 మందికి, రాత్రి 100 మందికి ఆహారం అందిస్తున్నారు. గురువారం మధ్యాహ్నం 12.30 గంటలకు క్యాంటీన్‌ను ప్రారంభించగా, అన్నం అయిపోయేవరకు వడ్డిస్తుంటామని నిర్వాహకులు తెలిపారు ఏరోజు కారోజు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఇండెంట్ ప్రకారం ఇస్కాన్ నిర్వాహకులు అన్నం, టిఫిన్ సరఫరా చేస్తుంటారు. ప్రస్తుతం అన్నం వృథా కావటం లేదని, అయిపోయేవరకు వడ్డిస్తున్నట్లు తెలిపారు.

- కందుకూరు : పట్టణంలోని అన్నా క్యాంటీన్‌లో ప్రతిరోజూ వెయ్యిమందికి పైగా నిరుపేదలు ఆకలి తీర్చుకుంటున్నారు. రెండు నెలల కిందట మధ్యాహ్న సమయంలో 600 మంది వరకు భోజనం చేసేవారని ప్రస్తుతం వ్యవసాయ పనులు ముమ్మరంగా ఉండటంతో గ్రామీణ ప్రజల సంఖ్య తగ్గిందని క్యాంటీన్ నిర్వాహకులు తెలిపారు. డిమాండ్‌ను బట్టి ఇక్కడ భోజనం తెప్పిస్తున్నారు. భోజనం అయిపోయిందనే మాట రాకుండా మధ్యాహ్నం మూడున్నర గంటల వరకు కూడా భోజనం పెడుతున్నారు.

ఆత్మకూరులో ఫర్వాలేదు!

- ఆత్మకూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ బస్టాండ్ సమీపంలో పాత ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో అన్నకాంటీన్ ఏర్పాటు చేశారు. ప్రతిరోజు 450 మందికిపైగా ఉదయం టిఫిన్, రెండు పూటలా భోజనం చేస్తున్నారు. కొన్నిసార్లు ప్రజలు క్యాంటీన్‌కు రావడం కొరవడితే భోజనం, కూరలు మిగిలిపోతు న్నాయి. మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నా నిర్వహణ తీరుపై అన్నార్తులు కొంత అసం తృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొన్నిసార్లు ఉడికీ ఉడకని అన్నం, నీళ్ల సాంబారు, రుచిలేని పప్పు పెడుతున్నట్లు తెలిపారు. మెనూలో చట్నీ ఉన్నా ప్రతిరోజు మామిడి ఊరగాయ పెడుతున్నారు. మొదట్లో గట్టి పెరుగు వేసేవారని రానురాను పలచపడిపోయిందన్నారు. ఇక ఉదయం టిఫిన్‌లో ఇడ్లీ సరిగా ఉడకదని, సాంబారు నీళ్లలా ఉంటుందని, పూరి మసాలా కూడా బాగుండదని తెలిపారు.

ఆంధ్రజ్యోతి పరిశీలన

పైళ్లు వదిలి.. పొలంబాట!

- వరి నాట్లు వేసిన కందుకూరు సబ్‌కలెక్టర్

నిత్యం ఫైళ్లతో కుస్తీ పడుతూ బిజీగా ఉండే కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ గురువారం పొలంబాట పట్టారు. గుడ్లూరు మండలం లోని మోచర్ల గ్రామంలో వ్యవసాయ కూలీలతో కలిసి వరినాట్లు వేశారు. అనంతరం చేవూరు, మోచర్ల గ్రామాల్లో జరుగుతున్న పోలం పిలుస్తోంది కార్యక్రమాల్లో పాల్గొని రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. పైర్లలో తరచూ వచ్చే తెగుళ్ల నివారణకు వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకోవాలన్నారు. అధికారులు కూడా రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేదిశగా కృషి చేయాలని ఆదేశించారు. సబ్‌కలెక్టర్ వెంట మండల వ్యవసాయ అధికారి రవికుమార్, డిప్యూటీ తహసీల్దారు విజయభాస్కర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

- గుడ్లూరు (ఆంధ్రజ్యోతి)



- 7 నుంచి టికెట్ల విక్రయం
- సమన్వయంతో పని చేయాలి : ఆర్డీవో అనూష



వైకుంఠ ఏకాదశి ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆర్డీవో అనూష, ఆలయ చైర్మన్, అధికారులు

వైకుంఠ ఏకాదశికి భారీ ఏర్పాట్లు

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ప్రసిద్ధ తల్పగిరి రంగనాథ స్వామి ఆలయంలో ఈనెల 10న వైకుంఠ ఏకాదశి (ముక్కోటి) ఉత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో ఎన్ అనూష తెలిపారు. గురువారం సాయంత్రం ఆమె ఆలయంలో అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. వైకుంఠ ఏకాదశికి భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఉత్తర ద్వార దర్శనానికి వచ్చే భక్తులు అసౌకర్యానికి గురికాకుండా అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని కోరారు. శాఖల వారీగా ఏర్పాట్ల వివరాలు అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. రంగనాథస్వామి ఆలయం ఈవో ఆళ్ల శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశికి ఆలయంలో మూడు క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శీఘ్ర దర్శనం రూ.200, ప్రత్యేక దర్శనం రూ.50 టికెట్లను 7వతేదీ నుంచి విక్రయిస్తామని తెలిపారు. ఉచిత క్యూలైను కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. భక్తులకు తాగునీరు, ఉచిత ప్రసాదాలు అందజేస్తామని, అన్ని జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. అనంతరం వైకుంఠ ఏకాదశి బ్రోచర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్ రెడ్డి, ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ధర్మకర్తలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బీపీసీఎల్ ఏర్పాటుకు కేబినెట్ అంగీకారం

- సీఎం, డిప్యూటీ సీఎంకు ఎంపీ వేమిరెడ్డి కృతజ్ఞతలు



సీఎం చంద్రబాబుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు (హరనాథపురం), జనవరి 2(ఆంధ్రజ్యోతి) : రామాయపట్నం సమీపంలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీ ఎల్) రిఫైనరీ అండ్ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ కంపెనీ ఏర్పాటులో మరో ముందడుగు పడింది. గురువారం అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్వర్యంలో జరిగిన కేబినేట్ మీటింగ్ లో దీనిపై సుదీర్ఘంగా చర్చించి, ఆమోద ముద్ర వేశారు. కాగా, బీపీసీఎల్ ఏర్పాటుకు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చొరవ చూపారు. ఢిల్లీలో ఆ సంస్థ ప్రతినిధులను, కేంద్రమంత్రులను కలిసి కంపెనీ ఏర్పాటుకు వున్న అనుకూలతలను వివరించడంలో సఫలీకృతులయ్యారు. రాష్ట్ర క్యాబినేట్ ఆమోదం తెలపడంపై ఎంపీ వేమిరెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా సమగ్రాభివృద్ధిలో బీపీసీఎల్ ప్లాంటు ఒక మైలు రాయిగా నిలిచి పోనుందని వేమిరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

రేపు ఎస్సీ వర్గీకరణ
ఏక సభ్య కమిషన్ రాక

నెల్లూరు(హరనాథపురం), జనవరి 2(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన వివరాలను, అభ్యంతరాలను స్వీకరించటానికి రాజీవ్ రంజన్ మిశ్ర నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ శనివారం జిల్లాకు వస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ డీడీ కే శోభారాణి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.30గంటలకు కలెక్టరేట్ తిక్కన భవన్‌లో ఆ కమిషన్ సమావేశం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని ఎస్సీలు, వారి సంఘాల సభ్యులు అభ్యంతరాలు ఏమైనా ఉంటే రాత పూర్వకంగా సమర్పించాలని కోరారు.



శ్రావణిని అభినందిస్తున్న జిల్లా సెక్రటరీ మురళి

అంతర్జాతీయ జంప్ రోప్ పోటీలకు శ్రావణి


కలిగిరి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థి వనిపెంట శ్రావణి నేపాల్‌లో జరుగనున్న అంతర్జాతీయ జంప్‌రోప్ పోటీలకు అర్హత సాధించినట్లు గురువారం హెచ్‌ఎం భీమేశ్వరరావు తెలిపారు. కలిగిరికి చెందిన విద్యార్థిని రోప్‌జంప్ పోటీల్లో జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. గుంటూరు, నంద్యాల, కడప ఈ సందర్భంగా జిల్లాల్లో జరిగిన రాష్ట్రస్థాయిపోటీల్లో పాల్గొని గోల్డ్‌మెడల్ సాధించినట్లు చెప్పారు. మధ్యప్రదేశ్, ఉజ్జయిని, మహారాష్ట్ర షిరిడీలో జరిగిన నేషనల్ స్థాయిపోటీలో గోల్డ్‌మెడల్ సాధించి, నేపాల్‌లో జరిగే ఇంటర్‌నేషనల్ స్థాయి రోప్ జంప్ పోటీలకు అర్హత సాధించిందన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో శ్రావణిని సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ నెల 6వ తేదీ నుంచి నేపాల్‌లోని ఖాట్మాండ్‌లో జరిగే పోటీలకు వెళ్లేందుకు నెల్లూరు జిల్లా జంప్‌రోప్ సెక్రటరీ మురళితో పాటు పలువురు ఉపాధ్యాయులు విద్యార్థినికి సహాయ సహకారాలు అందజేశారు.

మూలస్థానేశ్వరుడి
హుండీ ఆదాయం రూ.10.17లక్షలు

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో గురువారం హుండీల లెక్కింపు జరిగింది. గతేడాది సెప్టెంబరు 13 నుంచి గురువారం వరకు భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించగా రూ.10,17,239 వచ్చింది. ఈ కార్యక్రమానికి ముఖ్య పర్యవేక్షకులుగా పూడిపర్తి రామలింగేశ్వరస్వామి ఆలయ ఈవో శ్రీధర్‌నాయుడు వ్యవహరించారు. స్టేట్‌బ్యాంకు సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు, ఆలయ సిబ్బంది లెక్కింపులో పాల్గొన్నారు. ఆలయ ఈవో జే శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

పొగ మంచు...
ప్రమాదం పెచ్చు!

- రహదారులపై పొగ మంచు దుప్పటి
- ఉదయం 8 వరకు కనిపించని రోడ్లు
- డ్రైవర్లకు జాగ్రత్తలు తప్పనిసరి
- రెస్ట్ ఏరియాల్లోనే వాహనాలు నిలుపుకోవాలి
- తప్పని సరైతేనే ప్రయాణం చేయాలి



సంగం : ఉదయం 9 గంటలకు కూడా లైట్ల వెలుగుల్లో వాహనాల రాకపోకలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా జాతీయ రహదారులు వ్యాపించి ఉన్నాయి. ముఖ్యంగా చెన్నై - కోల్‌కతా జాతీయ రహదారి జిల్లా పొడవునా విస్తరించి ఉంది. ఈ రోడ్డు విశాలంగా ఉండటంతో వాహనాలు అతివేగంగా పరుగులు తీస్తుం టాయి. దీనికితోడు రోడ్డుపై ఎక్కువ భాగం పొగ మంచు పరుచుకుని ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు అధికంగా ఉన్నాయి. రోడ్లపై మంచు అధికంగా ఉన్నప్పుడు ఎదుటి వాహనాలు కనిపించక ఢీకొనడం వల్ల జరిగే ప్రమాదాలే 50 శాతం వరకు ఉన్నట్లు అంచనా. జాతీయ రహదారికి పక్కనే వరుసగా వాహనాలు నిలిపి ఉండటం మనం చూస్తూనే ఉంటాము. ఇలా నిలిపిన వాహనాల వల్ల తరచూ ప్రమాదాలు జరుగు తున్నాయి. హైవే అథారిటీ వారు పలుచోట్ల రెస్ట్ ఏరియాలను ఏర్పాటు చేసి ఉన్నారు. ఆయా ప్రాంతాల్లో వాహనాలను నిలిపి విశ్రాంతి తీసుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- పొగ మంచులో ప్రయాణించే వారు ముందుగా వాహనాల హెడ్‌లైట్ల పనితీరును చెక్ చేసుకోవాలి. ఒక లైటు మాత్ర మే పనిచేస్తున్నా, లైట్లు తక్కువ కాంతి తో వెలుగు తున్నా వెంటనే సరి చేయాలి. లేకపోతే ప్రయాణాన్ని మానుకోవాలి.
- దట్టమైన పొగమంచులో వెళ్లేటప్పుడు కారులోని విపత్తు హెచ్చరికల లైటును ఆన్ చేయాలి. ఇలా చేయడం ద్వారా రహదారి మీద కారు ఉనికిని ఇతర వాహనాలు గుర్తించే అవకాశం ఉంటుంది. విపత్తు హెచ్చరికల లైటు అంటే కారుకు నాలుగు వైపుల ఉన్న లైట్లు వెలుగుతూనే ఉంటాయి.
- పొగమంచులో వెళ్లే సమయంలో ఎదురుగా వచ్చే వాహనాల మీద దృష్టి సారిస్తూ చేతులను ఎప్పుడూ స్టీరింగ్ మీదనే ఉంచి మలుపుల్లో వెంటనే స్పందించి స్టీరింగ్‌ను తిప్పుతూ అదుపు చేసేలా ఉండాలి. ఇవన్నీ జరగాలంటే తక్కువ వేగంతో వాహనం నడపాలి.



సంగం : బ్యారేజీని కప్పేసిన మంచు

- జాతీయ, రాష్ట్రీయ రహదారులపై ఉన్న రేడియం లైటింగ్ గుర్తులను అనుసరిస్తూ వాహనం నడపాలి. వంతెనలు, ఇరుకైన రోడ్డు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన తెలుపు, పసుపు రంగుల్లో రోడ్డు మార్కులను గమనిస్తూ వాహనం నడపాలి.
- వాహనం ముందు, వెనుక అద్దాల మీద మంచు పేరుకున్నప్పుడు రహదారి సరిగా కనిపించదు. అయితే మంచును ఆటోమేటిక్‌గా కరిగించేందుకు కార్లలోని డీ ఫాగర్‌ను ఆన్ చేయాలి.
- మంచులో ప్రయాణం చేసే సమయంలో రోడ్డుపైనే దృష్టిని కేంద్రీకరించాలి. ఇందుకోసం వాహనాల్లోని మ్యూజిక్ సౌండ్‌ను తక్కువగా ఉంచుకో వాలి, పూర్తిగా ఆపేయడం ఉత్తమం.
- సాధారణ పరిస్థితుల్లోనే మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడం ప్రమాదకరం. ఇక, దట్టమైన పొగమంచు కమ్ముకున్నప్పుడు మద్యం సేవించిన వారు డ్రైవింగ్‌కు దూరంగా ఉండటం చాలా మంచిది.
- మంచులో డ్రైవింగ్ చేస్తున్నప్పుడు మీ ముందున్న వాహనానికి తగినంత దూరాన్ని పాటించాలి. దీని వల్ల ఆ వాహనాలు పొరపాటున ప్రమాదానికి గురైతే వెంటనే మనం పక్కకు తప్పుకునే అవకాశం ఉంటుంది.



నెల్లూరు నగరం, పరిసర ప్రాంతాలను పొగమంచు కమ్మేస్తోంది. ఉదయం 8.30 గంటల వరకు కూడా మంచు దుప్పటి విడవటం లేదు. నెల్లూరు రూరల్లోని 2వ డివిజన్ పెద్దచెరుకూరు వద్ద నివాసాలపై గురువారం ఉదయం తెల్లటి మంచు పరుచుకుని చూపరులకు ఆహ్లాదానుభూతినిచ్చింది. అయితే ఈ మంచు, చలి వల్ల చిన్నారులు, వృద్ధులు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. దీంతో పొద్దున్నే బయటకు వచ్చేందుకు సంకోచిస్తున్నారు.

- నెల్లూరు రూరల్,(ఆంధ్రజ్యోతి)

అత్యవసరమైతేనే ప్రయాణించండి

పొగ మంచు అధికంగా ఉన్న సమయంలో అత్యవసరం అనుకుంటేనే ప్రయాణం చేయాలి. అదికూడా తక్కువ స్పీడులో వాహనం నడపాలి. పూర్తి దృష్టి డ్రైవింగ్‌పై ఉంచాలి. రోడ్డు పూర్తిగా మంచుతో కమ్మేసి ఉంటే వాహనాలను రెస్ట్ ఏరియాలో పార్క్ చేసుకోవడం మంచిది. రోడ్డు పక్కనే వాహనాలు నిలిపే వారిపై చర్యలు చేపడతాము. వేగం కన్నా ప్రాణం మిన్న అని గుర్తించాలి.

- జీ చందర్, డీటీసీ

అన్నదాతకు భరోసా

- పెట్టుబడి సాయం రూ.10వేలకు పెంపు
- హర్షం వ్యక్తం చేస్తున్న కర్షకులు

నెల్లూరు (వ్యవసాయం), జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అన్నదాతలకు నూతన సంవత్సర కానుకను ప్రకటించింది. రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా నగదు అందిస్తున్న సాయాన్ని పెంచింది. వ్యవసాయానికి పెట్టుబడి సాయం కింద ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధిని (పీఎం కిసాన్) రూ.6వేల నుంచి 10వేలకు పెంచుతున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించడంతో కర్షకుల్లో ఆనందం నెలకొంది. ఇప్పటివరకు 18 విడతలుగా కేంద్రం సాయం అందించగా, 19వ విడత ఫిబ్రవరిలో అందించే అవకాశం ఉంది. కాగా, 2019లో ప్రారంభమైన పీఎం కిసాన్ పథకం ద్వారా పెట్టుబడి సాయం కింద ఏడాదిలో మూడు విడతలుగా రూ.6వేలు రైతుల ఖాతాల్లో కేంద్రం జమ చేస్తోంది. అయితే ఈ సాయాన్ని రూ.12 వేలకు పెంచాలని రైతు సంఘా లు, రైతులు కేంద్రం దృష్టికి తీసుకెళ్లాయి. నూతన సంవత్సరం కానుకగా రూ.10వేలకు పెంచు తున్నట్లు కేంద్రం ప్రకటించింది. కాగా, రాష్ట్ర ప్రభుత్వం అంది స్తున్న ఎన్టీఆర్ భరోసా మాదిరిగా కాకుండా కొన్ని షరతులతో పీఎం కిసాన్ పథకం వర్తింపజేస్తోంది. వెబ్‌ల్యాండ్‌లో వివరాలు సరిగా లేకపోవడం, ప్రభుత్వ ఉద్యోగం, ప్రభుత్వ పింఛను, ప్రజాసాధికార సర్వేలో నమోదు కాకపోవడం వంటి పలు కారణాలతో అర్హత కలిగిన వారు సైతం తిరస్కరణకు గురవుతున్నారు.

జిల్లాలో 1,67,240 మందికి లబ్ధి

2019లో జిల్లాలో దాదాపు 2.51లక్షల మంది రైతులకు పీఎం కిసాన్ పథకం లబ్ధి చేకూరింది. ఆ తరువాత నిబంధనల పేరుతో లబ్ధిదారుల సంఖ్యను కుదిస్తూ 1,67,240లకు చేరింది. కేంద్రం ప్రకటించిన రూ.10వేలు మూడు విడతల్లో అందుతుందా లేదంటే ఐదు విడతలుగా ఇస్తారా అనేది తెలియాల్సి ఉంది. రెండు విడతల్లో రూ.3వేలు చొప్పున మరో విడతలో రూ.4వేలు అందించే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

పార్కులకు మహర్దశ

- నెల్లూరులో 24 పార్కుల అభివృద్ధికి టెండర్లు
- ఎన్‌క్యాప్ ప్రోగ్రాం కింద రూ.4 కోట్లు మంజూరు
- ఆట వస్తువులు, జిమ్ సదుపాయాలు

నెల్లూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఏ పార్కు చూసినా ఏమున్నది గర్వకారణం అన్న రీతిలో నెల్లూరు నగరంలో పార్కులు తయారయ్యాయి. వైసీపీ పాలన ఐదేళ్లలో వీటిని పట్టించుకున్న నాథుడు లేకపోవడంతో అధ్వాన్న దుస్థితికి చేరుకున్నాయి. కొత్త పార్కులను అభివృద్ధి చేయడం అటుంచితే కనీసం ఉన్న పార్కుల్లో వసతులు కల్పించడం కూడా గగనమైంది. ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వం రావడంతో పార్కుల రూపురేఖలు మారుతున్నాయి. ఇటీవలే కొన్ని పార్కుల్లో చెత్తను తొలగించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురాగా, తాజాగా మరికొన్ని పార్కులను అభివృద్ధి చేసేందుకు చర్యలు మొదలయ్యాయి. నెల్లూరు నగరంలో మొత్తం 60 పార్కులు ఉండగా వాటిలో 24 పార్కులను పూర్తిగా అభివృద్ధి చేసేందుకు టెండర్లు ఆహ్వానించారు. నేషనల్ క్లీన్ అండ్ ఎయిర్ ప్రోగ్రాం(ఎన్‌క్యాప్) కింద నగరానికి రూ.4 కోట్లు నిధులు మంజూరయ్యాయి. వాటితో ఆ 24 పార్కులను అభివృద్ధి చేయనున్నారు. పిల్లల ఆట వస్తువులను ఏర్పాటు చేసి జిమ్ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. తొలి దశ అభివృద్ధి పనులకు ముఖ్యమైన ప్రాంతాల్లోని పార్కులనే ఎంపిక చేశారు. దీనికి సంబంధించి ప్రస్తుతం మున్సిపల్ కార్పొరేషన్ టెండర్లు ఆహ్వానించింది. ఒకటి, రెండు నెలల్లో పార్కుల్లో వసతులు అందుబాటులోకి రానున్నాయి. మలి దశలో మిగిలిన పార్కులను కూడా అభివృద్ధి చేసేందుకు కార్పొరేషన్ అధికారులు ప్రణాళికలు రూపొందించుకున్నారు.



ఆర్ఐసీయూ విభాగాన్ని ప్రారంభిస్తున్న వైద్య నిపుణులు

జీజీహెచ్‌లో
ఆర్ఐసీయూ ప్రారంభం

నెల్లూరు (వైద్యం), జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి(జీజీహెచ్)లో గురువారం నూతన రెస్పిరేటరీ ఇంటెన్సివ్ కేర్ యూనిట్(ఆర్ఐసీయూ)ను ప్రారంభించారు. మత్తు వైద్య విభాగం హెచ్‌వోడీ డాక్టర్ శ్రీనివాసరావు, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ గంగాధర్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్‌బాషా ఈ యూనిట్ ను ప్రారంభించారు. డాక్టర్ మస్తాన్‌బాషా మాట్లాడుతూ ఈ విభాగం ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించవచ్చని తెలియచేశారు. అనేక శస్త్ర చికిత్సలకు ఆర్ఐసీయూ కీలకమని చెప్పారు. ఈ కార్యక్రమంలో అనస్థీషియా ప్రొఫెసర్ డాక్టర్ శాంతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎంత ఖర్చయినా సరే.. తప్పించుకోవాల్సిందే!

- 'పెరంకొండ' అక్రమార్కుల ప్రయత్నాలు
- విచారణాధికారులను మేనేజ్ చేసే కుట్ర
- అక్రమాలు జరగలేదని చూపించే యత్నం
- ఓ ఎమ్మెల్యేను కలిసిన దళారులు
- తిట్టి పంపిన సదరు ప్రజాప్రతినిధి

నెల్లూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : కండలేరు ప్రాజెక్టు కింద ముంపు ప్రాంతం కాకపోయినా ముంపు కింద చూపించి కలువాయి మండలం పెరంకొండలో సుమారు రూ.వంద కోట్లు ప్రజాధనాన్ని పరిహారం కింద చెల్లించారని రెండేళ్ల క్రితం కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. దీంతో అప్పటి జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ సుమారు 8 నెలలపాటు సర్వే, రెవెన్యూ, ఆర్అండ్‌బీ అధికారులతో విచారించి అక్రమాలు జరిగినట్లు నిర్ధారించారు. ముంపు పేరిట అధికంగా చెల్లించినదే సుమారు రూ.33 కోట్లు ఉన్నట్లు గుర్తించి ఈ నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. అయితే ఈ కుంభకోణంలో ఐఏఎస్, డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులు కూడా ఉండట ంతో ఆ నివేదికను తొక్కి పెట్టారు. కాగా పరిహారం చెల్లించినా ఆ గ్రామం ఖాళీ చేయకపోగా మళ్లీ ప్రజాధనంతో అభివృద్ధి పనులు చేపట్టడంపై గతంలోనే అనేక ఫిర్యాదులు ఉన్నాయి. ఇదిలా ఉంటే ఈ స్కామ్‌లో కీలకంగా వ్యవహరించిన ఓ దళారి.. ఆ తర్వాత కూడా తన అక్రమ మార్గాన్ని వదల్లేదు. ఇచ్చిన పరిహారం చాలదని, ఇంకా కావాలంటూ ఆర్అండ్ఆర్ అథారిటీలో కేసు వేశారు. అలానే ఇంకొంత మందికి పరిహారం అందలేదని, వారికి కూడా రూ.24 కోట్లు పరిహారం చెల్లించాలంటూ మరో కేసు కూడా నడుస్తోంది. ఎప్పుడో 30 ఏళ్ల క్రితం నిర్మించిన కండలేరు జలాశయం కింద ఇంకా పరిహారం పేరిట కేసులు వస్తుండటం, వాటి వెనక కొందరు దళారులు పర్సంటేజీలు మాట్లాడుకొని కీలకంగా వ్యవహరిస్తున్న విషయాలు ప్రభుత్వం దృష్టికి వచ్చాయి. దీంతో ముంపు పేరిట విచ్చలవిడిగా జరుగుతున్న ప్రజాధనం దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు కూటమి ప్రభుత్వం నడుంబిగించింది. పెరంకొండ విచారణ ఫైల్‌ను బయటకు తీసి విజిలెన్స్ విభాగానికి అప్పగించింది.

తప్పించుకునేందుకు కుట్రలు

నెల రోజుల క్రితం జిల్లా విజిలెన్స్ అధికారులకు ఆదేశాలు అందగా, ఆ వెంటనే వారు విచారణ ప్రారంభించారు. జేసీ నివేదికను, పరిహారం చెల్లింపు ఫైల్స్‌ను పరిశీలిస్తూ క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు. ఇప్పటికే పెరంకొండలో డీజీపీఎస్ సర్వే నిర్వహించారు. ఆ గ్రామం కండలేరు కాంటూర్ పరిధిలోకి (ముంపు ప్రాంతం పరిధి) వస్తుందా? రాదా? అన్నది నిర్ధారించే పనిలో ఉన్నారు. గ్రామంలో ఓ కాలనీ మాత్రమే ముంపు కిందకు వస్తుందని, కానీ అందుకు విరుద్ధంగా మొత్తం గ్రామానికి పరిహారం చెల్లించినట్లు ప్రాథమికంగా నిర్ధారించుకున్నట్లు సమాచారం. అదే సమయంలో అడ్వకేట్‌గా చెప్పుకుంటూ ఈ స్కామ్‌లో కీలకంగా వ్యవహరించిన ఓ దళారి పాత్రపై కూడా ఆరా తీస్తున్నారు. నెల్లూరుకు 70 కి.మీ దూరంలో ఉన్న గ్రామస్థులకు అక్కడి బ్యాంకులను కాదని నెల్లూరులోని ఓ ప్రైవేటు బ్యాంకులోనే ఎందుకు.. ఎలా.. ఖాతాలు తెరిచారు? ప్రభుత్వం నుంచి ఆ ఖాతాల్లో పరిహారం జమయ్యాక ఏఏ ఖాతాలకు డబ్బులు మళ్లించారు? అన్నది కూడా పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఇలా మొత్తం తీగలాగితే ఈ దళారీతోపాటు వివిధ స్థాయిల అధికారుల పాత్ర కూడా బట్టబయలవుతుంది. అందుకోసమే ఈ విచారణ ముందుకు సాగకూడదని అక్రమార్కులు తెరవెనుక తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. పెరంకొండ గ్రామం ముంపు కిందకే వస్తుందని విచారణలో చెప్పించుకోవడంతోపాటు పరిహారం కూడా నిబంధనల ప్రకారమే జరిగిందని రాయించుకునేందుకు 'ఎంత ఖర్చయినా పరవాలేదు..' అన్న ఆయుధాన్ని బయటకు తీసినట్లు ప్రచారం జరుగుతోంది. ఆ క్రమంలోనే తాజాగా ఓ ఎమ్మెల్యేను అక్రమార్కులు కలవగా ఆయన వీరిపై సీరియస్ అయినట్లు సమాచారం. మరి ఈ ప్రభుత్వంలోనైనా పెరంకొండ ముంపు పేరిట జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకుంటారా.. అన్నది ఆసక్తిగా మారింది. ఒక్కసారి అక్రమార్కులపై చర్యలు తీసుకుంటే మరొకరు ప్రజాధనం దోపిడీ చేసేందుకు భయపడతారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

చెత్త కుప్పలు.. పేడ దిబ్బలు

- చెంచులక్ష్మీపురంతోపాటు ఆరు గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- జ్వరాల బారిన గ్రామస్థులు


సీఎల్‌పురం అంతర్గత రోడ్ల వద్ద పేడదిబ్బలు


సీఎల్ పురం ఆర్అండ్‌బీ రోడ్డుపైన ఉన్న చెత్త

బిట్రగుంట, జనవరి2 (ఆంధ్రజ్యోతి):మండలంలోని చెంచులక్ష్మీపురంలో పారిశుధ్యం కొరవడింది. గ్రామానికి వెళ్లే రోడ్లతో పాటు కాలనీల్లోని అంతర్గత రోడ్లను చెత్త, చెదారం, వ్యర్థపదార్థాలు వేస్తున్నారు. కొన్నిచోట్ల మేతవాములు వేయడంతో కాలనీ ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అపరిశుభ్ర వాతావరణంతో గ్రామాల ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు.

పీడిస్తున్న విషజ్వరాలు

మేజర్ పంచాయతీలోని చెంచులక్ష్మీపురంలో నవంబరు 20వ తేదీ నుంచి నేటి వరకు విషజ్వరాలతో స్థానికులు అల్లాడిపోతున్నారు. వడ్డిపాలెం నుంచి మొదలైన జ్వరాలు ముస్లిం బజారు కాలనీల్లో 100మంది జ్వర పీడితులు ఉన్నారు.

పట్టించుకోని అధికారులు

ఈ సమస్యపై పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. మొక్కుబడిగా పనులు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. డిసెంబరు 20వ తేదీ పంచా యతీ కార్యదర్శి ఈవోపీఆర్డీలతో పాటు ప్రజాప్రతినిధులు తిరిగి పరిశీలించినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని వడ్డిపాలెం ప్రజలు వాపోతున్నారు. గ్రామంలో పెద్దలు వేసిన పేడదిబ్బల తొలగింపు, ఆర్ అండ్‌బీ రోడ్డుపై పోస్తున్న చెత్తచెదారం తొలగించడం లేదని చెబుతున్నారు. అలాగే ఇబ్రహీంపేట, కొండబిట్రగుంట, ముంగ మూరు, నాగులవరం, తదితర గ్రామ పంచాయతీలో ఈ పరిస్థితి ఉంది. లక్షల రూపాయలతో నిర్మించిన సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రాలు నేడు నిరుపయోగంగా ఉన్నాయి. వీటి వినియోగంలోకి తీసుకొస్తే గ్రామాల్లో శుభ్రత నెలకొంటుందని ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సీఎల్‌పురంలో వైద్యశిబిరం

బిట్రగుంట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం చెంచులక్ష్మీపురంలో గురువారం కోవూరుపల్లి పీహెసీ వైద్యులు జిహారిక ఆధ్వర్యంలో సిబ్బంది వైద్యశిబిరం నిర్వహించారు. అనంతరం ఇంటింటా లార్వా సర్వే నిర్వహించారు. ఇళ్ల మధ్య ఉన్న పేడది బ్బలు తొలగించాలని సంబంధి రైతులకు సూచించారు. ఇదివరకు ఉన్న జ్వరపీడుతులకు పరీక్షలు నిర్వహించి మందులతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు జిహారిక, సిబ్బంది

ఉపాధి నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం

- శ్రీనివాసరావు, పీఆర్ ఏఈ లింగసముద్రం

ఇంటర్వ్యూ...



లింగసముద్రం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వం మండలంలోని 16 గ్రామపంచాయతీల్లో 14 పంచాయతీల కు రూ.3కోట్ల ఉపాధిహామీ పథకం నిధులు విడుదల చేసిందని మండల పీఆర్ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. నిధులతో 34సీసీ రోడ్ల నిర్మాణం చేపటడతామన్నారు.

? నిర్మాణాలు ఏ దశలో ఉన్నాయి

! మండలంలో 28 రోడ్లు పూర్తి య్యాయి. మరో 4రోడ్లు నిర్మాణ దశలో, మరో 2 రోడ్లు మార్పు చేయాల్సి ఉంది.

? పాల వెల్లువ కేంద్రాలు ఎన్ని ఉన్నాయి :

జ. 13 సచివాలయాల పరిధిలో 13 పాలవెల్లువ కేంద్రాలు నిర్మించారు. వాటిలో కొన్ని నిర్మాణాలు పూర్తికాగా, మరికొన్ని అసంపూర్తిగా ఉన్నాయి.

? ప్రస్తుతం వాటిని ఏం చేయబోతున్నారు ?

జ. ప్రభుత్వ ఆదేశాలు మేరకు చర్యలు తీసుకుంటాం.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

అల్లూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యలు పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు లక్ష్మీనారాయణ తెలిపారు. స్థానిక సచివాలయం-1 వద్ద గురువారం నిర్వహించిన సదస్సులో పాల్గొని అర్జీలను స్వీకరించారు. అనంతరం భూ రికార్డులను పరిశీలించి సమస్య పరిష్కారమయ్యే తేదీని తెలిపారు. కార్యక్రమంలలో ఆర్ఐ, వీఆర్వో ఉన్నారు.

- వలేటివారిపాలెం: రెవెన్యూ సమస్యలు పరిష్కారానికే ప్రభుత్వం సదస్సులు ప్రారంభించినట్లు తహసీల్దార్ అబ్దుల్‌అమీద్ తెలిపారు. పోలినేని చెరువులో సదస్సులో తహసీల్దార్ పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రసాద్, మండల సర్వేయర్ గోపిరెడ్డి పాల్గొన్నారు.

షెడ్యూలు ప్రకారం జరగని గ్రామసభలు

కొండాపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సర్పంచులు అందుబాటులో లేకపోవడంతో మండలంలో గురువారం షెడ్యూలు ప్రకారం జరగాల్సిన గ్రామ సభలు జరుగలేదు. పంచాయతీలలో అభివృద్ధి పనులపై ఏడాదికి నాలుగుసార్లు ఈ గ్రామసభలు జరగాల్సి ఉంది. సర్పంచ్ అధ్యక్షతన సభ్యులు సమావేశమై పంచాయతీలో 3నెలల కాలంలో జరగాల్సిన పనులపై చర్చలు జరిపి తీర్మానాలు చేయాల్సి ఉంటుంది. మండలపరిధిలో 19పంచాయతీలుండగా గురువారం 11పంచాయతీల్లో గ్రామసభలు జరిగేటట్లు అధికారులు ముందుగానే షెడ్యూలు ప్రకటించినా కేవలం గరిమెనపెంట, గొట్టిగుం డాల పాలెం, తూర్పుఎర్రబల్లిలో మాత్రమే గ్రామసభలు నిర్వహించారు. మిగిలిన సర్పంచులు అందుబాటులో లేకపోవడంతో అధికారులు వాయిదా వేశారు.

డీలర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కావలి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) కావలి డివిజన్‌లోని 10మండలాల్లోని 86 చౌక దుకాణాల డీలర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్డీవో వంశీక్రిష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు స్థానికులై ఉండి ఇంటర్ ఉత్తీర్ణత అర్హతలు కలిగి ఉండాలన్నారు. 18 నుంచి 40 సంవత్సరాల వయస్సు కలిగిన అభ్యర్థులు ఈ నెల 10 వతేదీ సాయంత్రం 5 గంటల లోపు కావలి ఆర్డీవో కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. ఈ నెల 19న కావలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 10గంటల నుంచి 12 గంటల వరకు రాత పరీక్ష నిర్వహిస్తామన్నారు.

దివ్యాంగుల హక్కులపై అవగాహన పెంచుకోవాలి

కావలి టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు.. హక్కుల చట్టంపై అవగాహన పెంచుకోవాలని లోక్ అదాలత్ సభ్యులు మాలకొండారెడ్డి సూచించారు. దివ్యాంగుల సంక్షేమం కోసం పనిచేస్తున్న సంక్షమ్ ఆధ్వర్యంలో గురువారం పాతూరు లక్ష్మీ ఫిజియోథెరపీ ఆసుపత్రి ఆవరణలో దివ్యాంగుల చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లి మానసికంగా బలంగా తయారు కావాలన్నారు. దివ్యాంగుల చట్టంపై అవగాహన పెంచుకుని ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అంది పుచ్చుకోవాలన్నారు. దివ్యాంగులను ఎవ్వరైనా అవమానించినా చులకనగా మాట్లాడినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చని చెప్పారు. దివ్యాంగులు అన్యాయాలకు గురైనప్పుడు హక్కుల సాధనకు లోక్ అదాలత్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని, ఉచిత న్యాయపరమైన సహాయ సహకారాలు అందుకుని రక్షణ పొందాలన్నారు. ఈ సందర్భంగా సంక్షమ్ బాధ్యులు మాలకొండారెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో సంక్షమ్ దివ్యాంగుల సంస్థ నాయకులు ఆసుపత్రి నిర్వాహకులు మాధవరెడ్డి, వేణుగోపాల్, కృష్ణారావు, నాగమణి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉదయ్‌పూర్ ఎన్‌సీసీ శిబిరానికి 'ప్రకాశం' విద్యార్థి

కందుకూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్ రాష్ట్రంలోని ఉదయ్‌పూర్‌లో శనివారం ప్రారంభం కానున్న ఎన్‌సీసీ డైరక్టరేట్ క్యాంప్‌నకు ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థిని ప్రియంవద ఎంపికైనట్లు కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి 150మందిని ఎంపిక చేయగా ఇందులో 34ఏ బెటాలియన్‌లోని 9కళాశాలల నుంచి ఇద్దరు విద్యార్థినులు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

బీటీఏ కేలండర్ ఆవిష్కరణ

వలేటివారిపాలెం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మార్సీలో బీటీఏ క్యాలెండర్‌ను ఎంఈఓ-2 మల్లికార్జునరావు, శాఖవరం హైస్కూల్ హెచ్‌ఎం చెన్నయ్య చేతుల మీదుగా సంఘం సభ్యులు గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీటీఏ రాష్ట్ర అడిషనల్ సెక్రటరీ సంగా మహేంద్ర, జిల్లా కౌన్సిలర్ మెండా వెంకట్రావు, నాయకులు వలేటి మాలకొండయ్య, దేవూరి శివనారాయణ, దార్ల ఆదినారాయణ, సవలం సూర్యనారాయణ, చల్లా బ్రమ్మయ్య, రమణయ్య తదితరలు పాల్గొన్నారు.

పంటలకు అధిక యూరియా వాడరాదు

వలేటివారిపాలెం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పంటలకు అధిక యూరియా వినియోగిస్తే అనర్థమే అని ఏఓ హేమంత్‌భరత్‌కుమార్ రైతులకు సూచించారు. పోలినేనిచెరువు, అంకభూపాలపురంలో గురువారం నిర్వహించిన పొలం పిలుస్తోందిలో పాల్గొని వరి, మిర్చి పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు రవీంద్ర, నాగరాజు రైతులు పాల్గొన్నారు.

బీపీసీఎల్‌కు కేబినెట్ ఆమోదంపై హర్షం

కందుకూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రామాయపట్నం పోర్టు సమీపంలో బీపీసీఎల్ రిఫైనరీ ఏర్పాటుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదంతో పాటు రామాయపట్నం పరిసరాల్లో 6వేల ఎకరాల భూమిని సమకూర్చాలని నిర్ణయించటంపై కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గురువారం సాయంత్రం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. బీపీసీఎల్ ఏర్పాటయితే నియోజకవర్గంలోని యువతీయువకులకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

వలేటివారిపాలెం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక హైస్కూల్‌లోని 10వ తరగతి విద్యార్థులకు అమ్మపాలెం చల్లకొలుసు నరసింహం గురువారం ఎంఈఓ మల్లికార్జునరావు చేతుల మీదుగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కమల్‌కుమార్, అశోక్‌బాబు, టీచర్లు పాల్గొన్నారు.

బీజేపీ పట్టణాధ్యక్షుడిగా మందా కిరణ్‌కుమార్

కావలి టౌన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): బీజేపీ స్థానిక ఒకటో పట్టణాధ్య క్షుడిగా మందా కిరణ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు బ్రహ్మానందం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర సహ కోశాధికారి కందుకూరి సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భరత్ కుమార్, రిటర్నింగ్ అధికారి కమల, జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్ సింగ్, జిల్లా ఉపాధ్యక్షురాలు మాధవి రెడ్డి, సీపీసీ సత్యం, రమణా రెడ్డి, వెంకటసుబ్బారావు పాల్గొని కిరణ్ కుమార్‌ను అభినందించారు.


ఎన్నిక పత్రాన్ని అందుకుంటున్న మందా కిరణ్‌కుమార్

న్యూస్ బాక్స్

ముగ్గురిపై కేసు

అల్లూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): దాడి చేసిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిషోర్ బాబు గురువారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. అల్లూరు తిరునాళ్ల నిమిత్తం నిర్వహించిన పాటకచేరి వద్ద జరిగిన ఘర్షణలో పచ్చబట్ల సతీష్‌తో పాటు మరో నలుగురిపై తీవ్రంగా దాడిచేసిన కేసులో అల్లూరు గొల్ల రాము, కాకాని యశ్వంత్, గంగపట్నం జీవన్‌పాల్ అనే యువకులపై హత్యాయత్నం కేసు నమోదు చేశామన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శన


చిన్నారులచే కేక్ కట్ చేయిస్తున్న జయచంద్ర నాయుడు

కావలి టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెంగళరావునగర్ నృత్య కళా నిలయంలో నూతన సంవత్సరం పురస్కరించుకుని నాట్య గురువు లిఖిత ఆధ్వర్యంలో గురువారం చిన్నారులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమం అలరించింది. ముందుగా ముఖ్య అతిథిగా పాల్గొన్న పారిశ్రామికవేత్త జయ చంద్రానాయుడు చిన్నారులతో కేక్ కట్ చేసి వారికి పంపిణీ చేశారు. కార్య క్రమంలో స్థానిక వార్డు టీడీపీ నాయకులు శానం హరి, ఎమ్‌వీఎస్ ప్రసాదరావు, రఘుకుమార్ రెడ్డి, జాఫర్‌ఖాన్ పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా సుచేతానగర్ పరిసరాలు

కావలి రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెద్దపవని రోడ్డులోని సుచేతానగర్ పరిసర ప్రాంతాలు మందుబాబులకు అడ్డాగా మారాయని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నగర్‌కు చుట్టూ అటవీ ప్రాంతం కావటంతో మందుబాబులు మద్యంతో ఇక్కడికి వచ్చి ఉదయం మొదలు రాత్రి వరకు మద్యం సేవిస్తున్నట్లు తెలిపారు. ఈ సమస్యతో స్థానిక గిరిజన మహిళలు పశువులు, జీవాలు మేపు కుంటూ.. కూలిపనులు చేసుకునే వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మహిళలు ఇళ్ల నుండి బయటకు రావటానికి జంకుతున్నారు. ఈ పరిసర ప్రాంతాలల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా చూశాం

అల్లూరు, జనవరి 2 (ఆంధ్రజోతి): ముగ్గురమ్మల తిరునాళ్లకు వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చర్యలు తీసుకున్న ఆలయ కమిటీ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ విషయంపై గురువారం ఆయన స్థానిక నివాసంలో గురువారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. అమ్మవార్ల గ్రామోత్సవానికి తరలిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అధికార యంత్రాంగం అన్ని విధాలా చర్యలు తీసుకుందన్నారు. అదేవిధంగా విద్యుత్ దీపాలంకరణ, పూలాలంకరణ చేపట్టిన కార్మికులకు ఆయన శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో బాలకృష్ణంరాజు, గోవిందరెడ్డి, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, హరికృష్ణారెడ్డి, సురేష్, కోటి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న విష్ణువర్ధన్ రెడ్డి

రేపటి నుంచి ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

ఆత్మకూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న ఇంటర్ విద్యార్థులకు శనివారం నుంచి మధ్యాహ్న భోజన పథకాన్ని అందించడానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. టీడీపీ హయాంలో ఇంటర్ విద్యార్థుల కోసం 2018లో ఈ పథకాన్ని అమలు చేసింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత దీన్ని అటకెక్కిం చింది. దీంతో ఐదేళ్లుగా విద్యార్థులు ఇబ్బందులు పడు తూ చదువు పూర్తిచేయాల్సి వచ్చింది. కూటమి ప్ర భు త్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇంటర్ పాఠ్య పుస్త కాలు, నోటుపుస్తకాలను ఉచితంగా అందించింది. తాజాగా మధ్యాహ్న భోజన పథకం అమలుకు చర్యలు చేపట్టింది. ఈ పథకం పునరుద్ధరణతో మేలు జరు గు తుందని అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అన్ని ఏర్పాట్లు చేశాం..

కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడానికి సామాగ్రి సమకూర్చాం. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొస్తున్న ఈపథకం హర్షించదగినది. మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారు. ఆత్మకూరు జూనియర్ కాలేజీ లో 400మంది విద్యా ర్థులకు భోజనవసతి సమకూరనుంది.

- వాణిశ్రీ, ప్రిన్సిపాల్, ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కాలేజ


ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు

ఎస్‌ఎంసీ చైర్మన్లు, హెచ్‌ఎంలకు శిక్షణ

వింజమూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్‌లకు శిక్షణ కార్యక్రమం ఎంఈవో మధుసూదన్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. పాఠశాలల అభివృద్ధి ప్రణాళికలను తయారుచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాలకొండయ్య, శివకోటరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ప్రసాద్, పాల్గొన్నారు.

కమిటీలు కీలక భూమిక

- లింగసముద్రం: పాఠశాలల అభివృద్ధిలో స్కూల్ మేనేజ్‌మెంటు కమిటీలు కీలక భూమిక పోషించాలని ఎంఈఓ-1 కెరవికుమార్, ఎంఈఓ-2 ఎంవి శివకుమార్‌లు తెలిపారు. గురువారం లింగసముద్రం కేఆర్ జడ్పీ హైస్కూల్‌లో ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులకు ఇచ్చిన మండలస్థాయి శిక్షణలో పాల్గొని మాట్లాడారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం, మంచినీటి వసతి, విద్యార్థుల సామర్థ్యాలు గురించి సలహాలు ఇచ్చారు. ఎస్‌ఎంసీ కమిటీ సభ్యుల విధులు, బాధ్యతల గురించి వివరించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ చైర్మన్లు మాధవరావు, సూర్యప్రకాశరావు, శ్రీనివాసులు, షేక్ మహ్మమద్ హఫ్తార్, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.
- కొండాపురం: పాఠశాల అభివృద్ధిలో యాజమాన్య కమిటీలు ఎంతో కీలకమని ఎంఈవో 1,2 కే.రవికుమార్, ఆనందరావులు తెలిపారు. మండల పరిధిలోని 66 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, యాజ మాన్య కమిటీల చైర్మన్ల పాత్రపై గురువారం మండలకేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో శిక్షణ ఇచ్చారు. కమిటీ చైర్మన్ల విధులపై రిసోర్స్ పర్సన్లు అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారులు పర్యవేక్షించారు.

కమిటీలు ప్రతిరోజు పాఠశాలలను సందర్శించాలి

- ఉదయగిరి: పాఠశాలల అభివృద్ధిలో పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్‌ఎంసీ)ల పాత్ర కీలకమైందని ఎంఈవో-2 తోట శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో మండలంలోని ప్రధానోపాధ్యాయులు, ఎస్‌ఎంసీల చైర్మన్‌లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌ఎంసీ చైర్మన్ లేదా సభ్యులు ప్రతిరోజు పాఠశాలను సందర్శించి పరిశుభ్రత, తాగునీరు తదితరంశాలను పరిశీలిస్తూ పాఠశాలల అభివృద్ధికి చర్యలు చేపట్టలన్నారు. అనంతరం ఎస్‌ఎంసీల విధులు, బాధ్యతలను ప్రధానోపాధ్యాయులు, ఎస్‌ఎంసీ చైర్మన్‌లకు తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో రిసోర్సుపర్సన్‌లు రామకృష్ణా రెడ్డి, ఫణికుమార్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వింజమూరు : మాట్లాడుతున్న ఎంఈవో


లింగసముద్రం: ప్రసంగిస్తున్న ఎంఈవోలు


ఉదయగిరి: మాట్లాడుతున్న ఎంఈవో

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ


చెక్కులు అందుకున్నవారితో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి కింద నియోజకవర్గంలోని 15మందికి మంజూరైన రూ.13.39 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బాధిత కుంటుంబసభ్యులకు అందజేశారు. ఇప్పటివరకు 250మంది దరఖాస్తు చేసుకుంటే 37మందికి చెక్కులు అందజేశామన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, మాదాల లక్ష్మీనరసింహ్మం, చిలకపాటి మధు, బెజవాడ ప్రసాదు, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ శాఖ మంత్రి పర్యటన వాయిదా

ఈ నెల 3న రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి నిర్వహించ తలపెట్టిన సాలిపేట, కర్లపాలెం పునరావాస కాలనీల భూమిపూజ, రామాయపట్నం పోర్టు పర్యటన వాయిదా పడినట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అత్యవసర సమావేశాలతో ఈ కార్యక్రమాలను వాయిదా వేసుకున్నట్లు సమాచారం అందినట్లు చెప్పారు. సంక్రాంతి పండుగల అనంతరం ఈ కార్యక్రమాన్ని చేపడతామన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా అన్ని గ్రామాల నుంచి తరలివచ్చిన శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ నాయకులు, కార్యకర్తలకు, అధికారులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. రాళ్లపాడు గేటు సమస్యను శాశ్వతంగా పరిష్కరించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

వలేటివారిపాలెం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోకూరు- నూకవరం జాతీయ రహదారిపై గురువారం రాత్రి 9గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రోళ్లపాడు ఎస్సీ కాలనీకి చెందిన చొప్పర వేణు (38) దుర్మరణం చెందాడు. మృతుడు కందుకూరు ప్రయివేట్ ఆసుపత్రులో ఉన్న తమ కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లి తిరిగి మోటారుబైకుపై రోళ్లపాడు వస్తుండగా కందుకూరు వెళ్తున్న పాట ఆటో ఢీకొనడంతో ఈ ప్రమాదంలో చోటుచేసుకుంది. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ మరిదినాయుడు తమ సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారమే రెవెన్యూ సదస్సుల లక్ష్యం

ఆత్మకూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహసీల్దారు వి సుధీర్, ఎంపీడీవో పి ఐజాక్‌ప్రవీణ్ తెలిపారు. గురువారం మండలంలోని దేపూరులో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ ససందర్భంగా మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఆన్‌లైన్‌లో పొందుపరిచి సత్వర పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం లబ్ధిదారులకు పింఛను నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రావిళ్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు పింఛను నగదు అందజేస్తున్న ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్

సాయినాథుడికి ప్రత్యేక పూజలు

బిట్రగుంట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): బోగోలు రాజావీధిలోని సాయి నాథుడికి నూతన సంవత్సరం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మానికల సుబ్బరామయ్య, కుమారుడు సురేష్ కుటుంబ సభ్యులు ఈ సందర్భంగా అన్న సంతర్పణ చేపట్టారు. రాత్రి సాయినాథుని పల్లకీ సేవ చేపట్టారు.


సాయినాథుడికి హారతి ఇస్తున్న అర్చకులు

ఎంఈవో కార్యాలయంలో హెచ్‌ఎంలకు శిక్షణ

ఏఎస్ పేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంఈవో కార్యాలయంలో గురువారం ప్రధానోపాధ్యాయులు, ఎస్‌ఎంసీల చైర్మన్‌లకు శిక్షణా కార్యక్రమం ఎంఈవోలు ఎం జ్యోతి, డి సాయిప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రిసోర్స్‌పర్సన్స్‌గా ఎం హరిప్రసాద్, బి గణపతి, సిహెచ్ రాజారామిరెడ్డి వ్యవహరించారు.

●చేజర్ల: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో మండలంలోని పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్, ప్రధానోపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి డిసి మస్తానయ్య, డిఆర్‌పిలు సుబ్రమణ్యం, రమణయ్య యాజమాన్య కమిటీ చైర్మన్‌లు, ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

వెంగారెడ్డిపాళెంలో గ్రామసభ

సంగం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగారెడ్డిపాళెంలో సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన గురువారం పంచాయతీ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ఉపాధి హామీ పనులు, సిమెంట్ రోడ్ల నిర్మాణం తదితర పనులను వివరించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ ఉదయ్‌కుమార్, సచివాలయ సిబ్బంది, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

వరద నీటి తొలగింపుపై తాత్కాలిక చర్యలు

కావలి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): సర్వాయపాలెం, ఆముదాలదిన్నె, కొనదిన్నె, రామచంద్రాపురం, జువ్విగుంటపాలెం,తాళ్లపాలెం గ్రామాల్లోని పంట పొలాల్లో నిలిచిన వరదనీటిని తొలగించేందుకు గురువారం జలవనరుల శాఖ అధికారులు తాత్కాలిక చర్యలు తీసుకున్నారు. ఎక్సకవేటర్‌తో కొండేపి వరద కాలువలోని పూడికను తొలగించి వరదనీరు కిందికి వెళ్లేలా చర్యలు తీసుకున్నారు.

హెచ్‌ఎంకు సత్కారం

అనంతసాగరం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కామిరెడ్డిపాడు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వసుంధరాదేవిని గురువారం ఉపాధ్యాయులు సత్కరించారు. పాఠశాలకు రాని విద్యార్థుల పట్ల హెచ్‌ఎం దృష్టి సారించి వారి ఇళ్లకు వెళ్లి బడికి వచ్చేలా ప్రోత్సాహం అందించడంతో పాటు వారి పట్ల శ్రద్ధ చూపుతున్న సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ శాలువలతో ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మనోజ్‌కుమార్, వెంకటరమణరాజు పాల్గొన్నారు.